తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

సోమవారం 24.08.2026 | సంపుటి : 13 | సంచిక : 35 | పేజీలు : 12 | వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698





## జర్నలిస్టుల హక్కులు హరిస్తుంటే

# మౌనం వహిస్తున్నారెందుకు?

## వీధులన్నీ నిశబ్దంగా ఎందుకున్నాయ్..!?

జర్నలిస్టుల హక్కులు హరిస్తుంటే అసలు మౌనంగా ఎందుకుంటున్నారని, వీధులన్నీ నిశబ్దాన్ని ఎందుకు తలపిస్తున్నాయని సుప్రీంకోర్టు రిటైర్డ్ జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి ప్రశ్నించారు. ప్రధాన స్రవంతిలో ఉన్న కొన్ని మీడియా సంస్థలు సైతం పలు పార్టీలకు తోక మీడియాగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే డిజిటల్ మీడియా పుట్టుకొచ్చిందని ఆయన గుర్తుచేశారు. యువతలో అసంతృప్తి, ఆందోళనలు పెల్లుబుకుతున్నా వారి గొంతులు ప్రధాన స్రవంతిలో ఎందుకు వినిపించడం లేదో ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛ కేవలం హక్కు కాదు.. అది ప్రజల పట్ల ఒక రాజ్యాంగ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.




- దేశవ్యాప్తంగా పాత్రికేయులందరూ సంఘటితమై మళ్లీ హక్కులు సాధించుకోవాలి
- కొన్ని ప్రధాన స్రవంతులు పలు పార్టీలకు తోక మీడియాలుగా మారాయి
- రాజ్యాంగ విలువలను కాపాడటంతో తమ బాధ్యతను పునరుద్ధరించుకోవాల్సిన అవసరం ఉంది
- ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ జాతీయ సదస్సులో సుప్రీంకోర్టు రిటైర్డ్ జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి

హైదరాబాద్ ప్రత్యేక ప్రతినిధి, ఆగస్ట్ 23 (జనంసాక్షి) : హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ జాతీయ సదస్సులో ప్యానెల్ చర్చలో ఆయన మాట్లాడారు. పత్రికా స్వేచ్ఛ, మీడియా స్వాతంత్ర్యం, నిష్పక్షపాత జర్నలిజం, ప్రజల హక్కుల పరిరక్షణ అంశాలు పరస్పరం విడదీయరానివని అన్నారు. ప్రజల సమష్టి అధికారం వారి ప్రతినిధులు, రాజకీయ కార్యనిర్వాహక వ్యవస్థ, ప్రభుత్వ శాశ్వత యంత్రాంగం చేతుల్లో ఎలా వినియోగించబడుతోంది, దాని పర్యవసానాలను ప్రజలకు తెలియజేయడమే మీడియా ప్రధాన బాధ్యత అన్నారు. ఈ బాధ్యతను సమర్థంగా నిర్వర్తించినప్పుడే మీడియాపై ప్రజల విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని భావప్రకటన స్వేచ్ఛను పీఠిక, సామాజిక న్యాయం,

మిగతా 2లో..



## ఆటో కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలం

## సమ్మె విరమణ

- ఆటో చార్జీల పెంపునకు అంగీకారం
- సెప్టెంబర్ 1న విధివిధానాలపై సంయుక్త సమావేశం
- ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు అంగీకారం
- ప్రభుత్వ ఆధ్వర్యంలో ఓలా, ఉబర్ తరహా యాప్
- పాత ఆటోలను ఈవీలుగా మార్చేందుకు రూ.1.50 లక్షల సాయం

3లో..



## నాలుగు రోజులపాటు వర్షాలు

పలు ఉత్తరతెలంగాణ జిల్లాలకు ఎల్లో అలర్ట్

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ మరోసారి వర్షాలు జోరందుకున్నాయి. ప్రధానంగా హైదరాబాద్‌లో ఉదయం నుంచి పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. ముషీరాబాద్,

## గీత దాటిన వారిపై చర్యలు తప్పవు

- సమస్యలుంటే అంతర్గత సమావేశాల్లోనే తెలపాలి
- పార్టీ వేదికలపై మాట్లాడొద్దు:మహేశ్ కుమార్ గౌడ్
- కొండా సురేఖపై కుట్ర చేయాల్సిన అవసరం ఎవరికీ లేదు
- ఆమె కుమార్తె వ్యాఖ్యలతో పార్టీకి నష్టం జరుగుతోంది
- చిన్నారెడ్డికి కూడా నోటీసు ఇచ్చారు: : మంత్రి వాకిటి శ్రీహరి



హైదరాబాద్(జనంసాక్షి):కాంగ్రెస్ నేతలు ఎవరైనా పార్టీ నియమాలు దాటితే కఠిన చర్యలు తప్పవని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఏమైనా సమస్యలుంటే పార్టీలో అంతర్గతంగా చెప్పుకోవాలని.. దీనికోసం వివిధ కమిటీలు ఉన్నాయని చెప్పారు. అవసరమైతే ఢిల్లీ వెళ్లి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు చెప్పుకోవచ్చన్నారు. అంతేకానీ పార్టీ లైన్ దాటి బహిరంగ విమర్శలు చేయొద్దని హితవు పలికారు. ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ పరిశీలన తర్వాత మంత్రి కొండా సురేఖపై చర్యలు ఉంటాయని మహేశ్‌గౌడ్ తెలిపారు. బీఆర్ఎస్, భాజపాలా తమది నియంతృత్వ పార్టీ కాదన్నారు. మాట్లాడటానికి పార్టీలో ప్రజాస్వామ్య స్వేచ్ఛ ఉంటుందని.. కానీ ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే మాత్రం చర్యలు ఉంటాయని చెప్పారు. పార్టీకి డ్యామేజ్ చేస్తే చర్యలు తప్పవని వాకిటి శ్రీహరి కీలక వ్యాఖ్యలు చేశారు. సురేఖ అక్క కూతురు మాట్లాడింది పార్టీకి డ్యామేజ్ .. సురేఖ, వాకిటి ఇంకా ఎవరైనా పార్టీ తరువాతే అందరూ అని, ముందు పార్టీని కాపాడుకోవాలి.. దానికి అనుగుణంగా

మిగతా 2లో..

## తారిక్ భారత పర్యటనకు తొందరేమీ లేదు

బంగ్లాదేశ్ మంత్రి హుమయూన్

2లో..

## తెలంగాణ రైజింగ్‌ను విశ్వవ్యాప్తం చేయండి

లండన్‌లో 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమంలో సీఎం రేవంత్




- పెట్టుబడులు, విద్యారంగ బలోపేతం, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిపై చర్చలు
- తెలంగాణ రైజింగ్‌కు ప్రవాసులు భాగస్వాములు కావాలి
- పెట్టుబడులు, విద్యపై ప్రత్యేక దృష్టి తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయండి
- రాష్టాభివృద్ధికి ప్రవాసులు బలమైన మద్దతుదారులు, ఉండాలని పిలుపు
- ఎన్నారైలు, పెట్టుబడిదారులు, విద్యావేత్తలు, నిపుణులతో ముఖ్యమంత్రి ముఖాముఖి

లండన్(జనంసాక్షి): తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి లండన్ పర్యటనలో భాగంగా ప్రవాస భారతీయులు, ఇండియన్, తెలుగు కమ్యూనిటీ ప్రతినిధులతో ప్రత్యేక 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సెంట్రల్ లండన్‌లోని ప్రముఖ తాజ్ హోటల్‌లో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్, తెలంగాణ పీసీసీ ఎన్నారై కన్వీనర్, ఇండియన్ కమ్యూనిటీ నాయకుడు సుధాకర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి యూకేలోని తెలుగు కమ్యూనిటీ నాయకులు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు, పెట్టుబడిదారులు, విద్యావేత్తలు, ఎన్నారైలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తెలంగాణ అభివృద్ధి, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయడం, ప్రవాస తెలంగాణ సమాజంతో ప్రభుత్వ అనుసంధానం, భవిష్యత్ కార్యాచరణ వంటి కీలక అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవాసులతో ముఖాముఖిగా చర్చించారు. రాష్ట్ర ప్రగతికి ప్రవాసుల అనుభవం, నైపుణ్యం, పెట్టుబడులు, ఆలోచనలు ఎంతో ఉపయోగపడతాయని ఈ సందర్భంగా సీఎం పేర్కొన్నారు.సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'తెలంగాణ రైజింగ్'కు ప్రవాస భారతీయులు బలమైన మద్దతుదారులుగా, రాయబారులుగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రపంచ ఆర్థిక, ఆవిష్కరణల శక్తి కేంద్రంగా తెలంగాణ ఎదుగుతున్న

మిగతా 2లో..

## రాజకీయ కోణంలోనే నా అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణ

కేంద్రం నిర్ణయంతో బోస్టన్‌కు వెళ్లలేకపోతున్నాను

ఈ విషయమై ఖర్గే మద్దతుకు కృతజ్ఞతలు

లండన్‌లో నా పర్యటన విజయవంతమైంది

హైదరాబాద్ వచ్చాక అన్ని విషయాలపై మాట్లాడతా

ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో..



## అక్రమనిర్మాణాలపై హైడ్రా ఉక్కుపాదం

అంజయ్యనగర్‌లో కొనసాగుతున్న కూల్చివేతలు

శేరిలింగంపల్లి(జనంసాక్షి): గచ్చిబౌలి పరిధిలోని అంజయ్యనగర్‌లో కూల్చివేతలు కొనసాగుతున్నాయి. శనివారం కూలిన భవనం పక్కనే పాక్షికంగా దెబ్బతిన్న మరో అక్రమ నిర్మాణం ఉండగా.. బాహుబలి క్రేన్ సహాయంతో దాన్ని కూల్చివేస్తున్నారు. అక్రమంగా నిర్మించిన ఇలాంటి భవనాలను మున్సిపల్, హైడ్రా అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. ప్రమాదం అంచున ఉన్న నిర్మాణాలను కూల్చివేస్తున్నామని చెబుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.గచ్చిబౌలి పరిధిలో ఏడంతస్తుల భవనం శనివారం కూలిన ఘటన గురించి తెలిసిందే. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఈ నేపథ్యంలో అక్రమ, పాక్షికంగా దెబ్బతిన్న నిర్మాణాలపై అధికారులు దృష్టిసారించారు.

## అంతరిక్ష రంగంలో కెరీర్‌ను నిర్మించాలనుకునే వారు భారత్‌కు రావాలి

- నేషనల్ స్పేస్ డే సందర్భంగా స్పేస్ స్టార్టప్ సీఈఓలు ప్రధాని మోదీ భేటీ
- ప్రాజెక్టుల వివరాలను ప్రధానికి వివరించిన పలువురు సీఈఓలు



న్యూఢిల్లీ(జనంసాక్షి):అంతరిక్ష రంగంలో కెరీర్‌ను నిర్మించాలనుకునే వారు భారత్‌కు రావాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఇందుకోసం తమ ప్రభుత్వం విధారనపరమైన మద్దతిస్తుందని తెలిపారు. నేషనల్ స్పేస్ డే సందర్భంగా స్పేస్ స్టార్టప్ సీఈఓలు ప్రధానితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తాము చేపట్టనున్న ప్రాజెక్టుల వివరాలను పలువురు సీఈఓలు మోదీకి వివరించారు. అనంతరం మాట్లాడిన ప్రధాని మోదీ, అంతరిక్ష రంగంలోకి ప్రవేశించి ఎంతో ధైర్యాన్ని ప్రదర్శించారని స్పేస్‌స్టార్టప్ సీఈఓలను ప్రశంసించారు. స్పేస్ టెక్నాలజీతో ప్రజా సమస్యలకు పరిష్కారాలు కనుగొనాలని వారికి సూచించారు. ప్రపంచవ్యాప్తంగా అంతరిక్ష రంగంలో ఉన్న ప్రతిభావంతులను ఆకర్షించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మోదీ వెల్లడించారు. అంతరిక్ష రంగంలో పనిచేస్తున్న 20 స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులతో ప్రధాని మోదీ ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయా సంస్థలు

మిగతా 2లో..

## మనకూ ఓ ఐఎస్ఎస్

- 2035 నాటికి భారత సొంత అంతరిక్ష కేంద్రం ఏర్పాటు
- భారతీయ అంతరిక్ష కేంద్రం ఏర్పాటుకు తొలి మాడ్యూల్‌కు ఇప్పటికే ఆమోదం
- గగన్‌యాన్‌తో పాటు స్పేస్ స్టేషన్‌పై కొనసాగుతున్న పనులు
- 50కిపైగా రంగాల్లో అంతరిక్ష సాంకేతికతతో పౌరులకు సేవలు
- ఇస్రో చీఫ్

2లో..

## కేంద్రం హామీలపై పురోగతిలేదు

- మళ్లీ దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధం!
- ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణ, పరిహారం
- అంశాల్లో ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటనలేదు
- రేపు నేడు కీలక భేటీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై అసంతృప్తి వ్యక్తం కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)మరోసారి ఉద్యమ బాట పట్టేందుకు సిద్ధమవుతోంది. జులై 25న దేశవ్యాప్తంగా చేపట్టిన ఆందోళనను విరమించినప్పటికీ, కేంద్రం నుంచి హామీల అమలుపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని పార్టీ ఆరోపించింది. ఈ నేపథ్యంలో సోమవారం జాతీయ కార్యవర్గ సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించింది. జులై 25న ఆందోళన విరమించే సమయంలో కేంద్రం తమకు పలు హామీలు ఇచ్చిందని సీజేపీ తెలిపింది. వాటి అమలు విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న

మిగతా 2లో..

## ప్రస్తుతం అమెరికాతో యుద్ధంలో ఉన్నాం

- ట్రంప్ షరతులు ఆమోదయోగ్యం కావు
- వారు అడిగిన వాటిని తాము అంగీకరించం
- భారీ సుంకాలపై కెనడా ప్రధాని ఆగ్రహం

ఓట్టావా(జనంసాక్షి):అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కెనడాపై 50శాతం సుంకాలు విధించడంపై ఆ దేశ ప్రధాని మార్క్ కార్నీ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాణిజ్య ఒప్పంద చర్చల్లో ట్రంప్ ప్రతిపాదించిన షరతులు ఆమోదయోగ్యం కావని.. వారు అడిగిన వాటిని తాము అంగీకరించబోమని పేర్కొన్నారు. తమ దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయడానికి గానీ, కీలక పరిశ్రమలను బలహీనపరచడానికి గానీ సిద్ధంగా లేమన్నారు. ప్రస్తుతం తాము అగ్రరాజ్యంతో యుద్ధంలో ఉన్నామంటూ వ్యాఖ్యానించారు. 'మీపై దాడి జరిగితే మీరు యుద్ధంలో ఉన్నారని అర్థం. మాపై దాడి జరిగింది.

మిగతా 2లో..

## డీలిమిటేషన్ బిల్లు కోసమే లోక్‌సభను ఇంకా కొనసాగిస్తున్నారా?

- ఆమోదం కోసం అమిత్ షా 2/3 మెజారిటీ కోసం ప్రయత్నిస్తున్నారా?'
- ప్రొరోగేషన్ ఆలస్యం వెనుక దురుద్దేశాలు
- కేంద్రంపై జైరాం రమేశ్ ధ్వజం



న్యూఢిల్లీ(జనంసాక్షి):పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిసినప్పటికీ, లోక్‌సభను అధికారికంగా ముగించడంలో (ప్రొరోగేషన్) జరుగుతున్న అసాధారణ జాప్యంపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఆదివారం మోదీ సర్కార్?పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల ద్వారా నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ఆమోదింపజేసుకోవడానికి కేంద్ర హోంమంత్రి అమిత్? షా ప్రయత్నిస్తున్నారా? అని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. "సాధారణంగా లోక్?సభ నిరవధికంగా వాయిదా పడిన రెండు నుంచి నాలుగు రోజుల్లోనే సభను అధికారికంగా ముగిస్తూ (ప్రొరోగేషన్) ఉత్తర్వులు వస్తాయి. కొన్ని సందర్భాల్లో వాయిదా పడిన రోజే ఈ ప్రక్రియ కూడా పూర్తవుతుంది. ఈ లోక్‌సభ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడి 10 రోజులు గడుస్తున్నా, సభ ముగింపుపై ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదు. గతంలో 2015 వర్షాకాల సమావేశాల ముగింపునకు 28 రోజులు, 2021లో 20 రోజులు పట్టిన మాట వాస్తవమే. కానీ అప్పట్లో దీని వెనుక ఎలాంటి దురుద్దేశపూర్వక వ్యూహాలు లేవు. మరి ఇప్పుడు జరుగుతున్న

మిగతా 2లో..

## అంతరిక్ష రంగంలో కెరీర్‌ను నిర్మించాలకునే వారు భారత్‌కు రావాలి

ఎదుర్కొంటున్న సవాళ్లు, భవిష్యత్తు అవకాశాలు, సాంకేతికత వినియోగంపై చర్చలు జరిపారు. ఈ భేటీకి సంబంధించిన వీడియోను మోదీ తమ ఎక్స్? పోస్టులో పంచుకున్నారు. ఎప్పటిలాగే, భారత్ అంతరిక్ష ప్రయాణంపై స్టార్టప్‌ల అభిప్రాయాలు, ఆశావహ దృక్పథం తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని ప్రధాని పేర్కొన్నారు.

**భరోసా కల్పించడమే మా లక్ష్యం**

అంతరిక్ష రంగం వంటి కొత్త విభాగంలో అడుగుపెట్టిన స్టార్టప్ వ్యవస్థాపకులను మోదీ అభినందనలు తెలిపారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల్లో స్థిరత్వం ఎంతో ముఖ్యమని, దీనివల్ల రిస్క్ తీసుకునే వ్యాపారవేత్తలకు పూర్తి భరోసా లభిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. తమ తప్పిదాల వల్ల ఏదైనా సమస్య వస్తే అది వేరే విషయమని, కానీ ప్రభుత్వ విధానాల మార్పులతో మధ్యలో వదిలివేయరనే నమ్మకం ఉండాలని తెలిపారు. రిస్క్ తీసుకునే వారికి భరోసా కల్పించే వాతావరణాన్ని సృష్టించడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, అంతరిక్ష రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులను భారత్ ఆకర్షించగలదని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ రంగంలో భవిష్యత్తును నిర్మించుకోవాలనుకునే ప్రపంచ నిపుణులు భారత్‌కు వచ్చేలా ఒక ప్రత్యేకమైన వాతావరణాన్ని సృష్టించాలని చెప్పారు. రిస్క్ తీసుకుంటేనే మనకంటూ ఓ ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకోగలమని అభిప్రాయపడ్డారు. నైపుణ్యం విషయంలో భారత్‌కు ఎలాంటి కొరత లేదని, ఖర్చుల పరంగా కూడా భారత్ పోటీదారుగా ఉందని అన్నారు.

## మనకూ ఓ 'ఐఎస్‌ఎస్'

బెంగుళూరు(జనంసాక్షి):అంతరిక్ష రంగంలో భారత్ మరో కీలక మైలురాయిని చేరుకునే దిశగా అడుగులు వేస్తోంది. 2035 నాటికి సొంత అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసే దిశగా భారత్ కృషి చేస్తున్నట్లు ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ తెలిపారు. ప్రతిపాదిత భారతీయ అంతరిక్ష కేంద్రంలోని తొలి మాడ్యూల్‌కు ఇప్పటికే ఆమోదం లభించిందని వెల్లడించారు. గగన్‌యాన్ మానవ సహిత అంతరిక్ష యాత్రతో పాటు స్పేస్ స్టేషన్ ఏర్పాటుపై కూడా ఇస్రో దృష్టి సారించిందని చెప్పారు. 2035 నాటికి భారతీయ అంతరిక్ష కేంద్రం అహ్మదాబాద్‌లో ఆదివారం నిర్వహించిన మూడో జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకల్లో వి.నారాయణన్ పాల్గొని ప్రసంగించారు. అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన పురోగతిని వివరించారు. 64 ఏళ్ల క్రితం ప్రారంభమైన భారత అంతరిక్ష కార్యక్రమం, ప్రస్తుతం అనేక రంగాల్లో ప్రజలకు నేరుగా ఉపయోగపడే స్థాయికి చేరుకుందని అన్నారు. భారత్ అంతరిక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిన సమయంలో ప్రధానంగా ఉపగ్రహాలు, ప్రయోగ వాహనాల సామర్థ్యాలను అభివృద్ధి చేయడంపైనే దృష్టి పెట్టిందని ఇస్రో చీఫ్ తెలిపారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిందన్నారు. భూ పరిశీలన, రిమోట్ సెన్సింగ్, టెలికమ్యూనికేషన్లు, టెలివిజన్ ప్రసారాలు, టెలి-ఎడ్యుకేషన్, విపత్తుల ముందస్తు హెచ్చరికలు, నావిగేషన్, రక్షణ, భద్రత, రియల్‌టైమ్ పర్యవేక్షణ, ట్రాకింగ్ వంటి 50కిపైగా రంగాల్లో అంతరిక్ష ఆధారిత సేవలను భారత్ అందిస్తోందని చెప్పారు. అంతరిక్ష సాంకేతికత సామాన్యుల జీవితాల్లోనూ కీలకంగా మారిందని నారాయణన్ పేర్కొన్నారు. భారతీయ అంతరిక్ష కేంద్రంతో పాటు గగన్‌యాన్ కార్యక్రమం కూడా దేశానికి అత్యంత ప్రతిష్ఠాత్మకమైనదని నారాయణన్ అన్నారు. మానవులను అంతరిక్షంలోకి పంపే ఈ కార్యక్రమం కోసం ఇస్రో పలు దశల్లో పరీక్షలు, సాంకేతిక అభివృద్ధి చేపడుతోంది. భవిష్యత్తులో భారత్ స్వతంత్రంగా మానవ అంతరిక్ష యాత్రలు చేపట్టే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంలో గగన్‌యాన్ కీలక పాత్ర పోషించనుంది. దీనికి కొనసాగింపుగా భారతీయ అంతరిక్ష కేంద్రం ఏర్పాటు కానుంది. మూడో జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ కూడా పాల్గొన్నారు. చంద్రయాన్-3 విజయాన్ని ఆయన గుర్తుచేశారు. చంద్రయాన్-3 ల్యాండర్ 2023 ఆగస్టు 23న చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతానికి సమీపంలో విజయవంతంగా దిగింది. ఈ చారిత్రాత్మక విజయానికి గుర్తుగా ఏటా ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. చంద్రయాన్-3 ల్యాండర్ దిగిన ప్రదేశానికి "శివ శక్తి పాయింట్" అని పేరు పెట్టిన విషయాన్ని షెఖావత్ ప్రస్తావించారు. చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతానికి సమీపంలో సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన తొలి దేశంగా భారత్ నిలిచిందని తెలిపారు.

ప్రైవేట్ రంగానికి అవకాశాలు

భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం పెరగడం దేశానికి కొత్త అవకాశాలను తెరిచిందని కేంద్ర మంత్రి అన్నారు. అంతరిక్ష రంగంలో ప్రైవేటీకరణ, భాగస్వామ్యానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని చెప్పారు. ప్రైవేట్ కంపెనీల రాకతో ఉపగ్రహాల తయారీ, పేలోడ్ల అభివృద్ధి, ప్రయోగ వాహనాల తయారీ, అంతరిక్ష ఆధారిత అప్లికేషన్ల అభివృద్ధి వంటి రంగాల్లో వేగం పెరిగిందన్నారు. ఇస్రోపై పనిభారం తగ్గలేదని, అదే సమయంలో దాని సామర్థ్యం అనేక రెట్లు పెరిగిందని షెఖావత్ తెలిపారు. గతంతో పోలిస్తే అప్లికేషన్ల అభివృద్ధి, ఉపగ్రహాల తయారీ, పేలోడ్ల రూపకల్పన, ప్రయోగాలకు పట్టే సమయం గణనీయంగా తగ్గిందని పేర్కొన్నారు.

## నాలుగు రోజులపాటు వర్షాలు

చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్‌రోడ్, రాంనగర్, విద్యానగర్, అడిక్‌మెట్, కవాడిగూడ, దోమలగూడ, బాగ్‌లింగంపల్లి, అంబర్‌పేట, కాచిగూడ, బర్కత్‌పురా, నల్లకుంట, తిలక్‌నగర్, గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, రాయదుర్గం, మియాపూర్, చందానగర్, లింగంపల్లి, మహేశ్వరం, తుక్కుగూడ, శంషాబాద్, బాలాపూర్, కందుకూరు, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట్, యూసుఫ్?గూడా, సనత్?నగర్, పంజాగుట్ట, ఫిలింనగర్, బోరబండ, ఎర్రగడ్డ, ఎస్సార్?నగర్, కృష్ణానగర్, మధురానగర్ పరిసరాల ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. తెలంగాణలో వానలు క్రమంగా మళ్లీ ఊపందుకుంటున్నాయి. ఇవాళ్టి నుంచి నాలుగు రోజుల పాటు రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ప్రధానంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు ఆ ప్రాంతాలకు ఎల్లో అలర్ట్? జారీ చేసింది. ఇక రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాలతో పాటు ఉత్తర తెలంగాణలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వానలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

బంగాళఖాతంలో అల్పపీడనం : రేపు కూడా ఉత్తర తెలంగాణలోని పలు ప్రాంతాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం వాతావరణ శాఖ తెలిపింది. ఎల్లుండి వరకు రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. ఇవాళ ఉదయం వాయువ్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాలపై అల్పపీడనం కేంద్రీకృతమై ఉందని ఇది నైరుతి దిశగా పయనిస్తోందని ఐఎమ్‌డీ వివరించింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు మరింత జాగ్రత్తగా ఉండాలని వాతావరణ అధికారులు సూచించారు. బహిరంగ ప్రదేశాలలో ముఖ్యంగా చెట్ల కింద నిలబడొద్దని, విద్యుత్ స్తంభాలు, తీగలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. పిడుగులు పడినప్పుడు ప్రజలు కాంక్రీట్ భవనాలలో లేదా ఇతర సురక్షిత ప్రదేశాల్లోనే ఆశ్రయం పొందాలని సూచించారు. వర్షాలను దృష్టిలో ఉంచుకుని స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని వాతావరణ శాఖ జిల్లా అధికారులకు సూచనలు చేసింది. హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురిసే ఆస్కారం ఉన్నందున లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వాతావరణ కేంద్రం పురపాలక, విపత్తు నిర్వహణ విభాగాలను హెచ్చరించింది. భారీ వర్షాల సమయంలో రోడ్లపై నీరు నిలిచిపోయే అవకాశం ఉన్నందున వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించింది. వాగులు, వంకలు, చెరువులు, కల్వర్టుల్లో నీటిమట్టాలు పెరిగొచ్చని అనవసర ప్రయాణాలను తగ్గించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.




# జర్నలిస్టుల హక్కులు హరిస్తుంటే.. మౌనం వహిస్తున్నారెందుకు..?

ప్రజాస్వామ్య స్థిరత్వం వంటి రాజ్యాంగ విలువలతో కలిపి చూడాలని అన్నారు. వ్యక్తులు, సమూహాల గౌరవాన్ని కాపాడటం, సామాజిక న్యాయాన్ని సాధించడం ప్రజాస్వామ్య వ్యవస్థ బాధ్యతగా పేర్కొన్నారు. దేశంలో పెద్ద కార్పొరేట్ సంస్థలు, వ్యాపార ప్రయోజనాల ఆధిపత్యం మీడియాపై పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల ప్రభావంతో మీడియా తన 'వాచ్‌డాగ' పాత్రను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రజల హక్కులను కాపాడాల్సిన మీడియా సంస్థలే కొన్నిసార్లు వారిపై ఒత్తిడి తెచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు.

**రక్షణ తగ్గిన జర్నలిస్టులు**

వర్కింగ్ జర్నలిస్టులు, ఇతర వార్తాపత్రిక ఉద్యోగులకు రక్షణ కల్పించిన 1955 నాటి చట్టం రద్దయిన తర్వాత స్వతంత్రంగా పనిచేసే జర్నలిస్టులకు రక్షణ మరింత తగ్గిందని జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి తెలిపారు. సోషల్ మీడియాపైనా పెద్ద కార్పొరేట్ సంస్థల ప్రభావం ఉందని, తమకు వ్యతిరేకంగా అనిపించే పోస్టులను ప్రభుత్వమే తొలగించాలని ఒత్తిళ్లు తీసుకొస్తున్నట్టు వివరించారు. గతేడాది 24వేల కంటెంట్ తొలగింపు అభ్యర్థలను కూడా వచ్చినట్టు తెలిపారు. అందులో కొన్ని ఆర్టికల్ 19 (భావ ప్రకటన స్వేచ్ఛ) పరిధిలోనే ఉన్నప్పటికీ గొంతులు నొక్కే చర్యలకు లోనవుతున్నట్టు పేర్కొన్నారు. స్వేచ్ఛగా అభిప్రాయాలు వ్యక్తం చేసే జర్నలిస్టులు కేసులు, పోలీసు చర్యలు, ట్రోలింగ్, బెదిరింపులను ఎదుర్కొంటున్నారని అన్నారు. సామాజిక, ఆర్థిక అసమానతలను తొలగించకపోతే ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు ఏర్పడుతుందని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన హెచ్చరికలను గుర్తు చేశారు. మీడియా అణగారిన వర్గాలు, నిరాశ్రయులు, స్వరం లేనివారి సమస్యలకు వేదికగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఇది మీడియా, జర్నలిస్టులు లోతైన ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయమని జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారు. రాజ్యాంగంలోని సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో మీడియా తన బాధ్యతను పునరుద్ధరించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల గొంతుకను అణచివేయడం కాకుండా, వారి సమస్యలు, పోరాటాలకు అద్దం పట్టే స్వతంత్ర జర్నలిజమే ప్రజాస్వామ్యానికి బలమని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా సంఘటితమై జర్నలిస్టులు తమ హక్కులు సాధించుకోవాలని ఆయన పునరుద్ఘాటించారు.

## డీలిమిటేషన్ బిల్లు కోసమే లోక్‌సభను ఇంకా కొనసాగిస్తున్నారా?

ఈ అసాధారణ ఆలస్యానికి కారణం ఏమిటి? ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి, డీలిమి టేషన్? బిల్లును ఆమోదింపజేసుకోవ దానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రయత్నిస్తున్నారా? అందుకు కావాల్సిన 2/3 వంతు మెజారిటీ కోసం వెతుకుతున్నారా?" అని అన్నారుమహిళా రిజర్వేషన్‌తో ముడిపడి ఉన్న ఈ డీలిమిటేషన్ రాజ్యాంగ సవరణ బిల్లు, అంతకు ముందు జరిగిన బడ్జెట్ సమావేశాల్లో వీగిపోయింది. వాస్తవానికి ఈ బిల్లు ద్వారా లోక్?సభ స్థానాల సంఖ్యలను 850 వరకు పెంచాలని కేంద్రం భావించింది. కానీ 2/3 మెజారిటీ లేకపోవడంతో ఆ బిల్లుకు ఆమోదం లభించలేదు. అందుకే ఆ బిల్లును ఈసారి లోక్?సభలో ప్రవేశపెట్టేందుకు మోదీ సర్కార్ ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ విమర్శిస్తోంది. దీనిపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ బిల్లును పార్లమెంట్ ముందుకు మళ్లీ ఎప్పుడు తీసుకువస్తామనే దానిపై ప్రభుత్వం ఎలాంటి నిర్దిష్ట కాలపరిమితిని ఖరారు చేయలేదని పేర్కొన్నారు. "మేము ఈ డీలిమిటేషన్ బిల్లును తీసుకువస్తామని ఎప్పుడు చెప్పాం? అయితే మీడియాలో కొన్ని ఊహాగానాలు వచ్చిన మాట వాస్తవం. దీనిని ఎప్పుడు తీసుకురావాలనేది మా అధినాయకత్వం పూర్తిస్థాయిలో చర్చించిన తర్వాతే నిర్ణయిస్తుంది" అని స్పష్టం చేశారు. కాగా, కాంగ్రెస్ సహా పలు ప్రతిపక్ష పార్టీలు ఈ డీలిమిటేషన్ బిల్లును మహిళా రిజర్వేషన్లతో ముడిపెడుతున్నాయి. లోక్?సభలో ప్రస్తుతం ఉన్న స్థానాల పరిమితిలోనే మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. అంతేకాదు తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), శివసేన (యూబీటీ) లాంటి పార్టీల నుంచి ఎంపీలను, బీజేపీ తన అక్కున చేర్చుకుని డీలిమిటేషన్ బిల్లును ఎలాగైనా ఆమోదింపజేసుకోవడానికి ప్రయత్నిస్తోందని ఆరోపిస్తున్నాయి. కాగా, 2029 ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు వేస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం డీలిమిటేషన్ బిల్లు ఆమోదం పొందాల్సి ఉంటుంది.

## గీత దాటిన వారిపై చర్యలు తప్పవు

ముందుకు పోతామని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీ లైన్ దాటితే వాకిటి శ్రీహరి పై కూడా చర్యలు తప్పవని, పార్టీకి డ్యామేజ్ కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సురేఖ అక్క పైన కుట్ర చేయాల్సిన అవసరం ఎవరికి లేదని, పార్టీకి డ్యామేజ్ అయితే ఏఐసీసీ, టీపీసీసీ, క్రమశిక్షణ కమిటీ నిర్ణయం తీసుకుంటుందని వాకిటి శ్రీహరి అన్నారు. పార్టీ లైన్ ఎవరు దాటొద్దన్నారు. ప్రతి పక్షాలకు అవకాశం ఇవ్వకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, సురేఖ అక్క ఒక్కరికే నోటీసులు ఇవ్వలేదని, చిన్నారెడ్డికి కూడా నోటీసులు ఇచ్చారని వాకిటి శ్రీహరి చెప్పారు. తప్పు చేస్తే ఎంతటి వారైనా చర్యలు ఉంటాయని, సామాజిక న్యాయం పాటించేది కాంగ్రెస్ పార్టీ అన్నారు. బీసీ, అగ్రవర్ణాలు అని ఏముందదని, ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయిన ఎన్నో సంక్షేమ పథకాలు ఇచ్చి అభివృద్ధి చేస్తున్నామని, అనుభవం కలిగిన పార్టీ, రేవంత్ ప్రభుత్వం ముందుకు పోతుంటే ఇలాంటివి జరగడం బాధాకరమని వాకిటి శ్రీహరి వ్యాఖ్యానించారు.

## తారిక్ భారత పర్యటనకు తొందరేమీ లేదు

ఢాకా(జనంసాక్షి):బంగ్లాదేశ్ ప్రధాని తారిక్ రెహమాన్ భారత పర్యటనపై అనిశ్చితి కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఆ దేశ విదేశాంగ శాఖ సహాయ మంత్రి హుమయూన్ చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. శనివారం హుమయూన్ మీడియాతో మాట్లాడుతూ.. బంగ్లా ప్రధాని తారిక్ భారత పర్యటనకు తొందరపడాల్సిన అవసరం లేదన్నారు. మోదీ ప్రభుత్వంతో సానుకూల సంబంధాలు కొనసాగించాలని తాము కోరుకుంటున్నప్పటికీ.. జాతీయ ప్రయోజనాల విషయంలో రాజీ పడబోమని వ్యాఖ్యానించారు. ఇరుదేశాల మధ్య జరుగుతున్న ద్వైపాక్షిక చర్చలలో తగినంత పురోగతి సాధించిన తర్వాత.. సరైన సమయం చూసుకొని తారిక్ రెహమాన్ భారత పర్యటనకు వెళ్తారని హుమయూన్ పేర్కొన్నారు. ప్రధాని అధికారిక పర్యటనకు తగిన సన్నాహాలు, ఇరుపక్షాల మధ్య అవసరమైన ప్రాథమిక ఏర్పాట్లు అవసరమని తెలిపారు. మరోవైపు ఈ పర్యటనపై బంగ్లా ప్రధాని కార్యాలయం స్పందిస్తూ.. తారిక్ పర్యటనపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని పేర్కొంది. మాజీ ప్రధాని షేక్ హసీనాతోపాటు ఇతర నేరస్థులను అప్పగించే విషయంలో భారత్ స్పందన కోసం బంగ్లా వేచి చూస్తున్నట్లు సమాచారం. మరోవైపు సెప్టెంబర్ 12-13 దిల్లీలో జరగనున్న బ్రిక్స్ సదస్సులో బంగ్లా ప్రధాని పాల్గొనాల్సి ఉండగా.. అంతకుముందే ఆయన దిల్లీ పర్యటనకు వస్తారని వార్తలు వచ్చాయి. బంగ్లా ప్రధానిని స్వాగతించే కార్యక్రమం కోసం రిహార్సల్స్ జరుగుతున్నాయని రాష్ట్రపతి భవన్ నుంచి ఇటీవల ప్రకటన వెలువడినప్పటికీ.. గంటల వ్యవధిలోనే దానిని ఉపసంహరించుకోవడం గమనార్హం. పాకిస్థాన్, సౌదీ అరేబియా, తుర్కియే దేశాలు కుదుర్చుకున్న 'ముక్కా సమష్టి రక్షణ ఒప్పందం'లో చేరడానికి బంగ్లాదేశ్ కూడా ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది.

## కేంద్రం హామీలపై పురోగతిలేదు

చర్యలను అధికారికంగా తమకు తెలియజేయలేదని పేర్కొంది. ప్రభుత్వం ఇచ్చిన మాటను నమ్మి ఉద్యమాన్ని విరమించామని, తమ విశ్వాసాన్ని బలహీనతగా భావించొద్దని సీజేపీ హెచ్చరించింది. హామీల అమలుకు అవసరమైన అన్ని చర్యలను పరిశీలిస్తామని, అందులో మరోసారి శాంతియుత మరోసారి శాంతియుత దేశవ్యాప్త ఆందోళన చేపట్టే అవకాశమూ ఉందని స్పష్టం చేసింది. కేంద్రం ఇచ్చిన హామీలను ఆలస్యం చేయడం, వేరే అర్థం చెప్పడం లేదా విస్మరించడం వంటి చర్యలను సహించబోమని హెచ్చరించింది. అలా జరిగితే దేశ యువతకు చేసిన వాగ్దానానికి ద్రోహంగా భావిస్తామని స్పష్టం చేసింది.

**ఎఫ్ఐఆర్‌లపై సుప్రీంకోర్టులో విచారణ**

ఇటీవల ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు జోక్యం కూడా కీలకంగా మారింది. ఆగస్టు 18న దేశవ్యాప్తంగా విద్యార్థులు, ఆందోళనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల సమగ్ర జాబితాను సమర్పించాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని కోరినట్లు సీజేపీ తెలిపింది. తమ ప్రకారం, సుప్రీంకోర్టు ఈ జాబితాను మూడుసార్లు కోరిందని, కేసులను కొట్టివేసేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తన అధికారాలను వినియోగించే అంశాన్ని పరిశీలించేందుకు ఈ వివరాలు అవసరమని తెలిపింది. అయితే కోర్టు పదేపదే కోరినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఆ జాబితాను అందజేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వలేదని ఆరోపించింది.

**'యువతను మోసం చేస్తున్నారా?'**

సుప్రీంకోర్టు విచారణ అనంతరం సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్, న్యాయ వ్యవహారాల విభాగం బాధ్యురాలు రత్నా సింగ్ ప్రభుత్వ వైఖరిపై ఆందోళన వ్యక్తం చేసినట్లు పార్టీ తెలిపింది. కేంద్రంతో చర్చల సందర్భంగా ఇచ్చిన హామీల ఆధారంగానే ఉద్యమాన్ని విరమించామని, ఇప్పుడు వాటి అమలులో జాప్యం జరుగుతుండటం యువతను మోసం చేసినట్లేనని వారు అభిప్రాయపడినట్లు పేర్కొంది. ముఖ్యంగా నిరసనలకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించడం, విద్యార్థులు లేదా శాంతియుత ఆందోళనకారులపై భవిష్యత్తులో శిక్షాత్మక చర్యలు తీసుకోకుండా హామీ ఇవ్వడం వంటి అంశాలపై స్పష్టత కావాలని సీజేపీ కోరుతోంది.

**నీట్ బాధిత కుటుంబాలకు పరిహారం**

సీజేపీ డిమాండ్లలో మరో కీలక అంశం నీట్? యూజీ వివాదం. పేపర్ లీక్ కారణంగా మేలో పరీక్ష రద్దు కావడం, దాని తర్వాత కొందరు అభ్యర్థులు ఆత్మహత్యలకు పాల్పడిన నేపథ్యంలో మృతుల కుటుంబాలకు పరిహారం అందించాలని పార్టీ డిమాండ్ చేసింది. ఈ అంశంపైనా కేంద్రం హామీ ఇచ్చిందని చెబుతోంది. అయితే పరిహారం, ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణ సహా లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం తమను అధికారికంగా సంప్రదించలేదని ఆరోపించింది.

ఇక ఇటీవల నిరసనల సందర్భంగా పోలీసుల చర్యపై విచారణ జరిపేందుకు హైపవర్డ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నాట్లు సుప్రీకంకోర్టు పేర్కొంది. ఆ రోజు జరిగిన మార్చ్ ఫుటేజీని కమిటీ పరిశీలిస్తుందని తెలిపింది. అలాగే మహిళా ఆందోళనకారుల్ని లక్ష్యంగా చేసుకున్నారంటూ వచ్చిన ఆరోపణలపై కూడా దర్యాప్తు జరుగుతుందని వెల్లడించింది. ఈ ప్యానెల్‌లో మాజీ న్యాయమూర్తులు, సీబీఐ మాజీ డైరెక్టర్, రాష్ట్ర మాజీ డీజీపీ సభ్యులుగా ఉంటారని చెప్పింది.

# తెలంగాణ రైజింగ్‌ను విశ్వవ్యాప్తం చేయండి

ప్రయాణంలో ప్రవాసులు చురుకైన భాగస్వాములు కావాలని ఆయన ఆహ్వానించారు. ఎన్నారైలు, పెట్టుబడిదారులు, వివిధ రంగాల నిపుణులతో స్వయంగా మమేకమైన సీఎం.. రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడే కొత్త ఆలోచనలు, సూచనలు అందించాలని కోరారు. ప్రవాస తెలంగాణ సమాజం మధ్య నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేయడం ద్వారా కొత్త అవకా శాలను సృష్టించేందుకు కలిసి పనిచేయాలని సూచించారు.

**పెట్టుబడులు, విద్యపై ప్రత్యేక దృష్టి**

కార్యక్రమంలో పెట్టుబడులు, విద్యారంగం, ఎన్నారైలతో తెలంగాణ ప్రభుత్వ అనుసంధానం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి. యూకే, యూరప్‌లో ఉన్న పెట్టుబడిదారులు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా మరింత అనుకూల వాతావరణం కల్పించడం, విద్యారంగంలో అంతర్జాతీయ అనుభవాన్ని రాష్ట్రానికి అనుసంధానం చేయడం, ప్రవాస నిపుణుల సేవలను తెలంగాణ అభివృద్ధికి వినియోగించుకోవడం వంటి అంశాలపై చర్చ జరిగింది. కార్యక్రమ నిర్వాహకుడు, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్, తెలంగాణ పీసీసీ ఎన్నారై కన్వీనర్ సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డికి లండన్‌తో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. గతంలో లండన్ పర్యటన సందర్భంగా గల్ఫ్ ఎన్నారైలకు ఇచ్చిన హామీని నెరవేర్చిన విషయాన్ని ప్రస్తావించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి రేవంత్ రెడ్డి ఎంతో కష్టపడ్డారని, ఆయనకు లండన్‌లోనే కాకుండా యూకేలోని ప్రవాస భారతీయులు, తెలంగాణ సమాజంలో పెద్ద సంఖ్యలో అభిమానులు ఉన్నారని సుధాకర్ గౌడ్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై ఎవరైనా అనుచిత వ్యాఖ్యలు చేసినా, ఆయనకు అండగా నిలిచే అభిమానులు, కార్యకర్తలు ఉన్నారని అన్నారు.

**ఎన్నారైలకు తెలంగాణ ప్రభుత్వంతో మరింత బలమైన కనెక్టివిటీ**

యూకేలో ఉన్న పెట్టుబడులు, విద్యా అవకాశాలు, ఎన్నారైల అవసరాలకు తెలంగాణ ప్రభుత్వంతో నేరుగా అనుసంధానం కల్పించేలా ఒక బలమైన వారధి ఉండాలని సుధాకర్ గౌడ్ కోరారు. యూకేలోని తెలంగాణ సమాజం, పెట్టుబడిదారులు, విద్యావేత్తలు రాష్ట్ర ప్రభుత్వంతో మరింత సమన్వయంతో పనిచేసేలా ప్రత్యేక వ్యవస్థ అవసరమని సూచించారు. ఈ ప్రతిపాదనపై మంత్రి శ్రీధర్ బాబు, సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు సుధాకర్ గౌడ్ తెలిపారు. డిసెంబర్‌లో నిర్వహించనున్న తదుపరి గ్లోబల్ సమ్మిట్ బిజినెస్ మీట్‌కు యూకేలోని పెట్టుబడిదారులు, నిపుణులను ఆహ్వానిస్తామని వారు వెల్లడించినట్లు చెప్పారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఎన్నారై పాలసీ, ఇన్వెస్ట్‌మెంట్ పాలసీ గురించి సవివరంగా వివరించారు. అలాగే యూకే, యూరప్‌కు భారత్‌తో వేగవంతమైన కనెక్టివిటీ ఉన్నందున, అక్కడి ఎన్నారైలు, పెట్టుబడిదారులు, నిపుణులకు అనుకూలంగా ప్రత్యేక విధివిధానాలను రూపొందించే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో నిర్వహించిన ప్రశ్నోత్తరాల సెషన్‌లో తెలంగాణ విద్యా వ్యవస్థకు సంబంధించిన అంశాలు ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడం, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించడం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దడం వంటి అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి ఎన్నారైలు, విద్యావేత్తలతో సుదీర్ఘంగా చర్చించారు. విదేశాల్లో పనిచేస్తున్న తెలంగాణకు చెందిన నిపుణుల అనుభవం, జ్ఞానం, ఆలోచనలను రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగించుకునేలా ప్రభుత్వం, ప్రవాస తెలంగాణ సమాజం మధ్య మరింత సమన్వయం అవసరమని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ కార్యక్రమం ప్రవాస తెలుగువారిలో నూతన ఉత్సాహాన్ని నింపింది. తెలంగాణ అభివృద్ధిలో ఎన్నారైల భాగస్వామ్యాన్ని మరింత పెంచడం, రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, విదేశాల్లోని నిపుణుల అనుభవాన్ని తెలంగాణ ప్రగతికి వినియోగించుకోవడం, ప్రభుత్వంతో ప్రవాస సమాజానికి మరింత బలమైన అనుసంధానం కల్పించడం వంటి అంశాలపై సమావేశం ద్వారా స్పష్టమైన దిశ ఏర్పడింది. సుధాకర్ గౌడ్ నాయకత్వంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఈ 'లండన్ మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమం ప్రవాస తెలంగాణ సమాజం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మధ్య అనుసంధానాన్ని మరింత బలోపేతం చేసే వేదికగా నిలిచింది. తెలంగాణ అభివృద్ధిలో ప్రవాసుల భాగస్వామ్యాన్ని పెంచడంతో పాటు పెట్టుబడులు, విద్య, నైపుణ్యం, అంతర్జాతీయ అనుభవాలను రాష్ట్ర ప్రగతికి అనుసంధానం చేసే దిశగా ఈ సమావేశం కీలకంగా మారింది.

## రాజకీయ కోణంలోనే నా అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణ


హైదరాబాద్(జనంసాక్షి):రాజకీయ కోణంలోనే తన అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వలేదని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేంద్రం అనుమతి నిరాకరించిన నేపథ్యంలో బోస్టన్‌కు వెళ్లలేకపోతున్నానని చెప్పారు. లండన్‌లో తాము చేపట్టిన పర్యటన అత్యంత విజయవంతమైందన్నారు. అక్కడ నిర్వహించిన అన్ని అధికారిక సమావేశాలు, షెడ్యూల్ చేసిన కార్యక్రమాలు పూర్తయ్యాయని రేవంత్ రెడ్డి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన అంశంలో ఊహించని పరిణామం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ముందుగా ఖరారైన షెడ్యూల్ ప్రకారం లండన్ పర్యటన ముగించుకొని, ముఖ్యమంత్రి అక్కడి నుంచి నేరుగా అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లాల్సి ఉంది. అయితే, కేంద్ర విదేశాంగ శాఖ ఆయన పర్యటనకు రాజకీయ అనుమతి నిరాకరించింది. విదేశాంగ శాఖ నిర్ణయంతో పర్యటనను అర్ధాంతరంగా రద్దు చేసుకున్న ముఖ్యమంత్రి, అమెరికా వెళ్లకుండానే లండన్ నుంచి నేరుగా హైదరాబాద్‌కు తిరుగుపయనమవుతున్నారు. ఈ మేరకు లండన్ నుంచే సీఎం రేవంత్ ఒక ప్రకటనను విడుదల చేశారు. గత మూడు రోజులుగా లండన్‌లో తమకు లభించిన అపూర్వ మద్దతుకు అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు అని సీఎం తన ట్వీట్ లో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కాంగ్రెస్ జాతీయ నాయకత్వం తీవ్రంగా ఖండించిందన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ వ్యవహారంపై స్పందిస్తూ, ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం ప్రవర్తిస్తోందని, ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను ఇలా అడ్డుకోవడం దారుణమంటూ తనకు మద్దతుగా నిలిచారన్నారు. తనకు కొండంత అండగా నిలిచిన పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**హైదరాబాద్ వచ్చాక అన్ని విషయాలపై మాట్లాడతా**

అంతేకాకుండా, ఈ విషయంలో జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తనకు, ప్రభుత్వానికి అండగా నిలిచిన వివిధ రాజకీయ పార్టీల నేతలకు, దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. బోస్టన్ పర్యటన రద్దు కావడంతో కొన్ని గంటల్లోనే లండన్ నుంచి బయలుదేరి హైదరాబాద్ చేరుకోనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. భాగ్యనగరానికి చేరుకున్న వెంటనే విదేశాంగ శాఖ నిర్ణయం, దానికి వెనుక ఉన్న రాజకీయం, పర్యటన వివరాలకు సంబంధించిన అన్ని అంశాలపై పూర్తి సమాచారం వెల్లడిస్తానని రేవంత్ రెడ్డి తెలిపారు.

## ప్రస్తుతం అమెరికాతో యుద్ధంలో ఉన్నాం

కాబట్టి మేమూ యుద్ధంలో ఉన్నాం. అగ్రరాజ్యంపై పోటాపోటీగా ప్రతీకార సుంకాలు విధిస్తాం. అమెరికాలోని ఉక్కు, గృహోపకరణాలు, వ్యవసాయ పరికరాలు, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాలను లక్ష్యంగా చేసుకుంటాం. వాషింగ్టన్ తన సుంకాలను తగ్గిస్తే.. ఆ దేశానికి చెందిన అల్యూమినియం, ఉక్కు, మోటారు వాహనాలపై ప్రస్తుతం ఉన్న సుంకాలను తొలగించడానికి సిద్ధంగా ఉన్నాం.



అంతేకాకుండా, అమెరికన్ మద్యం అమ్మకాలను తిరిగి ప్రారంభించేలా రాష్ట్రాలను ప్రోత్సహించాలనుకున్నాం. కానీ ట్రంప్ ఆచరణ సాధ్యం కాని షరతులను పెట్టడంతో ఒప్పందం నుంచి తప్పుకోవాల్సి వచ్చింది' అని కార్నీ పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కెనడా మధ్య ఇటీవల జరిగిన వాణిజ్య చర్చలు చివరి నిమిషంలో విఫలమయ్యాయి. వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయడానికి కెనడా నిరాకరించడంతో చర్చలు నిలిచిపోయాయి. కెనడా నుంచి దిగుమతి చేసుకునే 20 బిలియన్ల విలువైన వస్తువులపై 50 శాతం సుంకాలు విధించనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. దీంతో కెనడా ప్రతి ఏడాది అమెరికాకు ఎగుమతి చేసే సుమారు 5 శాతం వస్తువులపై ప్రభావం పడనుంది.

## డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలం
# ఆటో కార్మికుల సమ్మె విరమణ

### ఆటో చార్జీల పెంపునకు అంగీకారం

- సెప్టెంబర్ 1న విధివిధానాలపై సంయుక్త సమావేశం
- ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకారం
- ప్రభుత్వ ఆధ్వర్యంలో ఓలా, ఉబర్ తరహా యాప్
- పాత ఆటోలను ఈవీలుగా మార్చేందుకు రూ.1.50 లక్షల సాయం



**హైదరాబాద్, ఆగస్టు 23 (జనం సాక్షి) :** ఆటో కార్మిక సంఘాలతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఆటో కార్మిక సంఘాలు లేవనెత్తిన పలు డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో నిరవధిక బంద్ ను విరమించుకున్నట్లు సంఘాలు ప్రకటించాయి. ప్రభుత్వ విజ్ఞప్తికి స్పందించి సమ్మె విరమించిన ఆటో కార్మిక సంఘాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు.

#### ఈవీ ఆటోలపై దుష్ప్రచారం

ఆర్టీసీ తరపున ఎలక్ట్రిక్ ఆటోలు కొనుగోలు చేసే ప్రసక్తే లేదని, దీనిపై జరుగుతున్న ప్రచారం దుష్ప్రచారమని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు పాత డీజిల్, పెట్రోల్ ఆటోలను రెట్రోఫిట్మెంట్ ద్వారా ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. హైదరాబాద్ క్యూర్ ఏరియా పరిధిలో పాత ఆటోలను ఈవీలుగా మార్చుకునే వారికి ప్రభుత్వం రూ.1.50 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించనుందని తెలిపారు. కొత్త ఆటోలు కొనుగోలు చేసేందుకు సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిందన్నారు.

#### ఆటో చార్జీల పెంపునకు అంగీకారం

2012 తర్వాత ఆటో చార్జీలను పెంచలేదని గుర్తించిన ప్రభుత్వం, చార్జీల పెంపునకు అంగీకరించింది. ఎంత మేర పెంచాలనే అంశంపై తగిన నివేదిక తీసుకుని, సంబంధిత జీవో జారీ చేయడానికి ప్రభుత్వం అంగీకరించింది. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కూడా ప్రభుత్వం అంగీకరించింది. బోర్డు విధివిధానాలపై సెప్టెంబర్ 1న కార్మిక శాఖ, రవాణా శాఖ, ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులతో సంయుక్త సమావేశం నిర్వహించనున్నారు.

#### ఓలా, ఉబర్ తరహాలో ప్రభుత్వ యాప్

ఆటో కార్మికులకు ప్రయోజనం చేకూరేలా ఓలా, ఉబర్ తరహాలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్‌ను రూపొందించాలని నిర్ణయించారు. ఇందుకోసం ఐటీ శాఖ ద్వారా అవసరమైన ప్రక్రియను ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. ద్విచక్ర వాహనాల ద్వారా రాపిడో, ఓలా, ఉబర్ వంటి సేవలు అందించే వాహనాల విషయంలో ఎల్లో ప్లేట్ ఉన్న వాహనాలకే ప్రయాణికుల రవాణాకు అనుమతి ఉండేలా నిర్ణయం తీసుకునే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు.

#### రూ.12 వేల హామీపై సానుకూల నిర్ణయం

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆటో కార్మికులకు నెలకు రూ.12 వేల ఆర్థిక సాయం అందించే అంశంపై రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సహచర మంత్రులతో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆటో కార్మికుల డిమాండ్ల పట్ల ప్రభుత్వం పూర్తి సానుకూల దృక్పథంతో ఉందన్నారు. చర్చల్లో రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్, జేటీసీలు చంద్రశేఖర్ గౌడ్, శివలింగయ్య, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

# నాటుబాంబు కేసులో విచారణ ముమ్మరం

- అడవి పందుల కోసం ఎరగా అమర్చిన నాటు బాంబులు
- తెలియక కొడవలితో వేటు వేసిన కలుపు కూలి మహిళ
- బాంబు పేలడంతో తీవ్ర గాయాలు
- గతంలోనూ విద్యుత్ షాక్ కు గురైన ఓ వ్యక్తి
- అడవి జీవాల వేటగాళ్ల పై పోలీసుల నజర్





**రేగొండ,ఆగస్టు23 (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం గూడేపల్లి గ్రామంలో శనివారం నాటు బాంబు పేలిన ఘటన జిల్లా వ్యాప్తంగా కలకలం రేపింది. మండలంలోని గూడేపల్లి గ్రామానికి చెందిన గుండె స్వర్ణలత దినసరి కూలీలో భాగంగా ఓ రైతు చేనులో కలుపు తీస్తున్న క్రమంలో కొడవలి వేటు నాటు బాంబుపై పడింది.దీంతో ఒక్కసారిగా బాంబు పేలడంతో ఆమె ముఖంపై తీవ్రంగా గాయాలయ్యాయి. బాధితురాలిని హుటాహుటిన పరకాలలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించి వైద్య అందిస్తున్నారు.ఇదిలా ఉంటే వ్యక్తి పంట చేనులోకి నాటు బాంబు ఎలా వచ్చిందన్న కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు ముముమ్మరం చేశారు.

#### అడవిపందులకు ఎరగా నాటు బాంబుల ఏర్పాటు

గుడేప్పల్లి గ్రామాన్ని ఆనుకొని చుట్టూ అడవి ప్రాంతం ఉంటుంది.అడవిని ఆనుకొని ఉన్న పంట చేన్లలోకి అడవి జంతువులైన పందులు,కుందేళ్ళు,నెమళ్ళు రాత్రి సమయంలో సంచరిస్తుంటాయి.ప్రస్తుతం అటవీ జీవాల మాంసానికి గిరాకీ ఉండడంతో గమనించిన కొందరు వ్యక్తులు అటవీ జీవాలకు ఎరగా నాటు బాంబులు అమరుస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.గత నెల రోజుల క్రితం ఇదే పరిసర ప్రాంతంలో ఓ పంది నాటు బాంబు దాడికి చనిపోగా... గుడేపల్లి-దుంపిల్లపల్లి గ్రామాలకు చెందిన వేటగాళ్ల మధ్యలో మాదంటే మాదని గొడవ సైతం జరిగినట్లు స్థానికులు తెలుపుతున్నారు.

#### గతంలోనూ విద్యుత్ షాకు కు గురైన ఓ వ్యక్తి

గతంలో దాదాపు ఏడు సంవత్సరాల క్రితం ఇదే గ్రామానికి చెందిన గూదూరు చేరాలు అనే వ్యక్తి విద్యుత్ షాక్ కు గురయ్యాడు.కొందరు వ్యక్తులు అడవి జీవాల వేట కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగిలి ప్రాణాపాయ స్తితినుండి బయటపడ్డాడు. అప్పుడు పోలీసులు దుంపిల్లపల్లి గ్రామానికి చెందిన పదిమంది వ్యక్తులను దోషులుగా గుర్తించి జైలుకు పంపారు.

#### అటవీ జీవాల వేటగాళ్ళపై పోలీసుల నజర్

అటవీ జీవాలైన పంది మాంసానికి కిలో రూ.300,కుందేళ్ళ మాసానికి కిలో రూ.1000 డిమాండ్ ఉండడంతో వేటగాళ్లు అటవీ జంతువుల వేటకు మొగ్గుచూపుతున్నారు. గుడేపల్లి, భాగిర్తిపేట చివారు అటవీ ప్రాంతంలో ఏళ్ల తరబడి వేటగాళ్లు అటవీ జంతువులను చంపుతున్నా...సంబంధిత అటవీ శాఖ,పోలీసు శాఖ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలకు పూనుకోక పోవడం గమనార్హం.ఇప్పటికైన స్పందించి కేసులో చొరవ చూపి ముందుకు సాగుతారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.

# ఉద్యోగుల ఆందోళనకు సంపూర్ణ మద్దతు

- ఈహెచ్ఎస్ అమలుపై ఉద్యోగులు, పెన్షనర్లలో ఆందోళన : దేవీప్రసాద్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఉద్యోగుల ఆందోళనకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని, ఈహెచ్ఎస్ అమలుపై ఉద్యోగులు, పెన్షనర్లలో ఆందోళన నెలకొందని టీఎన్‌జీవో మాజీ అధ్యక్షుడు గుండవరం దేవీప్రసాద్ తెలిపారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) అమలుపై ఉద్యోగుల ఆరోగ్య ట్రస్ట్ చేసిన తాజా ప్రకటన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లలో ఆందోళనను మరింత పెంచిందని, ఆగస్టు 17 నుంచి నూతన జునా పథకం అమల్లోకి వచ్చిందని ప్రకటించడం ఆశ్చర్యకరంగా ఉందన్నారు. ఆగస్టు 17 నుంచి పథకం అమల్లో ఉందని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఇప్పటివరకు ఏ ఒక్క ఆసుపత్రిలోనైనా ఉద్యోగులకు వాస్తవంగా నగదు రహిత వైద్య సేవలు అందుతున్నాయా అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం లేదన్నారు. నూతన పథకం కింద 4,440 మంది లబ్ధి పొందారని ప్రభుత్వం ప్రకటించడం హాస్యాస్పదం, నిజంగా 4,440 మంది లబ్ధి పొందితే, వారి పేర్లు, చికిత్స పొందిన ఆసుపత్రుల వివరాలు, అందించిన వైద్య సేవలు, చెల్లించిన మొత్తాల వివరాలను ప్రభుత్వం పారదర్శకంగా వెబ్ సైట్లో ఉంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఉద్యోగులకు డిజిటల్ హెల్త్ కార్డులు అందించడంలో ప్రభుత్వం విఫలమైంది. డిజిటల్ కార్డులు లేకుండా, వ్యవస్థలను బలోపేతం చేయకుండా ఉద్యోగులు, పెన్షనర్లు క్యాష్‌లెస్ వైద్య సేవలు ఎలా పొందగలరో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల జీతాల నుంచి మే నెల నుంచే ఈహెచ్ఎస్ కోసం ప్రీమియం/వాటా వసూలు చేసిన ప్రభుత్వం, ఇప్పుడు పథకం ఆగస్టు 17 నుంచి మాత్రమే అమల్లోకి వచ్చిందని ప్రకటించడం సమంజసం కాదని, మే నుంచే ఉద్యోగుల జీతాల నుంచి డబ్బులు వసూలు చేసినప్పుడు, అదే కాలం నుంచి వారికి ఆరోగ్య రక్షణ ఎందుకు కల్పించలేదో ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మే 1, 2026 నుంచి ఇప్పటి వరకు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన ఉద్యోగులు, పెన్షనర్లు, వారి ఆధారిత కుటుంబ సభ్యుల అర్హత కలిగిన వైద్య ఖర్చులను వెంటనే రీయింబర్స్ చేయాలని కోరారు. ఆగస్టు 17ను అమలు తేదీగా చూపించి, అంతకుముందు వైద్యం పొందిన ఉద్యోగులను నష్టపరిచే విధానాన్ని ప్రభుత్వం విడనాడాలన్నారు. ఈహెచ్ఎస్ సేవలను ఎంప్యానెల్డ్ ఆసుపత్రులకూ విస్తరించాలని, ఈహెచ్ఎస్‌లో అవుట్‌పేషెంట్(ఓపీ) సేవలను కేవలం వెల్‌నెస్ సెంటర్లకే పరిమితం చేయడం సరికాదన్నారు.



## గుప్త నిధుల కోసం తవ్వకాలు

- ముగ్గురు అరెస్ట్

**వెల్దండ ఆగస్టు 23 (జనంసాక్షి) :** గుప్త నిధుల తవ్వకాల్లో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు వెల్దండ ఎస్సై యుగంధర్ రెడ్డి తెలిపారు. నాగర్ కర్నూలు జిల్లా వెల్దండ మండలం రాచూరు తండా సమీపంలో కొంతమంది వ్యక్తులు గుప్త నిధులు తవ్వకానికి పాల్పడుతున్నట్లు శనివారం రాత్రి ఓ వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు వెళ్లి పరిశీలించగా ఒక జెసిబి, ద్విచక్ర వాహనాన్ని, ముగ్గురు వ్యక్తులను పోలీసులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.ఆ ముగ్గురు వ్యక్తుల వివరాలు ఇలా ఉన్నాయి.. గుత్తి సత్యనారాయణ (40) రాచూరు గ్రామం, కేతావత్ శంకర్ (34) హరియా నాయక్ తండ, కేసారపు శ్రీశైలం (25) జెసిబి డ్రైవర్ వెల్దండ గ్రామం అనే ముగ్గురు వ్యక్తులు పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. ఈ గుప్త నిధుల తవ్వకాలలో పట్టుబడిన జెసిబి టీజీ 06బీ 1171, టీఎస్ 07 జిబి 8362 (హోండా షైన్) వాహనాలను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇంకా కొంతమంది పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.



# కాంగ్రెస్, బీజేపీ నాటకం తేటతెల్లం: జగదీశ్‌రెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కాంగ్రెస్, బీజేపీ కలిసి ఆడిన నాటకం ద్రోహం తేటతెల్లం అయిందని.. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా సుందిళ్ల, అన్నారం బ్యారేజ్‌లపై సెంట్రల్ వాటర్ కమిషన్ ఇచ్చిన రిపోర్ట్‌తో కలిసి ఆడుతున్న నాటకం బహిర్గతం అయిందని మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మేడిగడ్డ బ్యారేజ్‌తో సంబంధం లేకుండా కన్నేపల్లి పంపు హౌస్ ఆన్ చేయాలని కేటీఆర్ అనేక సార్లు చెప్పినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. చెప్పిన అబద్ధమే చెప్పుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డీఎస్‌ఏ సాకు చెప్పిందని ఆరోపించారు. కమీషన్లకు అలవాటు పడ్డ ఈ ప్రభుత్వం లక్షలాది ఎకరాలకు నీళ్లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. పోతిరెడ్డిపాడు నుంచి నీళ్లు ఏ విధంగా దోచుకుంటున్నారో వాస్తవాలు ప్రజలకు చూపించామని.. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పెట్టిన పోతిరెడ్డిపాడు బొక్కతో అంతులేకుండా నీళ్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకెళుతున్నదని ఆరోపించారు. గోదావరి, కృష్ణాలో ఈ ప్రభుత్వం ద్రోహం చేస్తున్నదని అన్నారు. నీళ్లు ఇస్తే కరెంట్ కొనాలని పంటలు వేస్తే ఎరువులు ఇవ్వాల్సి వస్తుందని నీరు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. పంట కొంటే బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే దుర్మార్గమైన ఆలోచనలో ఉన్నదన్నారు. రైతులకు ఎల్‌నినో పెట్టిన శాపం కాదని.. కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన శాపని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం నుంచి పట్టిసీమ నుంచి బ్రహ్మాండంగా నీళ్లు పోతున్నాయని.. కన్నేపల్లి పంపులు ఆన్ చేసి ఉంటే మల్లన్నసాగర్, కొండపోచమ్మ, రంగనాయక సాగర్ నిండేవని తెలిపారు. ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని కేసీఆర్‌కు క్షమాపణలు చెప్పి కన్నేపల్లి పంపులు ఆన్ చేయాలని డిమాండ్ చేశారు.

# న్యూయార్క్‌లో భారతీయుడి కాల్చివేత



**హైదరాబాద్ (జనంసాక్షి) :** అమెరికాలో భారతీయ యువకుడు హత్యకు గురయ్యాడు. ఈ ఘటన అమెరికా, న్యూయార్క్ నగరంలో శుక్రవారం జరిగింది. మృతుడిని గుర్దీప్ సింగ్‌గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పంజాబ్, కపుర్తాలా జిల్లాలోని జబోవాల్ గ్రామానికి చెందిన గుర్దీప్ సింగ్ 2017లో అమెరికా వెళ్లాడు. అతడు డంకీ రూట్‌లో, అక్రమ మార్గంలో అమెరికా వెళ్లాడు. ఇందుకోసం భారీగా అప్పు చేశాడు. మంచి జీవితం కోసం వెళ్లిన అతడు చివరకు అక్కడ పిజ్జా డెలివరీ పార్ట్‌నర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం న్యూయార్క్ నగరంలో పిజ్జా డెలివరీ చేసేందుకు వెళ్తుండగా, బ్రూక్లిన్ వద్ద అతడిని ఒక వ్యక్తి కాల్చి చంపాడు. స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 10.00 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ కాల్పులపై పోలీసులకు, ఎమర్జెన్సీ సర్వీసెస్‌కు స్థానికులు సమాచారం అందించారు. వారు వచ్చి, గాయాలతో పడి ఉన్న గుర్దీప్ సింగ్‌ను ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటన సమయంలో తాము ఆరు రౌండ్ల కాల్పుల శబ్దం విన్నామని స్థానికులు తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటన జరిగిన ప్రదేశంలో సీసీటీవీ కెమెరా దృశ్యాల్ని పోలీసులు పరిశీలించారు. ఘటన జరిగిన ప్రదేశంలో గుర్దీప్ సింగ్‌కు, మరో వ్యక్తికి గొడవ జరగడం సీసీటీవీ కెమెరాలో రికార్డైంది. ఇద్దరి మధ్య రోడ్డుపై వాగ్వాదం జరగడంతో, ఓ వ్యక్తి గుర్దీప్ సింగ్‌పై కాల్పులు జరిపాడు. అనంతరం కారులో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అయితే, అది దోపిడీ ఘటనా.. లేక రోడ్డుపై వాహనాలకు సంబంధించి జరిగిన గొడవా అనేది తేలాల్సి ఉంది. లేదా ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. సీసీటీవీ కెమెరాలో రికార్డైన నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఇంకా అతడిని పోలీసులు పట్టుకోలేదు. నిందితుడిని పట్టుకుని, విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని స్థానిక పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై 'ద నార్త్ అమెరికన్ పంజాబి అసోసియేషన్' దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. హత్యకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాలని, నిందితుల్ని శిక్షించాలని డిమాండ్ చేసింది.

# 14 దేశాలకు పార్టీ అధ్యక్షులను నియమించిన కవిత



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ బలోపేతం కోసం 14 దేశాల్లో పార్టీ అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. 14 దేశాలతో పాటు పార్టీ మహారాష్ట్ర శాఖ అధ్యక్షుడిని నియమించారు. ఆయా దేశాల్లో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. వారి నియామకాలు వెంటనే అమల్లోకి వస్తాయని తెలిపారు.

ఆస్ట్రేలియా: కిషోర్ కత్తి, యూకే: సుమన్ రావు బాల్మూరి, కెనడా: వెంకట్రామణ్ మెట్ పల్లి, ఇటలీ: తానింకి కిషోర్ యాదవ్, మాల్టా: పింటూ ఘోష్, పోర్చుగల్: ప్రకాష్ పొన్నకంటి, యూఏఈ: శేఖర్ గౌడ్ ఆరె, కువైట్: మార్క ప్రమోద్ గౌడ్, జింబాబ్వే: బెమ్మడి మహేందర్ రెడ్డి, ఖతార్: శేఖర్ చిలువూరి, ఫిన్లాండ్: సందీప్ రెడ్డి ఐరెడ్డి, నార్వే: ప్రసాద్ రావు బిక్కినేని, సౌదీ అరేబియా: మొజ్జం అలీ ఇఫ్తేకర్, ఐర్లాండ్: జయంత్ రెడ్డి మెట్టు నాయకులను నియమించారు. దీంతో పాటు టీఆర్ఎస్ మహారాష్ట్ర శాఖ రాష్ట్ర అధ్యక్షుడిగా సుల్గే శ్రీనివాస్‌ను నియమించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలను ఏకం చేస్తూ, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు.

# టీ-సాట్ ద్వారా ఫ్రీ మాక్ టెస్టులు!

- పోలీస్ అభ్యర్థులకు గుడ్ న్యూస్..




**హైదరాబాద్ (జనం సాక్షి) :** రాష్ట్రంలో పోలీసు ఉద్యోగాలకు సిద్ధమయ్యే యువతకు టీ-సాట్ నెట్వర్క్ ప్రత్యేక డిజిటల్ కంటెంట్ అందించేందుకు సిద్ధమైంది. పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు నిర్వహించే 7,437 పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు డిజిటల్ పాఠ్యాంశాలను రూపొందించింది. ప్రసారాలకు సంబంధించిన వివరాలను టీ-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి యువతకు ప్రత్యేక అవకాశాలు కల్పించాలనే ఆలోచనతో నియామకాల్లో వయస్సును సైతం సడలించారని గుర్తుచేశారు. ఆగస్టు 24 ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు 12 సబ్జెక్టులపై ఎక్స్ పర్ట్స్ చే ప్రత్యేక లైవ్ ప్రసారాలు ఉంటాయని తెలిపారు.

సుమారు 600 గంటల రికార్డు కంటెంట్ విద్య ఛానల్‌లో ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు, నిపుణలో ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు పరీక్షలు నిర్వహించే తేదీ నాటికి ప్రసారాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. టీ-సాట్ నెట్వర్క్ కు చెందిన శాటిలైట్ తో పాటు అన్ని డిజిటల్ మాధ్యమాల ద్వారా పోలీస్ పోటీ పరీక్షల కంటెంట్ అందుబాటులో ఉంటుందని, మాక్ టెస్టులను సైతం నిర్వహిస్తుందని వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ప్రసారాలను తెలంగాణ యువత సద్వినియోగం చేసుకొని రాబోయే పోటీ పరీక్షల్లో రాణించాలని, ప్రసారాలు వీక్షించడంతో పాటు మాక్ టెస్టులను సైతం వినియోగించుకుని తమ తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సీఈవో సూచించారు.

# మానవ సంబంధాలను చాటిన 'పళ్ల బురుసు' సినిమా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** వృద్ధాప్యం, ఒంటరితనం, మానవ సంబంధాల విలువను ఆలోచింపజేసే విధంగా రూపొందించిన 'పళ్ళ బురుసు' చిత్రం అభినందనీయమని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు కె.నారాయణ తెలిపారు. ఇలాంటి ప్రయోజనాత్మక, సామాజిక స్పృహ కలిగించే చిత్రాలను ప్రభుత్వం ప్రోత్సహించాలని ఆయన కోరారు. ప్రముఖ సినీ నిర్మాత అక్కినేని నాగార్జునకు చెందిన అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మించిన 'పళ్ళ బురుసు' చిత్రంలో వృద్ధుల సహజమైన కోర్కెలు, ఒంటరితనాన్ని భరించడం, మిత్రుల ఆత్మీయ కలయిక కలిగించే ఆనందం వంటి అంశాలను చక్కగా చూపించారని నారాయణ పేర్కొన్నారు. కార్ల్ మార్క్స్ చెప్పిన 'సకల మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలే' అనే భావన సైతం సినిమాలో ఒక కోణంలో ప్రతిబింబిస్తుందని తెలిపారు.

చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో ఈ నెల 22న చిత్ర దర్శకుడు, కథా రచయిత ఉదయ్ చౌహాన్, సహనిర్మాత అధిప్ అయ్యర్ తదితర అన్నపూర్ణ స్టూడియోస్ బృందం 'పళ్ళ బురుసు' చిత్రాన్ని ప్రదర్శించింది. వృద్ధాశ్రమంలోని సభ్యులు చిత్రాన్ని ఆసక్తిగా వీక్షించి, సినిమాలోని పాత్రలు, పరిస్థితులను తమ జీవితాలతో అన్వయించుకుని ఆనందించారని నారాయణ తెలిపారు. వృద్ధాప్యంలో స్నేహం, అనుబంధం, ఆత్మీయత ఎంత ముఖ్యమో ఈ చిత్రం గుర్తుచేసిందని పేర్కొన్నారు. ఇలాంటి సినిమాలు వినోదాన్ని అందించడంతోపాటు వృద్ధుల సమస్యలు, ఒంటరితనం, మానవ సంబంధాల విలువపై సమాజంలో చర్చకు దారితీస్తాయని తెలిపారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి విలాసవంతంగా సినిమాలు నిర్మించి, అధిక టికెట్ ధరల ద్వారా ప్రజలపై భారం మోపే చిత్రాలకు ప్రభుత్వ సహాయం అందించడం సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రజలకు వినోదంతోపాటు ఆలోచన, ఆనందం, సామాజిక చైతన్యం కలిగించే చిత్రాలను ప్రోత్సహించడమే ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.

# స్త్రీ ఎవరి సొత్తు కాదు

సంపాదకీయం

స్త్రీ ఎవరి సొత్తు కాదు.. ఆమెకు తనదైన వ్యక్తిత్వం ఉంది. తండ్రి, సోదరుడు, భర్త, కుమారుడు వంటి కుటుంబ బంధాలు ఆమె జీవితంలో భాగమే తప్ప, ఆమె వ్యక్తిత్వాన్ని నిర్ణయించే హక్కు ఎవరికీ లేదన్న రాహుల్ గాంధీ వ్యాఖ్యలు ఒక సాధారణ రాజకీయ ప్రసంగంగా కొట్టిపారేయలేనివి. భారత సమాజంలో శతాబ్దాలుగా కొనసాగుతున్న పితృస్వామ్య భావజాలంపై, ముఖ్యంగా స్త్రీని పురుషుడి ఆధీనంలో ఉంచే మనువాద దృక్పథంపై ఈ వ్యాఖ్యలు నేరుగా ప్రశ్నలు సంధిస్తున్నాయి.

ఇది రాహుల్ గాంధీ రాజకీయ పరిణతిపై కూడా కొత్త చర్చకు దారితీసే అంశమే. రాజకీయ నాయకుడి పరిణతిని కేవలం ఎన్నికల్లో గెలిచిన సీట్లతోనో, సభలో చేసే పదునైన విమర్శలతోనో కొలవలేం. సమాజంలో లోతుగా పాతుకుపోయిన అసమానతలను గుర్తించి, వాటిపై ప్రశ్నలు లేవనెత్తే స్థాయిలో రాజకీయ సంభాషణను తీసుకెళ్లగలగడం కూడా పరిణతికి ఒక కొలమానం. స్త్రీకి స్వాతంత్ర్యం, గౌరవం, సమాన హక్కులు ఉండాలన్న భావన కొత్తది కాదు. భారత రాజ్యాంగం పౌరులందరికీ సమానత్వాన్ని హామీ ఇచ్చింది. కులం, మతం, లింగం వంటి ఆధారాలపై వివక్షకు తావులేదని రాజ్యాంగం స్పష్టం చేసింది. అయినప్పటికీ సామాజిక జీవితంలో పాత అసమానతలు పూర్తిగా అంతరించిపోలేదు. చట్టం మారడం సులభమే కానీ, మనుషుల ఆలోచనా విధానం మారడం అంత సులభం కాదు.

అందుకే రాహుల్ గాంధీ వ్యాఖ్యల్లోని అసలు ప్రాధాన్యం వ్యక్తిగత రాజకీయ ప్రచారంలో కాకుండా, స్త్రీని వ్యక్తిగా చూడాలా? లేక కుటుంబానికి, పురుషుడికి అనుబంధంగా మాత్రమే చూడాలా? అనే ప్రాథమిక ప్రశ్నలో ఉంది.

స్త్రీకి సంబంధించి సమాజంలో ఇప్పటికీ కనిపించే హింస, వేధింపులు, ఆర్థిక ఆధారపడటం, నిర్ణయాధికార లోపం వంటి సమస్యలను కేవలం చట్టాల ద్వారా పరిష్కరించడం సాధ్యం కాదు. కుటుంబం నుంచి విద్యా వ్యవస్థ వరకు, రాజకీయాల నుంచి మీడియా వరకు, ప్రతి స్థాయిలో స్త్రీని సమాన పౌరురాలిగా చూసే దృక్పథం బలపడాలి.

ఇక్కడే మనువాదంపై విమర్శకు రాజ్యాంగ విలువలకు మధ్య ఉన్న సంబంధం స్పష్టమవుతుంది. భారతదేశం ఆధునిక రాజ్యాంగ ప్రజాస్వామ్యంగా ముందుకు సాగాలంటే జన్మ ఆధారిత అసమానతలే కాకుండా, లింగ ఆధారిత ఆధిపత్య భావజాలం కూడా ప్రశ్నించబడాలి. ఏ సంప్రదాయం అయినా వ్యక్తి గౌరవాన్ని, సమానత్వాన్ని నిరాకరిస్తే దానిని విమర్శించడం ప్రజాస్వామ్య హక్కు. అయితే ఈ చర్చను కేవలం "రాహుల్ వర్సెస్ అధికారపక్షం" అనే రాజకీయ చట్రంలోకి పరిమితం చేయడం కూడా సరికాదు. రాహుల్ చెప్పిన విషయాల్లో ఏకీభవించని వారు ఉంటే వారు కూడా ప్రత్యామ్నాయ వాదనను సమాజం ముందు ఉంచాలి. వ్యక్తిగత విమర్శలు, వ్యంగ్యాలు, రాజకీయ ఆరోపణలతో అసలు ప్రశ్నను పక్కదారి పట్టించడం వల్ల ప్రయోజనం ఉండదు.

ఎందుకంటే ప్రశ్న రాహుల్ గాంధీ గురించే కాదు. ఈ దేశంలో ఒక మహిళ తన జీవితంపై తుది నిర్ణయం తీసుకునే హక్కు ఎంతవరకు కలిగి ఉంది? అన్నదే అసలు ప్రశ్న. ఇదే ప్రశ్న మన సమాజంలోని పితృస్వామ్య నిర్మాణానికి సవాల్. ఇదే ప్రశ్న రాజ్యాంగం హామీ ఇచ్చిన సమానత్వానికి పరీక్ష. రాజకీయ నాయకులు మారవచ్చు. పార్టీలు మారవచ్చు. అధికారాలు చేతులు మారవచ్చు. కానీ సమాజాన్ని మార్చే ఆలోచనలు మాత్రం రాజకీయాలకు అతీతంగా చర్చించబడాలి.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై రాజకీయ పక్షాలు తమ తమ కోణాల్లో స్పందించవచ్చు. కానీ ఆయన లేవనెత్తిన స్త్రీ స్వాతంత్ర్యం, వ్యక్తిగత గౌరవం, సమానత్వం అనే ప్రశ్నలను మాత్రం సమాజం విస్మరించకూడదు. మనువాదంపై విమర్శ ఒక పార్టీకి చెందినది కాదు. సమానత్వం కోసం జరిగే చర్చ కూడా ఒక నాయకుడి సొత్తు కాదు. అది భారత రాజ్యాంగం ఇచ్చిన సమాన పౌరసత్వం గురించి జరిగే విస్తృతమైన సామాజిక సంభాషణ. అందుకే రాహుల్ వ్యాఖ్యలపై వచ్చిన రాజకీయ ప్రకంపనల కంటే, ఆ వ్యాఖ్యలు లేవనెత్తిన సామాజిక ప్రశ్నలే ఎక్కువ కాలం నిలిచేవి.

# కల్తీ సామ్రాజ్య విస్తరణ - ఆహారం నుంచి ఔషధాల వరకు



, ప్రజల ప్రాణాలతో చెలగాటం : ప్రజారోగ్యం పట్టని ప్రభుత్వాలు మనిషి జీవించడానికి తినే ఆహారం, తాగే నీరు, పీల్చే గాలి, రైతు పండించే పంట, అనారోగ్యానికి వాడే మందు, ప్రయాణానికి ఉపయోగించే ఇంధనం... ఇవన్నీ నాణ్యమైనవిగా ఉండాలి. కానీ నేటి మార్కెట్‌లో నాణ్యతను మోసం, కల్తీని వ్యాపారం, వినియోగదారుడి అసహాయతను లాభంగా మార్చే ప్రమాదకర సంస్కృతి పెరుగుతోంది. అయితే ఒక విషయం స్పష్టంగా చెప్పాలి: ప్రతి వస్తువు 90 శాతం కల్తీ అని చెప్పడానికి అధికారిక ఆధారాలు లేవు. కానీ అధికారిక తనిఖీల్లో బయటపడుతున్న నాసిరకం, కల్తీ, నిబంధనలకు విరుద్ధమైన ఉత్పత్తుల పరిమాణం మాత్రం సమస్య తీవ్రతను స్పష్టంగా చూపుతోంది.

**కల్తీ అంటే కేవలం ఆహారంలో మోసం మాత్రమే కాదు:**
పాలు, పెరుగు, నెయ్యి, వెన్న, పన్నీర్, తేనె, వంటనూనెలు, టీ, కాఫీ, పప్పులు, ధాన్యాలు, మసాలాలు, స్వీట్లు వంటి ఆహార పదార్థాల్లో నాణ్యత సమస్యలు ఉన్నాయి. ఇందులో నీరు కలపడం, చౌక పదార్థాలను ఖరీదైన పదార్థాలుగా విక్రయించడం, అనుమతి లేని రంగులు లేదా రసాయనాలు ఉపయోగించడం, నాసిరకం ముడి పదార్థాలు వాడటం, గడువు ముగిసిన పదార్థాలను తిరిగి మార్కెట్లోకి తేవడం వంటి రూపాలు ఉంటాయి.
ఇది కేవలం వినియోగదారుడిని మోసం చేయడం కాదు; కల్తీ పదార్థం ఏ రసాయనంతో, ఎంత పరిమాణంలో, ఎంతకాలం తీసుకున్నామన్నదే ఆరోగ్య ప్రమాదాన్ని నిర్ణయిస్తుంది. బ్యాక్టీరియా, ఫంగస్, పురుగుమందుల అవశేషాలు, భారీ లోహాలు, అనుమతిలేని రంగులు, ఆక్సీకరణ చెందిన నూనెలు వంటి ప్రమాదాలు దీర్ఘకాలంలో కాలేయం, మూత్రపిండాలు, నాడీ వ్యవస్థ, హార్మోన్ల వ్యవస్థపై ప్రభావం చూపవచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా అంచనాల ప్రకారం 2021లో కలుషిత ఆహారం వల్ల ప్రపంచవ్యాప్తంగా సుమారు 86.6 కోట్ల మంది అనారోగ్యానికి గురై, 15.2 లక్షల మంది మరణించారు. ఉత్పాదకత, వైద్య ఖర్చుల రూపంలో ప్రపంచ ఆర్థిక నష్టం సుమారు 310 బిలియన్ అమెరికన్ డాలర్లుగా అంచనా వేసింది. కలుషిత ఆహారం 200కుపైగా వ్యాధులకు కారణమవుతుందని కూడా సంస్థ చెబుతోంది.

**భారతదేశంలో అధికారిక గణాంకాలే ఒక హెచ్చరిక:**
భారతదేశంలో ఆహార భద్రత వ్యవస్థ పూర్తిగా పనిచేయడం లేదని ఖచ్చితంగా చెప్పొచ్చు. తనిఖీలు ఎప్పుడో ఒకసారి అడపా దడపా జరుగుతున్నాయి. కానీ దేశ పరిమాణానికి, మార్కెట్ విస్తృతికి అనుగుణంగా అవి ఏ మాత్రం సరిపోవడం లేదు.
2023-24లో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కలిపి 1,70,513 ఆహార నమూనాలు విశ్లేషించగా, 33,808 నమూనాలు నిబంధనలకు అనుగుణంగా లేవని తేలింది. అదే కాలంలో 29,586 సివిల్ కేసులు జరిమానా/శిక్షతో ముగియగా, కేవలం 1,161 క్రిమినల్ కేసుల్లోనే శిక్షలు నమోదయ్యాయి. అంటే పరీక్షల సంఖ్య పెరిగినా, నేరానికి తగిన వేగంతో శిక్ష పడటం లేదు. మన దేశంలో ప్రతి విషయంలో జాప్యం, నిర్లక్ష్యం. ఆంధ్రప్రదేశ్‌లో 6,439 నమూనాల్లో 472 నిబంధనలకు విరుద్ధంగా ఉండగా, తెలంగాణలో 6,156లో 973 నమూనాలు నాన్-కన్ఫార్మింగ్‌గా నమోదయ్యాయి. ఈ సంఖ్యలు మొత్తం మార్కెట్‌ను ప్రతిబింబించవు; తనిఖీ చేసిన నమూనాల ఫలితాలు మాత్రమే. అయినప్పటికీ సమస్యను తేలికగా తీసుకోవడానికి ఇవి అవకాశం ఇవ్వవు.

**రైతు కూడా మోసానికి బాధితుడే:**
కల్తీ సమస్య వినియోగదారుడి ఇంటి గుమ్మం వద్ద ప్రారంభం కాదు; విత్తనం నుంచే ప్రారంభమవుతుంది. 2023-24లో దేశవ్యాప్తంగా 1,33,588 విత్తన నమూనాలను పరీక్షించగా 3,630 నాసిరకం అని తేలింది. 1,81,153 ఎరువుల నమూనాల్లో 8,988 నాన్-స్టాండర్డ్‌గా, 80,789 పురుగుమందుల నమూనాల్లో 2,222 స్పూరియస్‌గా గుర్తించబడ్డాయి. నకిలీ విత్తనం రైతుకు పంట నష్టాన్ని, నకిలీ ఎరువు పెట్టుబడి నష్టాన్ని, నాసిరకం పురుగుమందు పంట నష్టాన్ని మాత్రమే కాదు-రైతు అప్పును, కుటుంబ ఆర్థిక స్థితిని, ఆహార సరఫరా భద్రతను కూడా దెబ్బతీస్తుంది.

**తూనికలు, కొలతలు కూడా వినియోగదారుడి హక్కే**
ఒక కిలో అని కొనుగోలు చేసి 900 గ్రాములు రావడం, పెట్రోల్ కొలతలో లోపం, ప్యాకెట్‌పై ముద్రించిన పరిమాణం కంటే తక్కువగా ఉండటం-ఇవన్నీ చిన్న మోసాలుగా కనిపించినా కోట్లాది లావాదేవీల్లో ఇవి భారీ ఆర్థిక దోపిడీగా మారుతాయి.
ప్యాకేజ్డ్ కమోడిటీస్‌కు సంబంధించి లీగల్ మెట్రాలజీ నియమాలు అమల్లో ఉన్నాయి. ప్యాక్‌పై పరిమాణం, గరిష్ఠ చిల్లర ధర, తయారీదారు/ప్యాకర్ వివరాలు వంటి సమాచారానికి నియమాలు ఉన్నాయి. కానీ తనిఖీ వ్యవస్థ కేవలం దుకాణాల వరకు పరిమితం కాకుండా తయారీ కేంద్రం, గోదాం, రవాణా,హోల్ సేల్,రిటైల్ మొత్తం సరఫరా గొలుసును తనిఖీ చేయాలి.

**కూరగాయలు, పండ్లు కూడా విషమే:**
కాలుష్య నీటితో సాగు, అధిక పురుగుమందుల వినియోగం, పంట కోత తర్వాత రసాయనాలతో నిల్వ కాలం పెంచడం, పండ్లను వేగంగా పండించడానికి అనధికారిక రసాయనాల వినియోగం వంటి సమస్యలు ఆహార భద్రతను మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. అయితే ఈ రోజుల్లో ప్రతి పండు రసాయనాలతో పండిస్తున్నారు, ప్రతి కూరగాయ మురుగు నీటితోనే పండుతోంది అనే సాధారణీకరణ చేయటం కూడా శాస్త్రీయంగా సరైంది కాదు. కానీ కళ్ళముందు కనపడుతున్న సమస్యను కాదనలేని వాస్తవం.

**మెడికల్ షాపుల్లో మందుల్లో నాణ్యత వైఫల్యం మరింత ప్రమాదకరం:**
ఆహారంలో కల్తీ మనిషిని అనారోగ్యానికి గురిచేస్తే, నాసిరకం లేదా నకిలీ మందు నేరుగా ప్రాణాన్ని ప్రమాదంలోకి నెడుతుంది. 2024-25లో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల డ్రగ్ నియంత్రణ సంస్థలు 1,16,323 ఔషధ నమూనాలను పరీక్షించగా 3,104 నాట్-ఆఫ్-స్టాండర్డ్-క్వాలిటీ నమూనాలు, 245 స్పూరియస్/అడల్టరేటెడ్ నమూనాలు గుర్తించాయి. 2023--24లో కూడా 1,06,150 నమూనాల్లో 2,988 నాట్-ఆఫ్-స్టాండర్డ్, 282 స్పూరియస్/అడల్టరేటెడ్ నమూనాలు నమోదయ్యాయి.
అందువల్ల ప్రతి మందు నకిలీ అని కాదు; కానీ ఒక్క నకిలీ యాంటీబయాటిక్, ఒక్క తప్పు మోతాదు, ఒక్క నాసిరకం అత్యవసర ఔషధం కూడా ప్రాణాంతక పరిణామాలకు దారితీయగలదు. కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ నిరంతరం నాట్-ఆఫ్-స్టాండర్డ్, స్పూరియస్ మందుల అలర్ట్‌లు విడుదల చేస్తోంది.
**మాంసం, హోటళ్లు, పాలు:** పరిశుభ్రతే మొదటి రక్షణ రోడ్డు పక్క హోటల్ అయినా, పెద్ద హోటల్ అయినా ఆహార భద్రతకు ఒకే ప్రమాణం ఉండాలి. సరైన ఉష్ణోగ్రతలో నిల్వ చేయని చికెన్, మటన్, చేపలు; రోజులు గడిచిన పదార్థాలు; అపరిశుభ్రమైన నీరు; మురికి వంటగది; పునర్వినియోగించిన నూనె-ఇవి బ్యాక్టీరియా, ఫంగస్, ఇతర జీవ కాలుష్యాలకు దారితీస్తున్నాయి. ఫ్రిజ్ లో నిల్వ ఉంచిన సమయం, ఉష్ణోగ్రత రికార్డులు, గడువు, బ్యాచ్ నంబర్, సరఫరాదారు వివరాలు తప్పనిసరిగా డిజిటల్‌గా నమోదు చేయాలి.
మద్యం, ఇంధనం విషయంలో కూడా నాణ్యత కీలకం:
కల్తీ మద్యంలో మిథనాల్ వంటి విషపదార్థాలు ఉండే ప్రమాదం ప్రాణాంతకం. అందువల్ల అక్రమ తయారీ, అక్రమ రవాణా, నకిలీ లేబులింగ్‌పై రాష్ట్ర ఎక్సైజ్ వ్యవస్థకు ప్రత్యేక దర్యాప్తు సామర్థ్యం అవసరం. పెట్రోల్, డీజిల్‌లో నాణ్యత, పరిమాణం రెండూ ముఖ్యమే. పెట్రోల్ బంకుల్లో నమూనా పరీక్షలు, సర్‌ప్రైజ్ తనిఖీలు, మొబైల్ ల్యాబొరేటరీల ద్వారా పరీక్షలు వంటి వ్యవస్థలు ఇప్పటికే ఉన్నాయి. అయినప్పటికీ వినియోగదారుడికి తక్షణ ఫిర్యాదు, నమూనా పరీక్ష, జరగటం కష్టం. నష్టపరిహారం అందే విధానం మరింత బలపడాలి.

**ప్రభుత్వం చేయాల్సింది ఏమిటి?**
మొదటగా, ఆహారం, మందులు, వ్యవసాయ ఇన్‌పుట్లు, ఇంధనం, తూనికలు, మద్యం వంటి రంగాలను వేర్వేరు శాఖల సమస్యలుగా కాకుండా "జాతీయ నాణ్యత మరియు వినియోగదారుల భద్రత వ్యవస్థ"గా చూడాలి. రెండవది, ప్రతి జిల్లాలో ఆధునిక, నేషనల్ అక్రెడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కొలాబ్రేషన్ ల్యాబొరేటరీస్ గుర్తింపు పొందిన పరీక్షా ప్రయోగశాలలు ఉండాలి. నమూనా తీసుకున్న తేదీ నుంచి నివేదిక వచ్చే వరకు మొత్తం ప్రక్రియను డిజిటల్ ట్రాకింగ్‌లో పెట్టాలి. మూడవది, కల్తీ నిరూపితమైన ఉత్పత్తి మాత్రమే కాదు, దాని తయారీదారు, డిస్ట్రిబ్యూటర్, హోల్‌సేలర్, రీటైలర్ మొత్తం సరఫరా గొలుసును పరిశీలించాలి. పునరావృత నేరానికి భారీ జరిమానా, లైసెన్స్ రద్దు, ఆస్తుల స్వాధీనం, వేగవంతమైన ప్రత్యేక న్యాయస్థానం వంటి చర్యలు ఉండాలి. నాలుగవది, ఆహార భద్రత, డ్రగ్ నియంత్రణ, లీగల్ మెట్రాలజీ, వ్యవసాయ ఇన్‌పుట్ నాణ్యత, పర్యావరణ కాలుష్య నియంత్రణ సంస్థల మధ్య డేటా భాగస్వామ్యానికి ఒక సమగ్ర డిజిటల్ ప్లాట్‌ఫారం ఏర్పాటు చేయాలి.

**ప్రజలు, స్వచ్ఛంద సంస్థల పాత్ర:**
వినియోగదారులు బిల్లు తీసుకోవాలి, ప్యాకెట్‌పై తయారీ తేదీ, గడువు, బ్యాచ్ నంబర్, లైసెన్స్ వివరాలు చూడాలి. అనుమానాస్పద ఉత్పత్తిని స్వయంగా పరీక్షించకుండా అధికారిక ఫిర్యాదు వ్యవస్థను ఉపయోగించాలి. ఫిర్యాదుతో పాటు బిల్లు, ప్యాకెట్, బ్యాచ్ నంబర్, ఫోటోలను భద్రపరచాలి. స్వచ్ఛంద సంస్థలు "కల్తీ ఉంది" అనే భయప్రచారం కాకుండా సాక్ష్యాధారిత వినియోగదారుల అవగాహన ఉద్యమం నిర్వహించాలి. జిల్లాల వారీగా నమూనా పరీక్షలు, ప్రజా నివేదికలు, వినియోగదారుల హక్కుల శిక్షణ, పాఠశాలలు-కాలేజీలలో ఆహార భద్రత విద్యను చేపట్టాలి.

**కల్తీ వ్యతిరేక పోరాటం అంటే ఆరోగ్య బడ్జెట్‌ను కాపాడటమే:**
కల్తీ పై పోరాటాన్ని కేవలం "వినియోగదారుల హక్కు"గా చూడటం సరిపోదు. ఇది ప్రజారోగ్యం, రైతు ఆదాయం, కుటుంబ పొదుపు, ఉత్పాదకత, పర్యావరణం, జాతీయ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన ప్రశ్న. ప్రజలు అనారోగ్యానికి గురైతే కుటుంబ పొదుపు ఆసుపత్రి బిల్లులుగా మారుతుంది. రైతుకు నకిలీ విత్తనం దొరికితే అప్పు పెరుగుతుంది. నాసిరకం మందు పనిచేయకపోతే చికిత్స కాలం పెరుగుతుంది. కలుషిత ఆహారం వల్ల పిల్లలు అనారోగ్యానికి గురైతే విద్యా అవకాశాలు కూడా దెబ్బతింటాయి.అందుకే "చౌకగా దొరికితే చాలు" అనే వినియోగ సంస్కృతితో పాటు "నాణ్యమైనది, సురక్షితమైనది కావాలి అనే నినాదంగి మారాలి" ఇది హక్కుల చైతన్యంగా మార్చాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఆహార భద్రతను ప్రజారోగ్యం, ఆర్థిక వ్యవస్థ, ఉత్పాదకతతో అనుసంధానిస్తూ బహుళ శాఖల సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తోంది.
చివరిగా...కల్తీ అనేది కేవలం ఒక వ్యాపారి చేసే మోసం కాదు. అది సమాజం యొక్క నమ్మకాన్ని, ఆరోగ్యాన్ని, ఆర్థిక భద్రతను దోచుకునే నేరం. ఆహారం నుంచి మందుల వరకు, విత్తనం నుంచి పంట వరకు, తూనిక నుంచి ప్యాకింగ్ వరకు ప్రతి దశలో నాణ్యతకు హామీ లభించినప్పుడే "వికసిత దేశం" అనే లక్ష్యానికి అర్థం ఉంటుంది. ప్రజల ప్రాణాలను కాపాడే వ్యవస్థలో తనిఖీ కంటే నిరోధం, ఫిర్యాదు కంటే ముందస్తు పర్యవేక్షణ, జరిమానా కంటే వేగవంతమైన శిక్ష, ప్రకటన కంటే పారదర్శకత ప్రధాన సూత్రాలుగా మారాలి. కల్తీ రహిత మార్కెట్ ఒక విలాసం కాదు. అది ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# దిమాకి నక్సల్స్

## ప్రశ్నించే యువతకు మోదీ పెట్టిన కొత్త పేరు




2026 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఎర్రకోట నుంచి చేసిన ప్రసంగంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "దిమాకి నక్సల్స్" అనే పదాన్ని ఉపయోగించారు. ఆ వ్యాఖ్యపై రాజకీయంగా తీవ్ర చర్చ మొదలైంది. అనంతరం కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు, మోదీ ఉద్దేశం నక్సలైట్ భావజాలాన్ని సమర్థించే వ్యక్తుల గురించి అని వివరించారు.
అయితే ఇక్కడ అసలు ప్రశ్న ఒక్కటే: ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే యువతను, మేధావులను లేదా శాంతియుతంగా నిరసన తెలిపే ప్రజలను "దిమాకి నక్సల్స్" అనే ముద్రతో చూడటం ప్రజాస్వామ్యానికి ఎంతవరకు సమంజసం.
ప్రశ్నించడం నక్షలిజమా?
యువత ఉద్యోగాల కోసం ప్రశ్నిస్తే అది నక్షలిజమా!
విద్య ఖరీదు గురించి ప్రశ్నిస్తే అది నక్షలిజమా!
రైతుల సమస్యలపై మాట్లాడితే అది నక్షలిజమా!
ప్రభుత్వ విధానాలను విమర్శిస్తే అది దేశద్రోహమా!
సామాజిక న్యాయం అడిగితే అది నక్షలిజమా?
ఈ ప్రశ్నలకు "అవును" అని సమాధానం ఇస్తే, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కుకు స్థానం ఎక్కడ?
ప్రభుత్వాన్ని విమర్శించడం, ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరసన తెలపడం ఒక విషయం. హింసాత్మక చర్యలకు పాల్పడటం పూర్తిగా మరో విషయం. ఈ రెండింటినీ కలిపి చూడటం ప్రజా చర్చను గందరగోళానికి గురిచేస్తుంది.
"దిమాకి నక్సల్" అనే పదం రాజకీయంగా ఎందుకు ముఖ్యమైంది?
"నక్సల్" అనే పదానికి భారతదేశంలో ఒక నిర్దిష్ట చారిత్రక, రాజకీయ నేపథ్యం ఉంది. అందువల్ల ఆ పదాన్ని ఒక వ్యక్తిపై ప్రయోగించినప్పుడు అతనికి లేదా ఆమెకు తీవ్రమైన రాజకీయ ముద్ర ఏర్పడుతుంది.
2026 ఆగస్టు 15న మోదీ వ్యాఖ్యల తర్వాత వచ్చిన చర్చలో ఒకవైపు ఈ పదాన్ని నక్సలైట్ భావజాలానికి మద్దతుదారులపై ప్రయోగించినట్లు ప్రభుత్వం అనుకూల వర్గాలు వివరిస్తుండగా, మరోవైపు విమర్శకులు చదువుకున్న యువత, శాంతియుత నిరసనకారులను ఈ ముద్రతో చూడటం ప్రమాదకరమని ప్రశ్నిస్తున్నారు.
ఇక్కడ అసలు సమస్య ఎవరిని ఉద్దేశించారు? అన్నదానితో పాటు ఎలాంటి ప్రమాణంతో ఒక వ్యక్తిని "దిమాకి నక్సల్"గా నిర్ణయిస్తారు? అన్నది.
యువతను భయపెట్టడం పరిష్కారం కాదు
నేటి యువతకు సమాచారాన్ని తెలుసుకునే అవకాశాలు గత తరాల కంటే ఎక్కువగా ఉన్నాయి. వారు ప్రభుత్వాన్ని మాత్రమే కాదు, ప్రతిపక్షాన్ని కూడా ప్రశ్నించగలరు. తమకు నచ్చిన రాజకీయ అభిప్రాయాన్ని స్వీకరించగలరు, తిరస్కరించగలరు.
ఈ ప్రశ్నించే స్వభావాన్ని దేశానికి ముప్పుగా చూడటం కంటే, దాని వెనుక ఉన్న అసంతృప్తిని అర్థం చేసుకోవాలి.
యువతకు ఉద్యోగాలు కావాలి. నాణ్యమైన విద్య కావాలి.
సామాజిక సమానత్వం కావాలి. అవినీతి తగ్గాలి.
ప్రజా వనరులు ప్రజల ప్రయోజనాలకు ఉపయోగపడాలి.
ఇలాంటి డిమాండ్లు ప్రజాస్వామ్యంలో సహజమైనవే.
ప్రభుత్వం విమర్శను ఎలా ఎదుర్కోవాలి?
ప్రజాస్వామ్య ప్రభుత్వానికి విమర్శలు వస్తాయి. వాటికి సమాధానం ఇవ్వడానికి ఉత్తమ మార్గం ఆధారాలు, గణాంకాలు, విధానాలు, ప్రజా చర్చ.
"నువ్వు నన్ను విమర్శిస్తున్నావు కాబట్టి నువ్వు దేశ వ్యతిరేకివి" అనే వాదన సమస్యను పరిష్కరించదు.
అదే విధంగా "ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న ప్రతి ఒక్కరూ ప్రజల పక్షమే" అని చెప్పడం కూడా సరైనది కాదు.
ప్రజాస్వామ్య పద్ధతి ఏమిటంటే-వాదనను వాదనతో ఎదుర్కోవాలి.
అసలు దేశభక్తి అంటే ఏమిటి?
దేశభక్తిని కేవలం ప్రభుత్వానికి మద్దతుగా నిర్వచించడం ప్రజాస్వామ్య భావనను సంకుచితం చేస్తుంది.దేశభక్తి అంటే దేశ ప్రజల పట్ల బాధ్యత.
దేశభక్తి అంటే రాజ్యాంగ విలువలను గౌరవించడం.
దేశభక్తి అంటే ప్రజల హక్కులను కాపాడడం.
దేశభక్తి అంటే తప్పు కనిపిస్తే దాన్ని సరిచేయాలని కోరుకోవడం.
అందుకే ఒక యువకుడు "ఈ విధానం ఎందుకు?" అని అడిగినప్పుడు, అతని ప్రశ్నకు సమాధానం ఇవ్వడం ప్రజాస్వామ్యానికి బలం.
యువతకు కూడా బాధ్యత ఉంది
అయితే ప్రశ్నించే హక్కుతో పాటు బాధ్యత కూడా ఉంటుంది. నిర్ధారణ లేని సమాచారాన్ని ప్రచారం చేయకూడదు. వ్యక్తిగత ద్వేషాన్ని రాజకీయ విమర్శగా మార్చకూడదు. హింసకు మద్దతు ఇవ్వకుండా, చట్టబద్ధమైన మరియు శాంతియుత ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే అభిప్రాయాలను వ్యక్తం చేయాలి.అదే నిజమైన ప్రజాస్వామ్య సంస్కృతి.
"దిమాకి నక్సల్" అనే పదంపై జరుగుతున్న చర్చ మనకు ఒక పెద్ద ప్రశ్నను ముందుకు తెస్తోంది:
ప్రభుత్వాన్ని ప్రశ్నించే యువతను మనం శత్రువులుగా చూస్తామా? లేక ప్రజాస్వామ్య భాగస్వాములుగా చూస్తామా? ప్రశ్నించే ప్రతి యువకుడు నక్సల్ కాదు. ప్రభుత్వాన్ని విమర్శించే ప్రతి వ్యక్తి దేశద్రోహి కాదు.
అదే సమయంలో హింసను సమర్థించే వారిని కేవలం "విమర్శకులు" అని పిలవడం కూడా సరైంది కాదు. ప్రజాస్వామ్యానికి అవసరమైనది ముద్రలు కాదు చర్చ. భయపెట్టడం కాదు.సమాధానం. మౌనం కాదు ప్రశ్న.
అందుకే నేటి యువత ప్రశ్నిస్తుంది, చర్చిస్తుంది,భవిష్యతును కోరుకుంటుంది
"మమ్మల్ని దిమాకి నక్సల్స్, దేశాద్రుహులు, జాతీ వ్యతిరేకులు అంటూ ముద్ర వేయడానికి ముందు మా ప్రశ్నలకు సమాధానం చెప్పండి."



మాలోతు సాగర్
సెల్ : 7013805411

# పాలకుర్తి శతకోపకృతి




తరతరాలుగా వస్తున్న సంస్కృతి సంప్రదాయాలలో భాగంగా తెలుగువారికి వారసత్వంగా దక్కిన ప్రక్రియ, ఆస్తి పద్యం. వెయ్యేళ్లకు పైబడిన పద్యం అది కావ్యంగా పురాణంగా ప్రబంధంగా శతకంగా నాటకంగా ఉద్యమంగా అవధానంగా పలు పాయలలో పరవళ్ళు తొక్కుతూ నేటికీ పాఠకులను ప్రభావితం చేస్తుంది."పాతకాలం పద్యమైతే,వర్తమానం వచన గేయం"అని కుందుర్తి అన్నా నిత్యం ఎక్కడో ఒకచోట పద్యం ఒక కొత్త శతక రూపంలో ఆవిష్కరింపబడుతూనే ఉంది. నన్నయ్య నుండి సంప్రదాయబద్ధంగా వస్తున్న మార్గ కవితను కాదని తెలుగు నాట దేశి కవిత ప్రస్థానానికి ప్రారంభకుడైన పాల్కురికి సోమనాథుడు రచించిన "వృషాధిప శతక"మే తొలి ప్రామాణిక శతకంగా భావింపబడతోంది.
ఈ నేపథ్యంలో శతక ప్రక్రియను మూలాధారంగా చేసుకొని సుమారు పాతిక శతకాలను రచించిన కవి వరేణ్యులు, పద్య విద్యాధరుడు భీమరాజు పాండురంగారావు గారు.తేదీ 7.11.1953న సంప్రదాయ కుటుంబానికి చెందిన శ్రీమతి శేషమ్మ, అప్పారావు పుణ్య దంపతులకు ద్వితీయ సంతానంగా జన్మించిన పాండురంగారావు అద్వితీయమైన భక్తి రచనలతో ఆస్తిక లోకానికి అరుదైన కానుకలను అందిస్తున్నారు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లు పద్యాన్ని ప్రాణంగా భావించే పాండురంగారావు గారు బాలకవిగా రాణిస్తూనే 1967లో "శ్రీహరి శతకం"తో తమ కవితా రచనకు శ్రీకారం చుట్టారు. విద్యార్థి దశలో నోరి నరసింహమూర్తి, నారుమంచి నరసింహమూర్తి, లంకా సీతారామశాస్త్రి, శివునూరి విశ్వనాథ శర్మ, పరిశోధన పరమేశ్వరులు నిడదవోలు వెంకటరావు ప్రభృతుల ఆశీస్సులతో పలు రచనలు చేశారు. వృత్తి, ప్రవృత్తి అద్వైతంగా సాగినట్లుగా 1975నుంచి 2016 వరకు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిసరాలలో ప్రథమ శ్రేణి తెలుగు పండితులుగా పదవీ బాధ్యతలు నిర్వహించారు. ఈ కాలంలో ఆయన పద్యాలు రాస్తున్నా, వివిధ సందర్భాలలో వాటిని వేదికపై వినిపిస్తున్న అవి "ముద్రణ" భాగ్యానికి నోచుకోలేదు. పాండురంగారావు గారు కవితా హేతువులైన ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసములను పుష్కలంగా కలిగిన వారు. ప్రాచీన కావ్యాలను మథిశీ చినవారు. పద్య ప్రక్రియకు సంబంధించిన వివిధ ఛందస్సులపై ఆయనకు ఎంత పట్టు ఉన్నదో లాక్షణికుడిగా అంత పట్టు ఉన్నది. అందుకే ఆయన పదాలు, పద్యాలు ప్రౌఢ గంభీరంగా ఉంటాయి. ఇంతవరకు ఆయన రాసిన శతకాలలో శ్రీ వేంకటేశ శతకము, శ్రీ గోవింద నారాయణ ప్రభలు, లలితాంబికతో నామాటలు,
శ్రీ రామచంద్ర చతు: శతకములు, తాజాగా పాలకుర్తి శతకోపకృతి అన్నవి అచ్చు కాగా తొలిసారి రాసిన శ్రీహరి శతకముతో పాటు, ఇంకా 18 శతకాలు అచ్చు కావలసి ఉన్నాయి. సోమనాథుడు బసవావేశములో వర్ణనలు చేసినట్లుగా భక్త్యావేశంలో పాండురంగారావు గారు శతాధిక సంఖ్యలో పద్యాలు రాసినా తనివి తీరక వాటిని శతకంగానే పేర్కొన్నారు. తరువోజ ఛందం లో రాసిన శ్రీ వేంకటేశ శతకంలో 165 పద్యాలున్నాయి. దీనికి మహనీయులు శ్రీ నిడదవోలు వెంకటరావు గారు విస్తృతమైన పీఠిక రాశారు. కవి రాసింది భక్తి శతకమే అయినా అక్కడక్కడ సగటు మనిషి అనుభవిస్తున్న ఈతి బాధల్ని ప్రస్తావిస్తూ"అతి దరిద్రుం... శ్రీ వేంకటేశ" అనే పద్యంలో అధిక ధరలతో, అవహేళనలతో కృంగుతున్న మనిషిని సంరక్షించమని వేడుకొంటాడు. అలాగే శ్రీ గోవింద నారాయణ ప్రభలలో "వావి వరుసలు నీరయ్యే.. నారాయణ" అనే పద్యంలో మనిషికి ధన దాహం పట్ల గల వ్యామోహాన్ని ఈసడించారు. అలాగే భద్రాచలం, జీడికల్లు మొదలైన ప్రదేశాలలో ఉన్న రాములవారిని స్తుతిస్తూ"శ్రీరామ చతు: శతకములు" రాశారు. కవులు కల్యాణ కాముకులు కనుక వర్షాలు కురిసి పంటలు బాగా పండి ప్రజలందరి జీవితంలో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని"పంటలు పండగ.. భక్తిగ రామా"అని వేడుకొంటాడు.
పాలకుర్తిలో గుట్టపై హరిహరనాథ తత్వానికి ప్రతీకగా అన్నట్లు స్వయంభువులుగా వెలిసిన శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వాములను స్తుతిస్తూ"పాలకుర్తి శతకోపకృతిని" వెలువరించారు. ఇందులో మొదటి 154 పద్యాలు చంపక,ఉత్పలమాలలో ఉండగా మిగతా 116 పద్యాలు "సుగంధి"వృత్తంలో ఉన్నాయి. ఇది విశేష ఛశీదస్సు. తరువోజలోను, సుగంధి వృత్తంలోనూ శతకాలు రాసిన వాసి పాండురంగారావు గారికే దక్కుతుంది అనడంలో సందేహం లేదు. జగద్గురువులు ఆది శంకరాచార్య రచించిన కాలభైరవాష్టకమే తొలి సుగంధి రచన. ఆ తరువాత ప్రాచీన తెలుగు కవులైన అద్దంకి గంగాధరుడు, అయ్యల రాజు రామభద్రుడు, కూచిమంచి జగ్గకవి ప్రభృతులు వాడారు. ఇందులో ప్రతి పాదంలో ఏడు హగణములు చివరన ఒక గురువు ఉంటుంది. అంటే ప్రతి పాదంలో 15 అక్షరాలు. ఒకటవ అక్షరానికి 9 వ అక్షరానికి యతి మైత్రి చెల్లుతుంది. ప్రాస నియమం కలదు. ఇది గానయోగ్యమైనది.లోకంలో ఏదైనా సాధించాలంటే ముందుగా మనం చేసే పని పట్ల శ్రద్ధ అవసరమని చెబుతూ
"శ్రద్ధలేక కార్యమేది సాగబోదు ముందుకున్, శ్రద్ధ లేక జ్ఞాన పుష్ప సౌరభంబు రాదెటన్, శ్రద్ధ లేక గాథ సుస్థిరత్వభావముండ దా,
శ్రద్ధ లేకనుండబోదు శ్రద్ధ లక్ష్మియెప్పుడా
శ్రద్ధ లేమియుండరాడు స్కంద! విష్ణు! శంకరా"అని ప్రబోధిస్తారు. ఈ శతకంలో వారు ప్రయోగించిన పాలడెందము, పున్నెపు తావులు, కేకిసలు వంటి పద ప్రయోగాలు పాఠకులను అలరిస్తాయి. ఇలా మృదు మధురంగా,స్నిగ్ధ సుందరంగా, భక్తి భావ బంధురంగా రాసిన ఈ శతకాలు అద్వైత సిద్ధికి అక్షరోపాయనం. అభినందనలు.



డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్
99 891 48 305

# లక్ష గొంతులతో ఢిల్లీకి పోలికేక చేరాలి



**సూర్యాపేట (జనంసాక్షి):** సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించుకోవాలంటూ ఈనెల 27న నిర్వహించ తలపెట్టిన లక్ష గొంతుకల పోలి కేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బుల్లెట్ ట్రైన్ సాధన అఖిలపక్ష పోరాట కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ ఆరుట్ల జానికిరెడ్డి కోరారు.ఆదివారం బుల్లెట్ ట్రైన్ దీక్షా శిబిరం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో అఖిలపక్షాల ఆధ్వర్యంలోపోలికేక కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.కేంద్రం ఇచ్చిన బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ ను అవసరం లేని చోటకు మార్చి జాతీయ రహదారి65 వెంట ఉన్న పట్టణాలకు తీవ్ర నష్టం కలిగిస్తున్న పాలకులను నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. గత నెల రోజులుగా కొనసాగుతున్న ఈ ఉద్యమాలలో ప్రజలు ఉద్యమ సంఘాలు నిర్విరామంగా ఏదో ఒక కార్యక్రమం చేస్తూ ప్రభుత్వం దృష్టికి వెళ్లేలా ఉద్యమం కొనసాగుతుందన్నారు.

ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఈనెల 27న జిల్లాలో లక్ష గొంతుకలతో పోలికేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అఖిలపక్షాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ కార్యక్రమాన్ని అన్ని వర్గాల ప్రజలు పార్టీలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షాల నాయకులు పెద్దిరెడ్డి రాజా, నిమ్మల శ్రీనివాస్ గౌడ్, చల్లమల్ల నరసింహ, మట్టిపల్లి సైదులు, పేర్ల నాగయ్య, పెద్దిరెడ్డి కళ్యాణ్ చక్రవర్తి, జర్నలిస్టులు వజ్జె వీరయ్య, హెడ్వర్డ్,ముప్పాని కృష్ణారెడ్డి, వనిత, నేరెళ్ల మధు, చెరుకు లక్ష్మి, భాస్కరమ్మ, రేపాక లింగయ్య, కిరణ్, తన్నీరు వాసు తదితరులు పాల్గొన్నారు.ఆదివారం రిలే నిరాహార దీక్షలో అడితీ కమిషన్ వ్యాపారులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులపై దాడి

### నిందితుడిపై చర్యలు తీసుకోవాలి

**రాజేంద్రనగర్,ఆగస్టు23(జనంసాక్షి) :** మైలార్‌దేవ్‌పల్లి: పద్మశాలిపురంలో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులపై దాడి చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మున్సిపల్ స్టాఫ్, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి కోరారు. దాడికి గురైన కార్మికులు కృష్ణ, అలువేలమ్మ, వెంకటమ్మ, యాదమ్మలను మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. కార్మికులపై దాడులు చేయడం సరికాదని, సమస్యలుంటే మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయాలని జైపాల్ రెడ్డి అన్నారు. నిందితుడిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్లు జాషువా, మహేందర్, సంగీత, రాజుతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

# డీసీసీ అధ్యక్షుడి ఎంపికకు సంఘటన్ సృజన్ అభియాన్



**రాజేంద్రనగర్,ఆగస్టు23(జనంసాక్షి) :** డీసీసీ నూతన అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియలో భాగంగా ఏఐసీసీ సూచనల మేరకు సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అబ్జర్వర్, కర్ణాటక ఎమ్మెల్సీ, ఏఐసీసీ కార్యదర్శి పి.వి. మోహన్ తెలిపారు. శంషాబాద్ మండలం తొండుపల్లిలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ స్థాయి సంస్థాగత సంప్రదింపుల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా పి.వి. మోహన్ మాట్లాడుతూ.. బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే సంఘటన్ సృజన్ అభియాన్ లక్ష్యమన్నారు. డీసీసీ నూతన అధ్యక్షుడి ఎంపికలో క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలకు పూర్తి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అందరినీ కలుపుకుని పార్టీని ముందుకు నడిపించే నాయకత్వాన్ని పారదర్శకంగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.ఈ సమావేశంలో టీపీసీసీ అబ్జర్వర్లు, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.డీసీసీ అధ్యక్ష పదవి కోసం పోటీలో ఉన్న ఎన్. ధనుంజయ్, జి. శేఖర్ యాదవ్, కృష్ణారెడ్డి, సంజయ్ యాదవ్, జలపల్లి నరేందర్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైలారం సులోచన, డివిజన్ అధ్యక్షులు దూడల వెంకటేష్ గౌడ్, సామా ఇంద్రపాల్ రెడ్డి, సి. మహేందర్ ముదిరాజ్, బొబ్బిలి శేఖర్ ముదిరాజ్, ప్రేమ్ గౌడ్, పి. శ్రీధర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మహమ్మద్ గౌస్, మహమ్మద్ షౌకత్, నరేందర్, మెరుగు జితేందర్, దుర్గేష్ యాదవ్, కోటేష్ గౌడ్, రవి నాయక్, రాము నాయక్, మహమ్మద్ ఖలీల్, చందు తదితరులు సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలు, పార్టీ అభివృద్ధికి సంబంధించిన సూచనలు తెలియజేశారు. అలాగే రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంజయ్య నగర్లో హైడ్రా – సిఎంసి జాయింట్ ఆపరేషన్

### కూలే ప్రమాదం ఉన్న భవనం కూల్చివేత

### పక్కనున్న భవనాలకు ముప్పు లేకుండా జాగ్రత్తగా తొలగింపు చర్యలు





**శేరిలింగంపల్లి, ఆగస్టు 23 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి మాదాపూర్ సర్కిల్ పరిధిలోని అంజయ్య నగర్ లో శనివారం ఏడంతస్తుల భవనం కూలిన ఘటనతో అప్రమత్తమైన శేరిలింగంపల్లి మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) అధికారులు ఆదివారం ఘటన స్థలాన్ని పరిశీలించి స్థానికంగా కూలడానికి అనుమానాస్పదంగా కనిపించిన ఓ భవనాన్ని కూల్చి వేయడం జరిగింది. సాధ్యమైనంత వరకు అంజయ్య నగర్ లో శనివారం ఘటన పునరావృతం కాకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలకు పూనుకోవడంలో భాగంగానే ఆదివారం అనుమానాస్పద భవనాన్ని తొలగించినట్లు వివరించారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి పరిధి ఆంజనేయనగర్ లో సిఎంసి – హైడ్రా సంయుక్తంగా ఆపరేషన్ ను ప్రారంభించడం జరిగింది. అంజయ్య నగర్ లో 7 అంతస్థుల భవనం హఠాత్తుగా కూలిపోయిన దరిమిలా భవనం కూలినప్పుడు పక్కన ఉన్న మరో 7 అంతస్థుల భవనంకూడా బాగా దెబ్బతిని భవనం కూలిపోయే ప్రమాదం ఉండడంతో దాన్ని హైడ్రా – సిఎంసి అధికారులు కలిసి దానిని తొలగించే కార్యక్రమానికి పూనుకోవడం గమనార్హం. ఆదివారం తొలగించిన నిర్మాణానికి సైతం ఎలాంటి అనుమతులు లేవని, భవిష్యత్తులో దానివల్ల కూడా పెనుముప్పు పొంచి ఉందని మీడియాకు వివరించారు. ఈ మేరకు సిఎంసి అధికారులు హైడ్రాధికారులకు వివరణాత్మక ఫిర్యాదును అందించగా హైడ్రా ఆదివారం చర్యలు ప్రారంభించింది. ఏమాత్రం భవనాలమధ్య గ్యాప్ లేకపోవడంతో జాగ్రత్తగా భవనం తొలగింపు పనులను చేపడుతోంది. భవనంవైపు ప్రజలు రాకుండా పోలీసులు బందోబస్తు చర్యలు తీసుకోవడం జరిగింది. ఆదివారం తొలగిస్తున్న భవనం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున స్టెర్లింగ్ వైట్ ఫీల్డ్ అపార్ట్మెంట్ నివాసితులను ఖాళీ చేయించారు. అక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా వరుస పేక మేడలులా 50 గజల్లో 7 అంతస్తులవరకు నిర్మించిన భవనాలు ప్రమాదకరంగా పరిణమిస్తున్నందున ఎలాంటి అలసత్వానికి తావు లేకుండా ప్రమాదం అంచున నిలిచిన భవనాలను పూర్తిగా నేలమట్టం చేసి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు తావు లేకుండా, మరో మనిషి ప్రాణం పోకుండా తాము గట్టి చర్యలకు దిగబోతున్నామని, అక్రమ నిర్మాణాలలో ఉన్న వారంతా సహకరిస్తే బావుంటుందని అధికారులు స్పష్టం చేశారు.

# దళితుల హక్కులు, ఆత్మగౌరవం, అభివృద్ధి కోసం ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలి

### సామాజిక సమర సత్తా మాజీ అధ్యక్షులు టీఎన్ వంశ తిలక్




**కొడంగల్, ఆగస్టు 23 (జనం సాక్షి):** దళిత క్రైస్తవులకు బీసీ–సీ సర్టిఫికెట్లు జారీ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సామాజిక సమర సత్తా మాజీ అధ్యక్షులు టీఎన్ వంశ తిలక్ అన్నారు. కొడంగల్ పట్టణ కేంద్రంలో అంబేద్కర్ కూడలిలో ముందుగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సామాజిక సమర సత్తా మాజీ అధ్యక్షులు టీఎన్ వంశ తిలక్,అది హిందూ దళిత మహాసభ అధ్యక్షులు రామన్న మాట్లాడుతూ దళితుల హక్కులు, ఆత్మగౌరవం, అభివృద్ధి కోసం ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం ఎస్సీ రిజర్వేషన్లకు సంబంధించిన నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు.

మతం మారిన దళిత క్రైస్తవులకు బీసీ–సీ సర్టిఫికెట్లు జారీ చేయాలని, తరతరాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న దళిత హిందువులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మార్చి 24, 2026న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యారంగానికి మహర్దశ

### రూ.100 కోట్లతో రెండు నూతన పాఠశాలలు, భవనాల ఆధునీకరణ, అదనపు తరగతి గదులు

### ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు ఉచిత విద్య : పటాన్చెరు శాసన సభ్యులు మహిపాల్ రెడ్డి



**అమీన్పూర్, ఆగస్టు 23 (జనం సాక్షి) :** అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ, అమీన్పూర్ డివిజన్లలో గల పేద మధ్యతరగతి విద్యార్థులకు అతి త్వరలో అత్యధిక వసతులతో కూడిన క్యూర్ అర్బన్ రీజియన్ పాఠశాలలు అందుబాటులోకి రానున్నాయని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. రూ.100 కోట్ల అంచనా వ్యయంతో అమీన్పూర్ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం, నవ్య రోడ్డులో నూతన పాఠశాలలకు, కిష్టారెడ్డిపేటలో ఉన్నత పాఠశాల నవీనీకరణ పనులకు ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం క్యూర్ అర్బన్ రీజియన్ (జఖ=జు) పరిధిలో ఆధునిక వసతులతో క్యూర్ అర్బన్ స్కూల్స్ నిర్మిస్తోందని తెలిపారు. వీటి నిర్మాణం ద్వారా ఒకే ప్రాంగణంలో ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందించడానికి సాధ్యమవుతుందని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా ఆటస్థలాలు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, అత్యాధునిక ల్యాబ్‌లు, లైబ్రరీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అతి త్వరలో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయబోతున్నట్లు తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నూతన పాఠశాలలు ఎంతగానో ఉపకరిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నిర్దేశిత గడువులోగా నిర్మాణ పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొని వస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ సర్పంచ్ కృష్ణ, ు+జుఔణ×జ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి సుధాకర్, సీనియర్ నాయకులు గోపాల్, కృష్ణ, జగదీష్, సునీత, శ్రీనివాస్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# బతుకుతెరువు కోసమొచ్చి.. పాము కాటుకు బలి



**పెద్దేముల్,ఆగస్టు 23 (జనంసాక్షి) :** బతుకుతెరువు కోసం వలస వచ్చిన ఓ పేద మహిళ పాము కాటుకు బలైన విషాద ఘటన పెద్దేముల్ మండలం జనగం గ్రామ సమీపంలో వ్యవసాయ క్షేత్రంలో చోటుచేసుకుంది. బ్రతుకుతెరువు కోసం రంగారెడ్డి జిల్లా,కొందుర్గు మండలం, గుర్రంపల్లి గ్రామానికి చెందిన నర్సమ్మ (25), భర్త ఆంజనేయులు దంపతులు జనగాం గ్రామంలోని ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారి మైనుద్దీన్ దగ్గర పనిచేస్తుండేవారు. భార్యాభర్తలిద్దరూ అక్కడే ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.నిద్రలోనే పాము కాటు రోజూ మాదిరిగానే పనులు ముగించుకుని నిద్రిస్తున్న సమయంలో నర్సమ్మను విషసర్పం కాటు వేసింది తీవ్ర విషం ఎక్కడంతో కుటుంబ సభ్యులు తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు,అక్కడ ప్రథమ చికిత్స అనంతరం నర్సమ్మ, కండిషన్ సీరియస్ ఉన్నందువల్ల హైదరాబాద్ రిఫర్ చేయగా మనసులో హైదరాబాద్ కు తీసుకు వెళుతుండగా ధరూర్ సమీపంలో మృతి చెందినట్లుతెలిసింది. మృతురాలు నర్సమ్మకు ఇద్దరు పిల్లలు కాగా, పాప (3) సంవత్సరాలు.బాబు 1 సంవత్సరం,చిన్న వయసులోనే తల్లిని కోల్పోవడంతో పిల్లలు అనాథలయ్యారు, భర్తకన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు. పేద కుటుంబం కావడంతో ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందించి, ఇద్దరు పిల్లల భవిష్యత్తుకు అండగా నిలవాలని గ్రామస్తులు, బంధువులు కోరుతున్నారు.

# ప్రభుత్వ బడిలో చదువు.. గిన్నిస్ రికార్డు వరకు..

### ఖాకీ డ్రెస్సులోనూ సాహసాల వీరుడు

### కామారెడ్డి జిల్లా బిడ్డ, సైబరాబాద్ స్పెషల్ బ్రాంచ్ సీఐ ఎం. మహేష్ సాహస ప్రస్థానం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 23 (జనం సాక్షి)**

కష్టాలు ఎదురైనా పట్టుదల, క్రమశిక్షణ, సాధించాలనే సంకల్పం ఉంటే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని సైబరాబాద్ స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఎం. మహేష్ నిరూపించారు. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన ఆయన ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ కళాశాలలోనే విద్యాభ్యాసం పూర్తి చేసి 2004లో ఎస్సైగా పోలీస్ శాఖలో అడుగుపెట్టారు. విధి నిర్వహణలో ప్రతిభ, అంకితభావంతో పనిచేస్తూ సీఐగా పదోన్నతి పొంది ప్రస్తుతం సైబరాబాద్ స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పోలీసు విధుల్లో నిత్యం ఒత్తిడి, సవాళ్లు ఎదురైనా తనలోని సాహస భావనను కూడా కొనసాగిస్తున్న మహేష్ తాజాగా మోటార్‌సైకిల్‌పై హిమాలయాలను అధిరోహించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించారు. మనాలీ నుంచి ప్రారంభమైన ఆయన సాహస యాత్ర ఏడు రోజుల పాటు కొనసాగింది. ఈ ప్రయాణంలో లడఖ్ ప్రాంతంలో సుమారు 2,100 కిలోమీటర్లు మోటార్‌సైకిల్‌పై ప్రయాణించారు. ఈ సాహస యాత్రలో భాగంగా ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మోటార్ రహదారుల్లో ఒకటైన ఉమ్లింగ్ లాను మహేష్ అధిరోహించారు. సుమారు 19,024 అడుగులకుపైగా ఎత్తులో ఉన్న ఈ ప్రాంతంలో తీవ్రమైన చలి, శీతల గాలులు, ప్రమాదకరమైన రహదారులు, ఎత్తైన పర్వతాలు, ఉప్పొంగే నదులు వంటి ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ఆయన ముందుకు సాగారు. పాంగాంగ్ త్సే ప్రాంతానికి చేరుకున్న అనంతరం చాంగ్థాంగ్‌లోని 1962 ఇండో–చైనా యుద్ధ స్మారక చిహ్నాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.




**యువతకు స్ఫూర్తిగా మహేష్ ప్రయాణం**

ప్రభుత్వ పాఠశాలలో చదివి పోలీసు అధికారిగా ఎదగడమే కాకుండా, సాహస క్రీడల్లోనూ తన ప్రతిభను చాటుతూ గిన్నిస్ రికార్డు సాధించడం మహేష్ ప్రత్యేకతగా నిలిచింది. ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు కృషి చేస్తే ఎలాంటి రంగంలోనైనా విజయాన్ని అందుకోవచ్చని ఆయన ప్రస్థానం చాటిచెబుతోంది. సాహస యాత్రను విజయవంతంగా పూర్తి చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన మహేష్‌ను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ అభినందించారు. ఆయన విజయంపై కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. కామారెడ్డి జిల్లా నుంచి ఎదిగి జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందిన మహేష్ సాహస ప్రస్థానం యువతకు ఆదర్శంగా నిలుస్తోంది.

# కరీంనగర్ జిల్లాలో 24న ఆటోల బంద్

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 23 ( జనం సాక్షి)**



ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24వ తేదీ సోమవారం కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఆటోల బంద్ నిర్వహించనున్నట్లు కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రాంనగర్‌లోని యూనియన్ కార్యాలయంలో బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన రూ.12 వేల ఆర్థిక సహాయాన్ని వెంటనే అందించాలని, ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఎలక్ట్రిక్ ఆటోలను రద్దు చేయాలని, రాపిడో, ఓలా, ఉబర్‌లో ద్విచక్ర వాహనాల సేవలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, గతంలో మాదిరిగానే ఆటో లైసెన్సులు ఇవ్వాలని కోరారు.తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న బంద్‌లో భాగంగా కరీంనగర్ జిల్లా ఆటో డ్రైవర్లు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారని, తమ డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బంద్‌ను విజయవంతం చేయడానికి మండల, గ్రామ, ఆటో స్టాండ్ నాయకులు బాధ్యత తీసుకోవాలని కోరారు. ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో చెలుమల్ల రామచంద్రం, బండారి సంపత్ పటేల్, కొత్తూరి సత్యనారాయణ, ఇరవేణి కుమార్, కుకట్ల సంపత్, చిట్టిమల్ల నాగభూషణం, వడ్లకొండ శ్రీనివాస్ గౌడ్, వాల్క రమేష్, మీర్జా అఫ్జల్ బేగ్, మారం సంపత్, మహమ్మద్ యాకూబ్, కూర్మాచలం వేణుమాధవ్, బొంగోని శ్రీనివాస్ గౌడ్, అంతగిరి సంపత్, సజ్జన రమేష్, చిర్ర సంపత్, మహమ్మద్ సలీం తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ బకాయిల వసూళ్లకు వెళ్లిన సిబ్బందిపై దురుసు ప్రవర్తన

**బోరబండ (జనంసాక్షి) :** విద్యుత్ బకాయిల వసూళ్లకు వెళ్లిన విద్యుత్ శాఖ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించి, దుర్భాషలాడి, తోసేసిన ఘటన బోరబండలో పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఎర్రగడ్డకు చెందిన అసిస్టెంట్ ఇంజినీర్ ఆపరేటర్ ఉమ్మర్జీ తబ్రేజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. నేటిజ్ నగర్‌కు చెందిన మహ్మద్ హైదర్ ఇంటి విద్యుత్ మీటర్ నంబర్ గ్గా057380లో గతంలో విద్యుత్ మీటర్ ట్యాంపరింగ్ జరిగినట్లు విజిలెన్స్ కేసు నమోదైంది. ఈ కేసులో రూ.11,171 జరిమానా విధించగా, హైదరాబాద్ 19-07-2025న రూ.1,982 చెల్లించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంకా సుమారు రూ.9,000 బకాయి ఉన్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 22న మధ్యాహ్నం సుమారు 2.30 నుంచి 3 గంటల మధ్య ఉమ్మర్జీ తబ్రేజ్, సిబ్బంది శేఖర్ మహ్మద్ పాషాతో కలిసి బకాయి మొత్తాన్ని వసూలు చేసేందుకు హైదరాబాద్ ఇంటికి వెళ్లారు. బకాయి చెల్లించకపోతే విద్యుత్ కనెక్షన్‌ను తొలగిస్తామని సిబ్బంది చెప్పడంతో హైదర్ వారిని అసభ్య పదజాలంతో దూషించి, ఫిర్యాదుదారుడిని తోసివేసినట్లు ఆరోపించారు. ఈ ఘటనపై ఉమ్మర్జీ తబ్రేజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు పలువురి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# ప్రభుత్వ బడి పిల్లల సత్తా

### తాండూర్ కబడ్డీ ఛాంపియన్ పెద్దేముల్ లయన్స్ కైవశం



**పెద్దేముల్, ఆగస్టు 23 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. తాండూర్ హిందూ ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో అక్షర కాన్సెప్ట్ స్కూల్ గ్రౌండ్ లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీల్లో పెద్దేముల్ లయన్స్ జట్టు ఛాంపియన్‌గా నిలిచి తమ ప్రతిభను నిరూపించుకుంది.నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ఈ పోటీలను నిర్వహించగా, శ్రీ సాయిపుత్ర హోమ్స్ అధినేత బావనోళ్ల శంకర్ యాదవ్,టైటిల్ స్పాన్సర్ గా వ్యవహరించారు. ఫైనల్ లో హోరాహోరీగా జరిగిన పోరులో పెద్దేముల్ లయన్స్ విజేతగా, కోట్ పల్లి కింగ్స్ రన్నరప్ గా నిలిచారు.విజేతలకు టైటిల్ స్పాన్సర్ శంకర్ యాదవ్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పెద్దేముల్ లయన్స్ టీం స్పాన్సర్, గౌతమి మోడల్ స్కూల్ కరస్పాండెంట్ పి.మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో చదివే ప్రతిభ కల్గిన క్రీడాకారులకు తమ ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఛాంపియన్ గా నిలిచిన పెద్దేముల్ లయన్స్ క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో ధార్మిక పరిషత్ సభ్యులు విజయ్ కుమార్, వేణుగోపాల్ రెడ్డి, ఓం ప్రకాష్ సోమని, కబడ్డీ టీం స్పాన్సర్స్ అజయ్ ప్రసాద్ బషీరాబాద్, మనోహర్ తాండూర్ మండలం, డాక్టర్ శరత్ చంద్ర యాలాల్,రాములు.కోట్ పల్లి, కిషన్ రాఠి, మార్వాడీ యువ మంచ్ నాయకులు, రాజ్ కుమార్ బీసీ సంఘం, పీఈటీలు రాధాకృష్ణ, గోపాల్, అంపైర్స్ రాము, రవి, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# 50 ఏళ్ల నివాస ధ్రువీకరణ ఉంది

**బండలగూడ రైల్వే బాధితుల ఆధారాలు ఎంపీకి అందజేసిన మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్**



**రామచంద్రాపురం, ఆగస్టు 23(జనం సాక్షి)** బండలగూడలో 50 ఏళ్లుగా నివాసం ఉంటున్న తమకు రైల్వేశాఖ ఇటీవల జారీ చేసిన నోటీసులతో తీవ్ర ఆందోళన నెలకొందని బాధితులు వాపోతున్నారు. తరతరాలుగా నివాసముంటున్న తమ ఇళ్లను కాపాడుకునేందుకు మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్ ఆధ్వర్యంలో బాధితులు పోరాటం కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావును ఆదివారం మరోసారి కలిసి బాధితుల సమస్యను వివరించిన మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్. మాట్లాడుతూ రైల్వే అధికారులకు గత 50 ఏళ్లుగా ఇక్కడే నివాస ధ్రువీకరణ ఉన్నట్లు తెలిపే ఆధారాలను ఎంపీకి అందజేశారు. ఇళ్లకు సంబంధించిన పన్ను రసీదులు, దశాబ్దాలుగా అక్కడే నివాసం ఉంటున్నట్లు నిరూపించే పత్రాలను సమర్పించారు. రైల్వేశాఖ నుంచి నోటీసులు అందుకున్న వారంతా సుమారు 50 ఏళ్లుగా అక్కడే నివాసం ఉంటున్నారని, వారి ఇళ్లను తొలగించకుండా రైల్వేశాఖ ఉన్నతాధికారులతో చర్చించి న్యాయం చేయాలని ఎంపీ రఘునందన్ రావును యాదగిరియాదవ్ కోరారు. బాధితుల ఇళ్లను కాపాడేందుకు తనవంతు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, విక్రమ్, శ్రీరాములు, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

# చిప్పదొడ్డి గ్రామస్తుల చీకటి తిప్పలు

## మల్లెందొడ్డి సబ్ స్టేషన్ కరెంటుతో ఇబ్బందులు

**మల్దకల్, ఆగస్టు 23 (జనంసాక్షి) :** మండల పరిధిలోని మల్లెందొడ్డి విద్యుత్తు సబ్ స్టేషన్ నుండి చిప్పదొడ్డి గ్రామానికి సరఫరా అవుతున్న విద్యుత్తు గ్రామస్తులకు సక్రమంగా అందడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.ఉదయం 5 గంటలకు కరెంటు వచ్చి త్రీ ఫేసులో మళ్లీ మధ్యలో గంటలు గంటలు కరెంటు పోవడం వల్ల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామస్తులు ఫోన్ చేస్తే ట్రిప్ అవుతుందని విద్యుత్ ఆపరేటర్లు చెప్తున్నారు. ఏఈ కి విన్నవించిన పట్టించుకోవడంలేదని మా గ్రామానికి ఐజ నుండి విద్యుత్తు కలపాలని ఎన్నిసార్లు కోరిన ఏఈ, లైన్మెన్ గాని పట్టించుకోవడం లేదు. శివారుగ్రామాల గురించి పట్టించుకోవడంలేదని, మల్లెందొడ్డి కరెంటు ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు కోరగా వెంటనే మా గ్రామానికి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# చేనేత సొసైటీలో అక్రమ లావాదేవీలు

## సెప్టెంబర్ 9న కలెక్టరేట్ ముందు మహాధర్నా

### అఖిలపక్ష నాయకుల పిలుపు

**నారాయణపేట జిల్లా బ్యూరో, ఆగస్టు23 (జనంసాక్షి) :** జిల్లా కేంద్రంలోని చేనేత సొసైటీలలో 51 కోట్ల అక్రమ లావాదేవిలు జరిగాయని, అవినీతికి పాల్పడుతున్నారని ఆదివారం అంబేద్కర్ కళాభవన్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహించి అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ నారాయణపేట జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదుచేసిన పట్టించుకోకపోవడం ఏమిటని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు ఓం ప్రకాష్, బహుజన సమాజ్వాది పార్టీ జిల్లా అధ్యక్షులు బొదిగల శ్రీనివాసులు, తెలంగాణ రాష్ట్ర రక్షణ సేన (టిఆర్ఎస్) జిల్లా అధ్యక్షులు గవినోల శ్రీనివాస్ సిఐటియు జిల్లా కార్యదర్శి బలరాం ,రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షులు కృష్ణ మడివాల్ చేనేత కార్మిక సంఘం సీనియర్ నాయకులు కెంచి నారాయణ డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో అఖిల పక్ష నాయకులు కార్మిక సంఘాల నాయకులు.చేనేత కార్మికుల సమస్యలపై సెప్టెంబర్ 9న జిల్లా కలెక్టరేట్ ముందు మహాధర్నా చేయబోతున్నట్లు తెలిపారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్యం నిరసిస్తూ సొసైటీ పెద్దల అక్రమ లావాదేవీలపైన విచారణ చేయాలని కోరుతూ ఈ ధర్నా జరగబోతుందని తెలిపారు. అర్హులైన చేనేత కార్మికులకు సొసైటీలలో సభ్యత్వం ఇవ్వాలని ఎన్నిసార్లు విన్నవించుకున్న సొసైటీని నడిపిస్తున్న అధ్యక్ష కార్యదర్శులు పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సొసైటీ లావాదేవీలను తమ వ్యక్తిగతప్రయోజనాలకు వాడుకుంటున్న అధ్యక్ష కార్యదర్శులను సొసైటీ సభ్యత్వాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. నేతన్న బీమా యోజన కింద ప్రభుత్వం అందజేస్తున్న ఐదు లక్షల రూపాయలు దళారీల చేతిలో పడుతున్నాయని ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా జీవనం కొనసాగిస్తున్న గాంధీనగర్ చేనేత కార్మికుల ఇళ్లకు యజమాన్యపు పట్టాలు కల్పించాలన్నారు. 1961 సంవత్సరంలో గాంధీనగర్ సొసైటీ ఆధ్వర్యంలో 100 మంది చేనేత కార్మికులకు 444 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు అందజేసి ఇల్లు నిర్మించి ఇచ్చారన్నారు. అయితే కార్మికులకు ఇంటి యజమాన్యపు హక్కులు కల్పించకపోవడం వలన సొంత ఇంటిలోనే పరాయివారిలా జీవించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికుల సమస్యలపై కలెక్టర్ కి విన్నవించిన పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు అందుకే అఖిలపక్షం పార్టీల ఆధ్వర్యంలో వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9న కలెక్టరేట్ ముందు ధర్నాకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా నాయకులు గుడ్సే నర్సింహ, తెలుగుదేశం పార్టీ నాయకులు రాఘవ నాయుడు, సిపిఎం నారాయణపేట పట్టణ నాయకులు సోఫీ బజార్ హుస్సేన్, బహుజన సమాజ్వాది పార్టీ నాయకులు అశోక్,గౌతమ్ శివ ,అజయ్ ,చేనేత కార్మిక సంఘం మరియు కాంగ్రెస్ సీనియర్ నాయకులు హాజీ తుల్జారం,చేనేత కార్మిక సంఘం పట్టణ నాయకులు యాబన్న చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కేంద్రాల్లోనే.. 90 శాతం వైద్య చికిత్సలు



ప్రజారోగ్య వ్యవస్థలను బలోపేతం చేస్తున్నాం : మంత్రి దామోదర్ రాజనర్సింహ

**నారాయణఖేడ్, ఆగస్టు 23: (జనం సాక్షి)** జిల్లా స్థాయిలోనే 90 శాతం వైద్య చికిత్సలకు అవసరమైన సేవలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రజారోగ్య వ్యవస్థలను బలోపేతం చేస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఆదివారం నారాయణఖేడ్ పట్టణంలో ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన బాలాజీ అనురాధ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డితో కలిసి మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి, అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నారాయణఖేడ్ ప్రాంత ప్రజల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేసిన నిర్వాహకులను మంత్రి అభినందించారు. తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు సమీపంలోనే అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. జిల్లా స్థాయిలోనే అధిక శాతం వైద్య చికిత్సలు అందేలా ప్రజారోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కార్, ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ పట్లోళ్ల అనురాగ్ రెడ్డి, డాక్టర్ కే. శ్రీధర్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



# విద్యార్థుల విజ్ఞాన, విహార యాత్ర విజయవంతం



**గద్వాల నడిగడ్డ,ఆగస్టు 23(జనంసాక్షి) :** ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల మేధో వికాసానికి నిర్వహించిన విజ్ఞాన, విహార యాత్రలు విజయవంతం చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రతి మండలం నుంచి పీఎం శ్రీ పాఠశాలలతో పాటు భవిత కేంద్రాలలో ఉండేటటువంటి 65 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు, 30 మంది ఐఈఆర్పీలు, స్పెషల్ ఎడ్యుకేటర్లు,11 మంది తల్లిదండ్రులతో ఈనెల 20, 21వ తేదీల్లో రెండు రోజులపాటు వరంగల్, హైదరాబాద్ విహార యాత్ర కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహించమన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర రోడ్ రవాణా సంస్థ వారి రెండు బస్సులతో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కోసం నిర్వహించిన రెండు రోజుల యాత్రలో పలు దర్శనీయ స్థలాల్లో పర్యటించా రన్నారు. హైదరాబాదులోని నెహ్రూ జువాలజికల్ పార్క్, సాలార్జంగ్ మ్యూజియం, లుంబినీ పార్క్ లను సందర్శించారు. అనంతరం వరంగల్‌లోని భద్రకాళి ఆలయం, వెయ్యి స్తంభాల గుడి, వరంగల్ కోటలను సందర్శించి చారిత్రక, సాంస్కృతిక అంశాలను విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకున్నారన్నారు. నెహ్రూ జువాలజికల్ పార్క్‌లో వివిధ జంతువులు, పక్షుల గురించి తెలుసుకున్న విద్యార్థులు, సాలార్జంగ్ మ్యూజియంలో చారిత్రక వస్తువులు, కళాఖండాలను వీక్షించారనీ తెలిపారు. లుంబినీ పార్క్‌లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించినట్లు పేర్కొన్నారు.

వరంగల్ పర్యటనలో కాకతీయుల చరిత్ర, శిల్పకళ, వారసత్వ కట్టడాలను ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం విద్యార్థులకు లభించిందన్నారు. ఈ పర్యటన ద్వారా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల్లో ప్రత్యక్ష అనుభవం ద్వారా అభ్యసనం, సామాజిక అవగాహన, ఆత్మవిశ్వాసం, స్వతంత్రత, చారిత్రక, సాంస్కృతిక పరిజ్ఞానం పెంపొందించేందుకు అవకాశం కలిగిందన్నారు. ప్రత్యక్ష అనుభవమే ఉత్తమ అభ్యసనం ,ప్రతి ప్రత్యేక అవసరాలు గల విద్యార్థికి సమాన అవకాశమే సమగ్ర విద్య లక్ష్యం అనే సందేశంతో ఈ విద్యా విహారయాత్రను విజయవంతం చేశామని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.



# శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు

## ఎంపి డీకే అరుణ

**గద్వాల, ఆగస్టు 22 (జనంసాక్షి) :**

గద్వాల పట్టణంలోని నల్లకుంటలో నూతనంగా నిర్మించిన శ్రీ భ్రమరాంభిక మల్లికార్జున స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ పాల్గొన్నారు.ఆలయానికి విచ్చేసిన ఎంపీకి ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ "ఆలయ పెద్దల కృషి, దాతల సహకారంతో ఆలయాన్ని అద్భుతంగా నిర్మించారు. ఆలయ పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ప్రజలందరికీ, శివ భక్తులకు శుభాకాంక్షలు. సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలని భ్రమరాంభికా మల్లికార్జున స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకుంటున్నానని, మన సంస్కృతి, ధర్మాన్ని పాటిస్తూ పూజలు చేయడం మన సంస్కారం. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదని, ఆ పరమశివుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని,ఆలయ ప్రాంగణాన్ని ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పూజలకు ఉపయోగించే పూలు, పత్రి మొక్కలను ఆలయ ఆవరణలోనే నాటి, ఆహ్లాదకర వాతావరణంలో నిత్యం పూజలు జరిగేలా చూడాలి" అని అన్నారు.

# సీపీఆర్ నేర్చుకోండి.. ప్రాణదాతలుగా మారండి

**అత్యవసర వేళల్లో తక్షణ స్పందనే ప్రాణరక్షణకు కీలకం : జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు**



**మెదక్ బ్యూరో, ఆగస్టు 23వ (జనంసాక్షి) :** అత్యవసర పరిస్థితుల్లో ఒక్క క్షణం ఆలస్యం కూడా ప్రాణాపాయానికి దారి తీయవచ్చని, ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది గుండె–ఊపిరితిత్తుల పునరుద్ధరణపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు. శిక్షణలో నేర్చుకున్న ప్రాణరక్షణ పద్ధతులను అవసరమైన సమయంలో సమర్థంగా అమలు చేసి విలువైన ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు అధికారులు, సిబ్బందికి గుండె ఊపిరితిత్తుల పునరుద్ధరణపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు అత్యవసర పరిస్థితుల్లో బాధితుడి పరిస్థితిని ఎలా గుర్తించాలి, ఎప్పుడు ప్రాణరక్షణ చర్యలు చేపట్టాలి, ఎలా స్పందించాలి అనే అంశాలను ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా వివరించారు. ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు, ఆకస్మికంగా స్పృహ కోల్పోవడం, గుండె ఆగిపోవడం వంటి అత్యవసర ఘటనల్లో సంఘటనా స్థలానికి ముందుగా చేరుకునే వారిలో పోలీసులు కూడా ఉంటారని చెప్పారు. అందువల్ల పోలీసు సిబ్బందికి ప్రాథమిక ప్రాణరక్షణ చర్యలపై అవగాహన ఎంతో అవసరమన్నారు.

**ఆస్పత్రికి చేరేలోపు కీలక సమయం**

వ్యక్తి అకస్మాత్తుగా స్పృహ కోల్పోయి సాధారణంగా శ్వాస తీసుకోలేని పరిస్థితి ఏర్పడినప్పుడు అత్యవసర వైద్య సహాయం అందే వరకు చేపట్టే ప్రాథమిక ప్రాణరక్షణ చర్యలు అత్యంత కీలకమని ఎస్పీ పేర్కొన్నారు. శిక్షణ పొందిన వ్యక్తి సరైన సమయంలో స్పందించడం ద్వారా బాధితుడికి వైద్య సహాయం అందే వరకు విలువైన సమయాన్ని అందించగలమన్నారు. ప్రాణరక్షణపై అవగాహన పోలీసు శాఖకే పరిమితం కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరికీ చేరాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసు సిబ్బంది తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిచయస్తులకు కూడా ప్రాథమిక ప్రాణరక్షణ చర్యల ప్రాముఖ్యతను తెలియజేయాలని కోరారు. ఆపదలో ఉన్న ఒక మనిషి ప్రాణాన్ని కాపాడగలగడం కంటే గొప్ప సేవ మరొకటి లేదని ఎస్పీ పేర్కొన్నారు. శిక్షణను కేవలం ఒక కార్యక్రమంగా భావించకుండా, నేర్చుకున్న అంశాలను గుర్తుంచుకొని అవసరమైన సమయంలో ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ టౌన్ సీఐ మహేష్, ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ, ఎస్ఐలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



# 20 ఎకరాల పత్తి పంటను దున్నేసిన అన్నదాత

**గద్వాల, ఆగస్టు 23 (జనంసాక్షి)** జై జవాన్, జై కిసాన్ అని నినదించే వ్యవసాయక దేశం భారతదేశంలో అన్నదాత పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక కాదు,పండించే అవకాశమే లేక ఓ రైతు తన 20 ఎకరాల పత్తి చేనును ట్రాక్టర్ తో దున్నేసిన హృదయ విదారక ఘటన జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడులో జరిగింది.మానవపాడు గ్రామానికి చెందిన రైతు పోసిరెడ్డి రెండు నెలల క్రితం అప్పులు చేసి ఎకరాకు రూ.20 వేల చొప్పున 20 ఎకరాల్లో పత్తి విత్తనాలు వేశాడు. ఎరువులు, విత్తనాలు, కూలీల కోసం రూ.4 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టాడు.అయితే వర్షాలు ముఖం చాటేయడం, కాలువల ద్వారా సాగునీరు అందకపోవడంతో మొలకెత్తిన పత్తి మొక్కలు వాడిపోయాయి. దిగుబడి వచ్చే ఆశ లేకపోవడంతో గుండె రాయి చేసుకొని శుక్రవారం ట్రాక్టర్ తో పచ్చని పంటను దున్నించేశాడు."అన్నం పెట్టే రైతును ఆదుకోకపోతే దేశానికి అన్నం ఎక్కడి నుంచి వస్తుంది?" అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతుకు పరిహారం అందించి, సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# శిథిలావస్థలో అమీరాబాద్ పంచాయతీ భవనం

**• భయం గుప్పిట్లో అధికారులు, ప్రజాప్రతినిధులు**

**న్యాల్ కల్, ఆగస్టు 23, (జనం సాక్షి) :** పరిపాలన సౌలభ్యం కోసం ఉపయోగిస్తున్న గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. మూడున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన బీసీ కమ్యూనిటీ భవనంలో.."గ్రామ పంచాయతీ కార్యాలయం" గత పాతిక సంవత్సరాలుగా కొనసాగుతుంది. భవనానికి బీటలు, పగళ్ళు ఏర్పడి కూలెందుకు సిద్ధంగా మారడంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యానికి.. న్యాల్ కల్ మండలం, అమీరాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయం అత్యంత ప్రమాదకరంగా మారింది.

**ఆదర్శమైన గ్రామంలో నిర్మాణానికి నోచుకోని భవనం**

మండలంలోని అమీరాబాద్ ఓ ఆదర్శమైన గ్రామం. మంజీరా నది పరివాహక ప్రాంతంలో ఉండే అమీరాబాద్ గ్రామం ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం ఆదేశించిన కార్యక్రమాలను.. వివిధ శాఖలకు చెందిన స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు కార్యక్రమాలను సఫలీకృతం చేయడంలో ముందుంటారు. ఇటీవల జరిగిన.."ఓటరు జాబితా సర్ ప్రక్షాళన" కార్యక్రమంలో మండలంలోనే తొలిసారిగా



శతశాతం ప్రక్షాళన కార్యక్రమాన్ని పూర్తిచేశారు.139 కుటుంబాలు, 942 గురు జనాభా, 553 గురు ఓటర్లు ఉండే గ్రామంలో.. 60 శాతం మేర ఇంటి పన్నులను వసూలు చేశారు. ప్రార్థన మందిరాలు మినహా ఇతర అవసరాల కోసం పంచాయతీ ట్యాంకర్లను వాడిన కుటుంబాల నుండి పన్నులను వసూలు చేస్తారు. గృహ, ఇతర విద్యుత్ వినియోగదారుల నుండి శతశాతం విద్యుత్ బాకయిలను చెల్లించడంతో పాటు ఈనెల 23, ఆదివారం దశాబ్దల కాలంగా పెండింగ్ లో ఉన్న వివిధ దేవాలయాలకు చెందిన విద్యుత్ బకాయిలను చెల్లించి ఆదర్శంగా నిలిచారు.

**నూతన భవన నిర్మాణంతోనే సౌకర్యం : సర్పంచ్ విజయ**



గతంలో పంచాయతీ భవన నిర్మాణం కోసం ఉపాధి హామీ పథకం ద్వారా రూ:10లక్షలు మంజూరు చేశారు. నిర్మాణం చేపట్టడానికి కాంట్రాక్టర్లు ఎవ్వరు ముందుకు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. పాతిక సంవత్సరాలకు పైగా బీసీ భవనంలో గ్రామ పంచాయతీ కార్యాలయ భవనంలోనే సభలు, సమావేశాలు కొనసాగుతున్నాయి. భవనం శిథిలమై ప్రమాదకరంగా మారడంతో ఇబ్బందిగా మారింది. అధికారులు, పాలకులు దృష్టి సారించి నూతన భవననిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలి.

# అక్రమ మట్టి తరలిస్తున్న టిప్పర్ సీజ్


## ఇద్దరుపై కేసు నమోదు



**తూప్రాన్, ఆగస్టు 23 (జనంసాక్షి):** అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్ సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు. రాత్రి వెంకటాపూర్ శివారు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే సమాచారం మేరకు తూప్రాన్ పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వెళ్తున్న ఒక టిప్పర్‌ను తనిఖీ చేయగా, అందులో మట్టి ఉన్నట్లు గుర్తించారు. మట్టి తరలింపుకు సంబంధించి ఎలాంటి అనుమతి పత్రాలు, రవాణా పత్రాలు లేకపోవడంతో టిప్పర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి టిప్పర్ డ్రైవర్ అనిల్ ,యజమాని శ్రీనివాస్ గౌడపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అక్రమంగా మట్టి, ఇసుక తదితర మైనర్ మినరల్స్‌ను తరలించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తూప్రాన్ పోలీసులు తెలిపారు.



# అభివృద్ధి సరే.. రైతుకు న్యాయమేదీ..?



**జోగులాంబ గద్వాల ప్రతినిధి, ఆగస్టు 22(జనంసాక్షి) :** నీళ్లు ఇస్తామని చెప్పి భూములు లాక్కోవడమే అభివృద్ధినా? గుడ్డెందొడ్డి రిజర్వాయర్ విస్తరణ ప్రతిపాదన ఇప్పుడు ఇదే ప్రశ్నను లేవనెత్తుతోంది. 1.19 టీఎంసీల రిజర్వాయర్‌ను 15 టీఎంసీలకు పెంచుతామంటున్నారు. అంటే దాదాపు 13 రెట్లు విస్తరణ! దీనికి 700 ఎకరాలు కావాలంటున్నారు. మరి ఈ 700 ఎకరాలు ఎవరివి? సారవంతమైన పంట పొలాల్లో రైతులు ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములే కదా? రైతులకు నోటీసు లేదు, స్పష్టత లేదు, భూసేకరణపై ఇప్పటివరకు ఒక్క గ్రామసభ లేదు. అధికారులు సర్వే చేస్తున్నారనే ప్రచారం తప్ప, అధికారిక ప్రకటన లేదు. ఇది రైతుల్లో భయాన్ని పెంచుతోంది. పాత కట్ట పెంపా? కొత్త ముంపా?ప్రస్తుత కట్టను పెంచితేనే 15 టీఎంసీలు సాధ్యమా? ఇంజనీరింగ్ అసాధ్యం అంటే, కొత్త భూములు ముంపునకు గురి కావాల్సిందే. మరి ఆ ముంపు గ్రామాలకు పునరావాసం ఏది? న్యాయమైన పరిహారం వస్తుందా?గతంలో జూరాల, రాజోళిబండ ప్రాజెక్టుల భూసేకరణలో రైతులకు జరిగిన అన్యాయం అందరికీ తెలుసు. మళ్లీ అదే కథ పునరావృతం అవుతుందా? నీళ్లు కావాలి, కానీ అన్నం పెట్టే రైతును నీట ముంచి కాదు. ప్రభుత్వం ముందుగా రైతులతో మాట్లాడి, పరిహారం, పునరావాసంపై భరోసా ఇచ్చాకే ముందడుగు వేయాలి. లేదంటే ఇది మరో పోరాటానికి దారి తీస్తుంది.

## తెలంగాణ పరిపాలన పిచ్చోని చేతిలో రాయి



- దమ్మంటే కొండ సుస్మితకు సమాధానం చెప్పండి
- కల్యాణ లక్ష్మి రైతు బీమాకు మంగళం!
- ప్రజా ప్రతినిధులను రోడ్లపై తిరగనీయం
- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

**డోర్నకల్, ఆగస్టు 22 (జనంసాక్షి) :** తెలంగాణలో కాంగ్రెస్ పాలనపై మాజీ మంత్రి బీఆర్ఎస్ అధినేత్రి సత్యవతి రాథోడ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో పరిపాలన తుగ్లక్ చర్యలను తలపిస్తోందని అధికార పగ్గాలు పిచ్చోని చేతిలో రాయిలా మారాయని ఆమె ధ్వజమెత్తారు. శనివారం పట్టణంలోని మన్యు పాట్నీని పరామర్శించి విలేకరుల సమావేశంలో ఆమె కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి రాజకీయ కక్షసాధింపులకే ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ వైఫల్యాలను, హామీల ఉల్లంఘనను ప్రశ్నించిన కొండ సుస్మిత అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని సవాల్ విసిరారు. చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి విపక్షాలపై దాడులు చేయడం కాదని దమ్మంటే ఆమె లేవనెత్తిన అంశాలకు బహిరంగంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల కోసం ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి, రైతు బీమా వంటి అద్భుతమైన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయంగా బంద్ పెట్టించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. నిధులు లేవనే నెపంతో పేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు, రైతుల కుటుంబాలకు అందాల్సిన భరోసాను దూరం చేయడం దుర్మార్గమన్నారు. హామీలను నమ్మి ఓట్లేసిన ప్రజలను వంచించిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను ఇకపై గ్రామాల్లో రోడ్లపై తిరగనీయమని సత్యవతి రాథోడ్ హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో ప్రజలే కాంగ్రెస్ నాయకులను నిలదీసే రోజులు దగ్గరపడ్డాయని ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని ఆమె హెచ్చరించారు. ఆమె వెంట మాజీ జడ్పీ చైర్ పర్సన్ బిందు, మాజీ వైస్ ఎంపీపీ తుమ్మ వెంకటరెడ్డి, మాజీ కోఆప్షన్ రాంబద్రం, గౌస్, గండి వెంకటేష్, ఉప సర్పంచ్ రవి, కొత్త వీరన్న, ఐక్యరాజ, వినయ్ చంద్ర తదితరులున్నారు.

# మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేయాలి

- వరంగల్‌లో కాంగ్రెస్ పార్టీని కాపాడాలి
- బీసీలను అణగదొక్కిన కొండా దంపతులు
- సుస్మిత పటేల్ సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ క్షమాపణ చెప్పాలి
- వరంగల్ తూర్పు నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు
- మాజీ కార్పొరేటర్ గుండేటి నరేందర్ ఇంటి వద్ద విలేకరుల సమావేశం



**వరంగల్ బ్యూరో, ఆగస్టు 23 (జనం సాక్షి) :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసినటువంటి కొండా దంపతుల కూతురు సుస్మిత పటేల్ వ్యవహారంలో తనకు ఎలాంటి సంబంధం లేదంటూ మాట్లాడిన రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రినీ భర్త రఫ్ చేయాలని వరంగల్ తూర్పు నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వరంగల్ లోని రాంకీలో గల తాజా మాజీ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ ఇంటి వద్ద ఆదివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పరమేశ్ మాట్లాడుతూ..సుస్మిత పటేల్ బేషరతుగా సీఎం రేవంత్ రెడ్డికి క్షమాపణ చెప్పాలన్నారు. వరంగల్ తూర్పులో బీసీలను తొక్కడమే వాళ్ల పనిగా మారింది, మేము పార్టీ కోసం పనిచేస్తుంటే మాతో వచ్చిన వారి పై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. 350 గోర్ల సజీవ దహన కావడానికి ఎవరు కారణం, పార్టీ కోసం పనిచేస్తున్న వారిని భయభ్రాంతులకు గురి చేసి పోలీస్ స్టేషన్లో కేసులు పెట్టి రౌడీషీట్ ఓపెన్ చేయించారు అన్నారు. తాజా మాజీ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ మాట్లాడుతూ పొగరుబోతు తనంతో సీఎం రేవంత్ రెడ్డిని ఇష్టం వచ్చినట్టు మాట్లాడిన సుస్మిత పటేల్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కొమ్మలలో కొండా మురళి తన కూతురు పరకాల నుంచి పోటీ చేస్తుందని ప్రకటించారని, అలాగే కార్పొరేటర్లను కూడా ముందుగానే ప్రకటిస్తున్నారని ఇది ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. కొండా దంపతులు ఒంటెద్దు పోకడదో కాంగ్రెస్ పార్టీకి నష్టం చేస్తున్నారని అన్నారు. కొండా సురేఖను భర్త రఫ్ చేసి కాంగ్రెస్ పార్టీని బతించాలని కోరారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నల్గొండ రమేష్ మాట్లాడుతూ కొండా సురేఖ విధానంతో కాంగ్రెస్ పార్టీకి నష్టం జరుగుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలు క్షమార్హం, కొండా దంపతులు భేషరతుగా క్షమాపణ చెప్పాలి...బిసిలను అడ్డం పెట్టుకుని కొండా దంపతులు రాజకీయ పబ్బం గడుపుతున్నారు. బిసినాయకులపై అక్రమ కేసులు పెడుతున్న ఘనత కొండా దంపతులకే దక్కుతుంది అన్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు పాల్గొని నారగోని స్వప్న మాట్లాడుతూ సుస్మిత వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నామన్నారు. కొండ దంపతులు ఏ రోజు ప్రజలను పట్టించుకోలేదని, ప్రజల మధ్య లేని నాయకులని అన్నారు. సోషల్ మీడియా ఇన్చార్జి సోమలక్ష్మి మాట్లాడుతూ కొండా దంపతులు నవీన్ రాజును లీజుకు తీసుకొని ఏ సమస్య ఉన్న ఆయనకే చెప్పమని అనడం సరైనది కాదన్నారు. ఎలక్షన్ల ముందు కొండా సురేఖ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడ్డామని కానీ తమను ఏ రోజు కూడా పట్టించుకోలేదని విమర్శించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎల్. శ్రీనివాస్ మాట్లాడుతూ కొండా దంపతులు మాటమీద నిలబడని మనుషులన్నారు. తామంతా బీసీలను కాదా.. బీసీలను అనుకోదొక్కడంలో కొండా దంపతులు ముందుంటారన్నారు. కొండ సుస్మిత పటేల్ తాను చేసిన వ్యాఖ్యలపై వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బసవరాజ్ కుమార్, గోరంట్ల రాజు, కూరపాటి సదానందం, జీవన్ కిషోర్, తోట హరీష్, తోట బాలరాజు, బోలుగొడ్డు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## 1/70 చట్టానికి అనుగుణంగానే జరపాలి

**వాజేడు, ఆగస్టు23 (జనంసాక్షి):** ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వం చేపడుతున్న భూ రీ-సర్వేను 1/70 భూ బదలాయింపు నియంత్రణ చట్టం నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా నిర్వహించాలని తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి పాయం జానకి రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల భూములకు ప్రత్యేక రక్షణ ఉందని, రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ స్ఫూర్తికి అనుగుణంగా భూ హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు పేర్కొన్నారు. 1/70 నిబంధనల ప్రకారం గిరిజనుల భూములు గిరిజనేతరుల చేతుల్లోకి అక్రమంగా వెళ్లకుండా చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. రీ-సర్వే సమయంలో ప్రతి భూమి చరిత్రను పరిశీలించాలన్నారు. భూమి అసలు పట్టాదారు ఎవరు? ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉంది? గతంలో ఏమైనా అమ్మకం, కౌలు, తనఖా లేదా ఇతర రూపంలో బదలాయింపు జరిగిందా? ఆ బదలాయింపు 1/70 నిబంధనలకు అనుగుణంగా ఉందా? అనే అంశాలను అధికారులు సమగ్రంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు. గిరిజన భూమి గిరిజనేతరుల ఆధీనంలో ఉన్నట్లు తేలితే, కేవలం ప్రస్తుత ఆక్రమణ లేదా రికార్డుల ఆధారంగా హక్కులు నమోదు చేయకుండా 1/70 ప్రకారం విచారణ జరిపి, అక్రమ బదలాయింపులను గుర్తించి గిరిజనులకు భూమిని పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని కోరారు. తెలంగాణ న్యాయ సేవా సంస్థ ఖీూలో కూడా 1/70కు విరుద్ధంగా బదలాయించిన గిరిజన భూమి పునరుద్ధరణకు సంబంధిత ఎల్‌టీఆర్ అధికారులను ఆశ్రయించవచ్చని పేర్కొంది.

### గ్రామసభ సమక్షంలో సర్వే చేయాలి

రీ-సర్వే ప్రక్రియలో సంబంధిత గ్రామాల గిరిజనులు, గ్రామసభ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇచ్చి, భూముల వాస్తవ స్థితిని వారి సమక్షంలో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. భూముల రికార్డుల్లో పొరపాట్లు, అక్రమ ఆక్రమణలు, అనుమానాస్పద బదలాయింపులు ఉంటే వాటిని ప్రత్యేకంగా గుర్తించాలని కోరారు.

### అక్రమ బదలాయింపులకు చట్టబద్ధమైన ముగింపు

1/70 నిబంధనలకు విరుద్ధంగా జరిగిన భూ బదలాయింపులను రీ-సర్వేలో గుర్తించి ప్రత్యేక జాబితా రూపొందించి, సంబంధిత ఎల్‌టీఆర్ అధికారుల ద్వారా విచారణ చేపట్టాలని అన్నారు. ఏజెన్సీ భూముల రక్షణ విషయంలో రీ-సర్వే కేవలం కొలతలకు పరిమితం కాకుండా గిరిజనుల భూ హక్కుల పరిరక్షణకు ఉపయోగపడే ప్రక్రియగా ఉండాలని స్పష్టం చేశారు.

### ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలివ్వాలి

ఏజెన్సీ ప్రాంతాల్లో జరుగుతున్న రీ-సర్వేకు సంబంధించి 1/70 నిబంధనలను తప్పనిసరిగా అమలు చేసేలా రెవెన్యూ, సర్వే, గిరిజన సంక్షేమ శాఖల అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'గిరిజనుల భూమి-గిరిజనుల హక్కు. 1/70 రక్షణతోనే ఏజెన్సీ భూ రీ-సర్వే జరగాలి" అని వారు స్పష్టం చేశారు.

## మర్రి రవికుమార్‌కు డాక్టరేట్

- నా తల్లితండ్రుల స్ఫూర్తే ఈ అవార్డు.. వారికే అంకితం : రవికుమార్



**ఎల్కతుర్తి (జనంసాక్షి) :** ఎల్కతుర్తి మండల మూలోని భవ పేట గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు, జర్నలిస్ట్ మర్రి రవికుమార్ కు అరుదైన గౌరవం – డాక్టరేట్ అవార్డు 2026 రావడం ఆనందంగా ఉందన్నారు. తన తల్లిదండ్రులు మర్రి జక్కమ్మ, ఉప్పలయ్య ఇచ్చిన స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహించానని, ఈ అవార్డు వారికే అంకితమన్నారు. యువకుడు స్వచ్ఛందగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిన ఘనత చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం భావుపేట గ్రామానికి చెందిన మర్రి రవికుమార్ గత కొన్ని సంవత్సరాలుగా నిర్వీరామంగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. రవికుమార్ చేస్తున్న సేవాలను గుర్తించి హైదరాబాద్ కు చెందిన తెలుగు సంస్కృతి సాహితి సేవా ట్రస్ట్, తెలంగాణ సంస్కృతి సాహితి బుక్ ఆఫ్ రికార్డ్స్ గౌరవ డాక్టరేట్ 2026 ప్రధానం చేశారు. తను చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి 2023 రవీంద్ర భారతిలో జీ సీ ఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యములో బంగారు నంది అవార్డు ప్రధానం చేశారు. అనేక అవార్డులు ప్రశంస పత్రాలు వచ్చాయని ఈ సందర్భంగా రవికుమార్ పేర్కొన్నారు. తన చిన్నతనం నుండి తల్లిదండ్రులు స్ఫూర్తి అని నిరుపేదలకు, అబాగ్యులకు సేవా చేయాలని, మనకు ఉన్నదాంట్లో వారు చెప్పిన మాటలు ఇప్పటికి తన మదిలో మేదులుతున్నాయని రవికుమార్ తెలిపారు. తాను స్వంతంగా నిరుపేదలకు వైద్య సహాయం,, అన్నదానం, రక్తదానం, నిరుపేద కుటుంబాలకు, అనాధాశ్రామాలకు బియ్యం పంపిణి వితరణ. ఇలా అనేక సేవా కార్యక్రమాలను నిరంతరం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డా. మర్రి రవికుమార్ పత్రిక విలేకరులకు తెలియచేశారు నాకు డాక్టరేట్ రావడం సంతోషంగా ఉందని, ఈ అవార్డు రావడం మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. తన తల్లిదండ్రుల పేరుమీద ఒక ట్రస్ట్ ప్రారంభించి అందరికి సేవా చేయటం తన లక్ష్యం అన్నారు. నా జీవిత సహాచరి మంజుల అందించిన తొడ్పాట్ నా విజయానికి కారణం అని తెలిపారు. నాకు డాక్టరేట్ రావడం పట్ల బావుపేట గ్రామ ప్రజలు, స్నేహితులు తోటి జర్నలిస్ట్ మిత్రులు, సహచరులు, హర్షం వ్యక్తం చేశారు...

## మండలంలో పర్యటించిన బడే నాగజ్యోతి

- తిమ్మంపేటలో నూతన మినరల్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించిన బడే నాగజ్యోతి
- పిఎసిఎస్ చైర్మన్ తోట రమేష్ కుటుంబానికి పరామర్శ



**మంగపేట ఆగస్టు 23(జనంసాక్షి) :** మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం బారాస పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ జెడ్పీ చైర్పర్సన్ బడే నాగజ్యోతి పర్యటించారు. ఈ సందర్భంగా బడే నాగజ్యోతి మండలంలోని తిమ్మంపేట గ్రామానికి చెందిన బిఆర్ఎస్ యువజన సీనియర్ నాయకుడు ముప్పారపు సందీప్ నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ ను బిఆర్ఎస్ మండలశాఖ మాజీ అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణతో కలిసి ప్రారంభించారు. అనంతరం హేమాచల లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో వివాహ కార్యక్రమానికి హాజరై దంపతులను ఆశీర్వదించారు. అలాగే ఇటీవల పిఎసిఎస్ చైర్మన్ తోట రమేష్ తండ్రి వీరయ్య గుండెపోటుతో మరణించగా పాలాయిగూడెం లోని రమేష్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మండలంలోని నర్సాయిగూడెం, సంఘంపల్లి, దోమడ మల్లూరు గ్రామాలలో ఇటీవల మరణించిన బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలశాఖ మాజీ అధ్యక్షులు కుడుముల లక్ష్మి నారాయణ, మండల మాజీ ప్రధాన కార్యదర్శి గుండేటి రాజుయాదవ్, మల్లూర్ దేవస్థాన మాజీ చైర్మన్ నూతిలకంటి ముకుందం, పూజారి శ్రీనివాస్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ కాడబోయిన నరేందర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కోరం సంతోష్, చిలకమర్రి రాజేందర్, కేక్కం జగదీష్, దంతనపల్లి నరేందర్, గాదె శ్రీనివాస్ చారి, పిఎసిఎస్ డైరెక్టర్ అచ్చ సత్యనారాయణ, మహిళ నాయకురాలు కాటూరి సుగుణ, చల్లగురుగుల తిరుపతి, గుండారపు రమేష్, గౌని రమేష్, బిఆర్ఎస్వి జిల్లా నాయకులు కొమరం సిద్దు, సోషల్ మీడియా వారియర్స్ బీసా సాంబయ్య, గుడివాడ శ్రీహరి, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.


## ఎంఆర్‌పీ కంటే అధిక ధరకు ఎరువుల విక్రయం

### శ్రీనివాస ఫర్టిలైజర్స్ లైసెన్స్ సస్పెన్షన్

**మావల, ఆగస్ట్ 24 (జనంసాక్షి) :** రైతుల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధర (ఎంఆర్పీ) కంటే అధిక ధరకు ఎరువులు విక్రయించిన ఉట్నూరులోని శ్రీనివాస ఫర్టిలైజర్స్ పై వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు నిర్వహించిన తనిఖీలు, విచారణలో 28-28-0 ఎరువును నిర్ణయించిన ఎంఆర్పీ కంటే అధిక ధరకు విక్రయించినట్లు నిర్ధారణ కావడంతో దుకాణం ఎరువుల విక్రయ లైసెన్స్‌ను సస్పెండ్ చేశారు. ఫర్టిలైజర్ (కంట్రోల్) ఆర్డర్ , 1985 నిబంధనలను ఉల్లంఘించినందుకు శ్రీనివాస ఫర్టిలైజర్స్ ఎరువుల విక్రయ లైసెన్స్‌ను 21.08.2026 నుంచి 03.09.2026 వరకు 15 రోజుల పాటు సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని ఎరువుల డీలర్లు ఫర్టిలైజర్ (కంట్రోల్ ) ఆర్డర్ , 1985 నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ఎంఆర్పీకే ఎరువులు విక్రయించాలని ఆదేశించారు. అధిక ధరలకు విక్రయించడం, అక్రమంగా ఎరువులను నిల్వ చేయడం, స్టాక్ రికార్డుల నిర్వహణలో అవకతవకలకు పాల్పడటం వంటి ఉల్లంఘనలను సహించేది లేదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే డీలర్లపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు ఎరువులను లైసెన్స్ పొందిన అధీకృత దుకాణాల నుంచే కొనుగోలు చేయాలని సూచించారు. ప్రతి కొనుగోలుకు సంబంధించి దుకాణదారుడి నుంచి తప్పనిసరిగా బిల్లు లేదా రసీదు తీసుకోవాలని తెలిపారు. ఎరువుల దుకాణాల్లో స్టాక్ వివరాలు, ధరల పట్టికను స్పష్టంగా ప్రదర్శించాలని డీలర్లను ఆదేశించారు. ఎఫ్ఎఫ్ఎస్ ఎరువుల బుకింగ్ యాప్ ద్వారా ఎరువులు బుక్ చేసుకునే సమయంలో రైతులకు ఏదైనా ఇబ్బంది ఎదురైతే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) లేదా మండల వ్యవసాయ అధికారి (ఎంఏవో)ను సంప్రదించాలని అధికారులు సూచించారు. ఎరువుల కొనుగోలు సమయంలో అధిక ధరలు వసూలు చేసినా, ఎరువుల లభ్యత, విక్రయాలు లేదా ఇతర సమస్యలు ఎదురైనా రైతులు 8977742855 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. జిల్లాలో ఎరువుల విక్రయాలపై వ్యవసాయ శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. రైతులకు ఇబ్బందులు కలిగించేలా అధిక ధరలకు ఎరువులు విక్రయించినా, అక్రమ నిల్వలకు పాల్పడినా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా లైసెన్స్ సస్పెన్షన్‌తో పాటు అవసరమైతే మరింత కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

### నరేంద్ర దాభోల్కర్ హత్య కేసులో నిందితుడికి
## బెయిల్ ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం

- పూలే, పెరియార్, అంబేద్కర్ ఆలోచన వేదిక



**బెల్లంపల్లి, ఆగస్టు 23 (జనంసాక్షి) :** హేతువాది, మూఢనమ్మకాల వ్యతిరేక ఉద్యమకారుడు డాక్టర్ నరేంద్ర దాభోల్కర్ హత్య కేసులో జీవిత ఖైదు శిక్ష పొందిన సచిన్ అందురేకు బాంబే హైకోర్టు ఈనెల 18న బెయిల్ మంజూరు చేయడం, జీవిత ఖైదు శిక్షను తాత్కాలికంగా నిలిపివేయడం పట్ల పూలె పెరియార్ అంబెద్కర్ ఆలోచన వేదిక ఆందోళన వ్యక్తం చేస్తున్నదని ఆ సంఘం అధ్యక్షుడు గోడిశెల శ్రీహరి అన్నారు. దాభోల్కర్‌ను 2013 ఆగస్టు 20న పుణేలో ఉదయం నడకకు వెళ్లిన సమయంలో కాల్చిచంపారని, ఈ హత్య దేశవ్యాప్తంగా హేతువాద, శాస్త్రీయ ఆలోచనా ఉద్యమాలపై జరిగిన దాడిగా తీవ్ర కలకలం రేపిందన్నారు. 2024 మేలో పుణే సెషన్స్ కోర్టు సచిన్ అందురే, శరద్ కలస్కర్‌లను హత్య కేసులో దోషులుగా నిర్ధారించి జీవిత ఖైదు విధించిందన్నారు. తాజాగా బాంబే హైకోర్టు అప్పీల్ పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో అందురే జీవిత ఖైదును నిలిపివేసి బెయిల్ మంజూరు చేసిందన్నారు. సాక్షుల గుర్తింపు ఆలస్యం, ఆయుధాల స్వాధీనం తదితర అంశాల్లో ఆధారాలు బలహీనంగా ఉన్నాయని కోర్టు ప్రాథమికంగా పేర్కొన్నట్లు వార్తా నివేదికలు వెల్లడిస్తున్నాయన్నారు. ఈ నిర్ణయం పట్ల తాము అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామన్నారు. దాభోల్కర్ హత్య ఒక్క వ్యక్తిపై జరిగిన నేరం మాత్రమే కాదని, హేతువాదం, శాస్త్రీయ దృక్పథం, మూఢనమ్మకాల నిర్మూలన కోసం జీవితాన్ని అంకితం చేసిన ఒక ప్రజా ఉద్యమకారుడి ప్రాణాలను బలిగొన్న ఘటన అన్నారు. ఈ హత్య వెనుక ఉన్న పూర్తి కుట్ర, ప్రేరేపించిన శక్తులు, సహకరించిన వ్యక్తులు ఎవరో వెలుగులోకి రావడం అత్యంత అవసరం అన్నారు. బెయిల్ అనేది నిర్దోషిత్వాన్ని ప్రకటించడం కాదని, కేసు అప్పీల్ దశలో కొనసాగుతుందని స్పష్టంగా గుర్తించాలన్నారు. ఇలాంటి సున్నితమైన హత్య కేసులో దోషిగా నిర్ధారించబడిన వ్యక్తికి శిక్ష నిలిపివేతతో పాటు బెయిల్ లభించడం బాధిత కుటుంబానికి, హేతువాద ఉద్యమానికి, న్యాయం కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు తీవ్ర నిరాశ కలిగించే పరిణామం అన్నారు. నరేంద్ర దాభోల్కర్ హత్య కేసులో న్యాయ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. హత్యకు సంబంధించిన పూర్తి కుట్ర, కుట్రదారులు, సహకరించిన వ్యక్తులపై సమగ్ర దర్యాప్తు జరపాలన్నారు.



### సౌత్ జోన్ ఫారాత్రో బాల్ ఛాంపియన్షిప్
## పోటీల్లో బంగారు పతకం

**పర్వతగిరి, ఆగస్టు23 (జనంసాక్షి) :** తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూర్‌లో జరిగిన సౌత్ జోన్ ఫారాత్రో బాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రతిభావంతులైన క్రీడాకారులు పాల్గొనగా, రమాదేవి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పథకాన్ని సాధించారు. పూర్తి వివరాల్లోకి వెళితే వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన పోకల రమాదేవి పుట్టుకతో వచ్చిన వైకల్యం తన లక్ష్యానికి అడ్డంకి కాదని, తన వైకల్యాన్ని అధిగమించి, నిరంతర సాధన, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ ఈనెల 22న తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్ లోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన 5వ సౌత్ జోన్ ఫారాత్రో బాల్ ఛాంపియన్షిప్ లో బంగారు పథకాన్ని సాధించారు. సాధారణ జీవితంలో ఎదురయ్యే ఇబ్బందులతో పాటు, సమాజంలో అంగవైకల్యంపై ఉండే అపోహాలను, పరిమితులను ఆమె ధైర్యంగా ఎదుర్కొన్నారు. క్రీడలపై ఆసక్తిని పెంచుకున్న పోకల రమాదేవి పారత్రో బాల్ లో క్రమం తప్పకుండా సాధన చేస్తూ తన ప్రతిభను మెరుగుపరుచుకుంటున్నారు. ఈ సందర్భంగా బంగారు పథకాన్ని సాధించిన రమాదేవిని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అభినందనలు తెలుపుతూ, భవిష్యత్తులో మరెన్నో పథకాలు సాధించాలని కోరారు.

## అనారోగ్యంతో తెలంగాణ ఉద్యమకారుడు మృతి



**ఆత్మకూర్, అక్టోబర్ 23 (జనం సాక్షి):** ఆత్మకూరు మండలంలోని నీరుకుళ్ళ గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మానగాని రాజు 42 ఆదివారం రోజున అనారోగ్యంతో మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు నిరుపేద బీసీ కుటుంబంలో జన్మించిన రాజు తెలంగాణ ఉద్యమంలో 2001 నుండి చురుగ్గా పాల్గొన్నారు కానీ తెలంగాణ ప్రభుత్వంలో ప్రభుత్వం నుండి అతనికి ఎలాంటి పథకాలు చెందలేదని తెలంగాణ ఉద్యమంలో మండల స్థాయిలోమొదటి నుండి తెలంగాణ వచ్చేవరకు జరిగిన ప్రతి ఉద్యమంలో పాల్గొన్నారు అని అతని సన్నిహితులు తెలిపారు మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు నిరుపేద బీసీ కుటుంబానికి చెందిన తెలంగాణ ఉద్యమ కారుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొని ఆర్థిక సాయం అందించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా నాయకులు ఇరుసడ్ల సదానందం ఆత్మకూరు మండల అధ్యక్షుడు ఎండి బాబుమియా ఒక ప్రకటన తెలిపారు రాజు మృతితో నీరుకుల్లా గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి అతని అంతిమ క్రియల్లో పలువురు బిఆర్ఎస్ నాయకులు తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.

# ముస్లింల అభ్యున్నతికి మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవ

### ముస్లిం మతపెద్దల విజ్ఞప్తికి సానుకూల స్పందన

### ఖబరస్తాన్ స్థలాల ప్రహరీ గోడల నిర్మాణానికి నిధుల కేటాయింపు



**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 23 (జనంసాక్షి) :** ముస్లిం మైనారిటీ సమాజం సంక్షేమం, వారి మతపరమైన అవసరాల పరిరక్షణకు పెద్దపీట వేస్తూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ముస్లిం మతపెద్దలు, మత గురువుల విజ్ఞప్తి మేరకు ఖబరస్తాన్‌లకు సంబంధించిన స్థలాలు , రక్షణ కోసం ప్రహరీ గోడల నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించడం పట్ల ముస్లిం సమాజం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఈరోజు కాంగ్రెస్ పార్టీ నాయకుడు అబ్దుల్ రషీద్ తో కలిసి మతపెద్దలు, మత గురువులు సంబంధిత ఖబరస్తాన్ స్థలాలను సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఖబరస్తాన్‌లను భవిష్యత్ తరాలకు సురక్షితంగా అందించేందుకు ప్రహరీ గోడల నిర్మాణం ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జామియత్ ఉలమా ఖమ్మం జిల్లా అధ్యక్షులు మౌలానా మొహమ్మద్ సయీద్ అహ్మద్ ఖాస్మీ, మరియు మతపెద్దలు షానవాజ్ ,అబ్దుల్ మజీద్,అబ్దుల్ రెహ్మాన్ మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దూరదృష్టి, ప్రజా సంక్షేమ దృక్పథాన్ని అభినందించారు. కులమతాలకు అతీతంగా ప్రతి వర్గం సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రశంసనీయమని వారు అన్నారు. ప్రజలకు కేవలం తాత్కాలిక ప్రయోజనాలు అందించడం కాకుండా, భవిష్యత్ తరాలకు ఉపయోగపడే శాశ్వత మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఖబరస్తాన్‌ల కు స్థలాలు మరియు ప్రహరీ గోడల నిర్మాణానికి నిధులు కేటాయించడం ముస్లిం సమాజం పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొంటూ, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు అబ్దుల్ రషీద్‌కు మతపెద్దలు, మత గురువులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ,మౌలానా గని,ప్రభుత్వ ఖాజీ ముఫ్తీ ఆసిఫ్,ముఫ్తీ షుజాఉద్దీన్,ముఫ్తీ అలావుద్దీన్, మౌలానా సయ్యద్ సాబిర్,హాఫీజ్ ఉస్మాన్, మౌలానా సల్మాన్,ముఫ్తీ ఇమ్రాన్ ఖాన్, అఫ్సర్, ఖాసీం, సమద్, గౌస్, తాజ్బాబా, రహీముద్దీన్, సాజిద్, ముదస్సర్, జహీర్, ఖదీర్, సలీం, సర్వర్, తదితరులు పాల్గొన్నారు.

# కారుతో ఢీకొట్టి హత్యాయత్నం

### బూర్గంపహాడ్‌లో కేసు నమోదు

**బూర్గంపహాడ్ ఆగస్టు 23 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా : వివాహేతర సంబంధం విషయంలో తలెత్తిన వివాదం హత్యాయత్నానికి దారితీసింది. బూర్గంపహాడ్ మండలం జింకలగూడెం గ్రామంలో షేక్ ఇస్మాయిల్ అనే వ్యక్తి తన స్కార్పియో కారుతో అదే గ్రామానికి చెందిన షేక్ మౌలానాను ఢీకొట్టి హత్య చేసేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మౌలానా సోదరుడు షేక్ నాగుల్ మీరా ఇచ్చిన ఫిర్యాదు మేరకు బూర్గంపహాడ్ ఎస్సై మేడా ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివాహేతర సంబంధం కారణంగానే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. కాగా, నిందితుడు షేక్ ఇస్మాయిల్‌పై గతంలో పశువుల అక్రమ రవాణాకు సంబంధించి కొత్తగూడెం జిల్లాలో పలు కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలపై ఎస్ ఐ మేడా ప్రసాద్ దర్యాప్తు చేపట్టారు.

# బుక్కా సత్యనారాయణకు జాతీయ పురస్కారం



**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 23 ( జనం సాక్షి ) :** తెలంగాణ సంస్కృతి సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్స్ జాతీయ పురస్కారాల సభలో ఖమ్మం కు చెందిన ప్రముఖ కవి రచయిత డాక్టర్ బుక్కా సత్యనారాయణ కు సాహితీ సేవ, సామాజిక సేవ, వివిధ రంగాలలో సేవ చేస్తున్నందుకు బుక్కా సత్యనారాయణకు ప్రజా కవి బిరుదుతో సత్కరించారు. సత్యనారాయణ గతంలో ప్రపంచ స్థాయి అవార్డులు, జాతీయ స్థాయి అవార్డులు, రాష్ట్రస్థాయి అవార్డులు, సాహితీవేత్తలచే పురస్కారాలు అందుకున్నారు. సామాజిక సేవ చేస్తూ, ప్రముఖలచే, అధికార అనధికార వర్గాలచే ఆయన ప్రశంసలు అందుకున్నారు. సాహిత్యంలో 2009 నుండి ఇప్పటివరకు ప్రపంచంలో జరుగుతున్న అన్యాయాలపై, భారత దేశంలో, జరుగుతున్న అన్యాయాలపై రాష్ట్రంలో జరుగుతున్న వివిధ సంఘట నలలో,ప్రజాసంఘాలతో, ఐక్యమై, పయనించట చెప్పుకోదగ్గ విషయం.

# గోదాంలో రూ.23 లక్షల ధాన్యం మాయం!

- దొంగతనం బయటపడకముందే బ్లాక్‌మెయిల్
- 850 క్వింటాళ్ల ధాన్యాన్ని నకిలీ తాళంతో తరలింపు
- చిరుధాన్యాల వ్యాపారి నాగిళ్ల ఆంజనేయులు.. బ్లాక్‌మెయిల్ ముఠా అరెస్ట్



**చండూరు, ఆగస్టు 23 (జనంసాక్షి) :** చండూరు వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాంలో భారీ ధాన్యం గోల్‌మాల్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రైతుల నుంచి ఐకేపీ ద్వారా సేకరించి గోదాంలో నిల్వ చేసిన సుమారు 850 క్వింటాళ్ల ధాన్యం, దాదాపు రూ.23 లక్షల విలువైన సరుకు గుట్టుచప్పుడు కాకుండా తరలిపోయిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఈ వ్యవహారంలో ధాన్యాన్ని అక్రమంగా తరలించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యాపారితో పాటు, అనంతరం అతడిని బెదిరించి డబ్బులు వసూలు చేసిన ముఠా సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మార్కెట్ యార్డులోని గోదాంను మిల్లర్ తేలుకుంట్ల శ్రీనివాస్‌కు ధాన్యం నిల్వ కోసం కేటాయించినట్లు తెలుస్తోంది. గోదాంలో భారీగా ధాన్యం నిల్వ ఉన్న విషయాన్ని గమనించిన స్థానిక చిరుధాన్యాల వ్యాపారి నాగిళ్ల ఆంజనేయులు నకిలీ తాళం చెవి తయారు చేయించి గోదాంను తెరిచినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం రాత్రివేళల్లో లారీలను తీసుకొచ్చి ధాన్యాన్ని దశలవారీగా తరలించి సూర్యాపేట తదితర ప్రాంతాల్లో విక్రయించినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం.

**దొంగతనం బయటపడకముందే బ్లాక్‌మెయిల్**

రాత్రివేళల్లో లారీల ద్వారా ధాన్యం తరలిస్తున్న విషయాన్ని గమనించిన కొందరు స్థానికులు వ్యాపారిని బెదిరించినట్లు తెలుస్తోంది. ఈ విషయం పోలీసులకు, అధికారులకు చెబుతామంటూ.. రూ.5 లక్షలు డిమాండ్ చేయగా, చేసేది లేక వ్యాపారి తన వద్ద ఉన్న బంగారాన్ని ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి నగదు సమకూర్చి వారికి చెల్లించినట్లు సమాచారం. అయితే ఈ నగదు పంపకాల్లో ముఠా సభ్యుల మధ్య విభేదాలు తలెత్తడంతో అసలు ధాన్యం గోల్‌మాల్ వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. అనంతరం అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన పోలీసులు ధాన్యం తరలింపునకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యాపారితో పాటు బ్లాక్‌మెయిల్‌కు పాల్పడిన ముఠా సభ్యులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

**నెల రోజులుగా రాత్రివేళల్లో లారీలు..**
**అధికారుల పర్యవేక్షణ ఏదీ..?**

ఈ ఘటనతో మార్కెట్ యార్డు భద్రత, గోదాం పర్యవేక్షణపై తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సుమారు నెల రోజులుగా రాత్రివేళల్లో లారీల రాకపోకలు సాగుతూ ధాన్యం తరలిపోతుంటే సెక్యూరిటీ సిబ్బంది, మార్కెట్ కమిటీ అధికారులు ఏం చేస్తున్నారన్నది చర్చనీయాంశంగా మారింది. గేటు తాళాలు ఎవరి పర్యవేక్షణలో ఉన్నాయి? గోదాం పరిసరాల్లోని సీసీటీవీ కెమెరాలు పనిచేస్తున్నాయా? లారీల రాకపోకలకు సంబంధించిన ఎంట్రీ రిజిస్టర్లు నిర్వహించారా? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. అంతేకాకుండా ఇంత పెద్ద మొత్తంలో ధాన్యం తరలిపోతున్నా మార్కెట్ కమిటీ చైర్మన్, సంబంధిత అధికారులకు విషయం తెలియకుండా ఉండటంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారం వెనుక మరెవరైనా ఉన్నారా? ధాన్యం తరలింపునకు సహకరించిన వారెవరైనా ఉన్నారా? అనే కోణాల్లో సమగ్ర దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. మార్కెట్ యార్డులో రైతుల ధాన్యానికి భద్రత కల్పించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించారా? లేక ఈ వ్యవహారంలో అంతర్గత సహకారం ఏమైనా ఉందా? అన్న విషయాలను అధికారులు నిగ్గు తేల్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ధాన్యం చోరీకి సంబంధించిన పూర్తి వివరాలను, బాధ్యులను, తెరవెనుక ఉన్న సూత్రధారులను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

# భద్రాచలంలో 6.13 కిలోల గంజాయి పట్టివేత

### ద్విచక్ర వాహనంలో తరలిస్తుండగా ఇద్దరు అరెస్ట్

### రూ.4.51 లక్షల విలువైన గంజాయి, వాహనం, సెల్‌ఫోన్లు స్వాధీనం



**భద్రాచలం ఆగస్టు 23 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో గంజాయి పట్టుబడింది. ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న 6.130 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి. సోమిరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఆర్. కిషన్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్ఐ సీహెచ్. శ్రీహరిరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం కూనవరం--భద్రాచలం రహదారిలోని ఇసుక రీచ్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వచ్చిన రాయల్ ఎన్‌ఫీల్డ్ (ఓడి 10 వి 5439) ను ఆపి తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. గంజాయిని మల్కన్‌గిరి నుంచి భద్రాచలానికి తరలిస్తున్న సుభాన్ ధనాపుల్, ఉదయ హరిజన్‌లను అధికారులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 6.130 కిలోల గంజాయితో పాటు ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాటి మొత్తం విలువ సుమారు రూ.4.51 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితులను, స్వాధీనం చేసుకున్న వస్తువులను భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో కానిస్టేబుళ్లు రమేశ్‌బాబు, వెంకన్న, ప్రసన్నకుమార్, తిరుపతి, ఉపేందర్ పాల్గొన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాపై సమాచారం ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 18004252523కు తెలియజేయాలని ఎస్ఐ శ్రీహరిరావు కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.



# గడ్డి చెరువుకు ఓసి నీళ్లు మళ్లించండి

### సింగరేణి అధికారులకు సూచించిన ఎమ్మెల్యే కనకయ్య

**టేకులపల్లి, ఆగస్టు 23(జనంసాక్షి):** టేకులపల్లి మండలం లచ్చగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని గడ్డి చెరువుకు కోయగూడెం ఓసి నుంచి వృధాగా పోతున్న నీటిని మళ్లించాలని సింగరేణి అధికారులకు ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. గడ్డి చెరువులో నీరులేక వరి పొలాలు ఎండిపోయే పరిస్థితులు గ్రామంలోని రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రైతుల సమస్యపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదివారం సింగరేణి ఇల్లందు ఏరియా జీఎం ఈసం కృష్ణయ్యతో కలిసి బైక్‌పై నేరుగా గడ్డి చెరువు వద్దకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. కోయగూడెం ఓపెన్‌కాస్ట్ లో అందుబాటులో ఉన్న నీటిని గడ్డి చెరువులోకి మళ్లించేలా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చెరువులోకి నీరు చేరితే రైతులకు సాగునీటి ఇబ్బందులు కొంతవరకు తొలగుతాయని ఎమ్మెల్యే తెలిపారు. రైతుల పక్షాన ఎమ్మెల్యే సూచన మేరకు రైతుల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని జిఎం కృష్ణయ్య హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్కినేని శ్యామ్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కాలే ప్రసాదరావు, ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోరం సురేందర్, లచ్చగూడెం సర్పంచ్ ఎదలపల్లి వెంకటేశ్వర్లు, లచ్చగూడెం గ్రామ రైతులు పాల్గొన్నారు.

# లక్షల్లో బెట్టింగ్.. ఓడిపోయి రచ్చకెక్కిన పేకాట రాయుళ్లు

### రెండు జిల్లాల సరిహద్దుల్లో గుట్టల మధ్య జోరుగా పేకాట?

### నిఘా కొరవడటంతో జూదగాళ్లకు అడ్డాగా మారిన ప్రాంతం



**మర్రిగూడ, ఆగస్టు 22 (జనంసాక్షి)** నల్లగొండ రంగారెడ్డి జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో పేకాట జోరుగా సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మాల్ గ్రామపంచాయతీ పరిధి, నల్లగొండ జిల్లా మర్రిగూడ, చింతపల్లి మండలాల పరిధిలోని తమ్మడపల్లి గ్రామ శివార్లలో గుట్టల మధ్య ఉన్న నిర్మానుష్య ప్రాంతాలు పేకాటరాయులకు సురక్షిత స్థావరాలుగా మారినట్లు స్థానికులు చెబుతున్నారు. తమ్మడపల్లి శివారులోని గుట్టల ప్రాంతం రెండు జిల్లాల సరిహద్దుకు సమీపంలో ఉండటంతో పాటు పెద్దగా జనసంచారం లేకపోవడం, నిఘా తక్కువగా ఉండటంతో పేకాట నిర్వహించేవారికి అనుకూ లంగా మారిందని సమాచారం. ముఖ్యంగా మర్రిగూడ, చింతపల్లి మండలాలకు చెందిన కొందరు వ్యక్తులు ఇక్కడ పెద్ద ఎత్తున పేకాట ఆడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**రూ.2 లక్షల బెట్టింగ్.. రోడ్డుపై రచ్చ**

సుమారు 15 రోజుల క్రితం ఇదే ప్రాంతంలో సుమారు రూ.2 లక్షల మేర బెట్టింగ్ జరిగినట్లు సమాచారం. ఆటలో డబ్బుల విషయంలో తేడా రావడంతో సుమారు 20 మంది మధ్య వాగ్వాదం జరిగి, చివరకు రోడ్డుపై ఘర్షణకు దిగినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. పేకాట పేరుతో మొదలైన వ్యవహారం చివరకు కొట్టుకునే స్థాయికి చేరడం ఆందోళన కలిగిస్తోంది.

**యువత జీవితాలపై ప్రభావం**

ఇలాంటి జూద స్థావరాలపై నిఘా లేకపోతే యువత సైతం ఈ వ్యసనానికి బానిసయ్యే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేకాటతో పాటు మద్యం అలవాటు చేసుకుని అప్పుల పాలై కుటుంబాలను ఇబ్బందుల్లోకి నెట్టుకుంటున్న ఘటనలు అనేకం ఉన్నాయని పేర్కొంటున్నారు. లక్షల్లో బెట్టింగ్‌లు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో సంబంధిత పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, సరిహద్దు ప్రాంతాల్లో పేకాట స్థావరాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. రెండు జిల్లాల సరిహద్దు ప్రాంతం కావడంతో ఇరు జిల్లాల పోలీసులు సమన్వయంతో నిఘా పెంచాల్సిన అవసరం ఉందని వారు అంటున్నారు.

# గుండారెడ్డిపల్లి గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### మంత్రి పొన్నం ప్రభాకర్



**కోహెడ, ఆగస్టు 23 (జనంసాక్షి) :** మండలం లోని తంగళ్ళ పల్లి, శనిగరం, గుండారెడ్డిపల్లి, కూరెళ్ల, వెంకటేశ్వర పల్లి గ్రామాలలో ఆదివారం నిర్వహించిన "పల్లె పల్లెకు పొన్నం అన్న - పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షులు శెట్టి సుధాకర్ ఆధ్వర్యంలో మండలం లోని ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ప్రజల సమక్షంలో అధికా రులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సంద ర్భంగా 18 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన మహిళా సమైక్య భవనాన్ని మంత్రి ప్రారంభించారు. అలాగే రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను ప్రారంభించారు. నక్క తనూజ - విజయ్ కుమార్‌ల నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

**గుండారెడ్డిపల్లి ప్రగతి నివేదిక**

ప్రజా పాలన ప్రభుత్వంలో గ్రామంలో 16 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, రెండో దశలో మరిన్ని ఇళ్లు మంజూరు కానున్నాయి. 170 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని అధికారులు తెలిపారు. గృహజ్యోతి పథకం కింద 456 మంది లబ్ధిదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సబ్సిడీని 455 మంది లబ్ధిదారులకు అందిస్తున్నారు. గ్రామంలో 22 లక్షల 50 వేల తో సీసీ రోడ్లు పూర్తి చేయగా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 లక్షల రూపాయలతో ప్రహరీ గోడ నిర్మించారు. రైతులకు 2 కోట్ల 80 లక్షల రూపాయల రైతు రుణమాఫీ జరిగింది. రైతు బీమా కింద 9 మంది రైతు కుటుంబాలకు రూ.45 లక్షలు విడుదలయ్యాయి. 9 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు అందించడంతో పాటు రైతు భరోసా నిధులు విడుదలయ్యాయి. అలాగే అర్హులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు.

**గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు**

గుండారెడ్డిపల్లి సర్పంచ్ పిల్లి బాబు గ్రామ ప్రజల తరఫున తాగునీరు, ఓపెన్ జిమ్, ఆర్టీసీ బస్సు, ఐకేపీ భవనం, కోతుల సమస్య, ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్లు, వంతెన నిర్మాణం, విద్యుత్ పోల్స్ మార్పు, సాగునీరు, కమ్యూనిటీ హాళ్లు, బీటీ రోడ్డు, భూ సమస్యల తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలోనే అన్ని చర్యలు తీసుకోవాలని సంబందించిన శాఖ ల అధికారుల కు ఆదేశాలు జారి చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గ్రామానికి ఇప్పటికే అడగగానే రూ.15 లక్షలతో సీసీ రోడ్లు మంజూరు చేశామని, మరో రూ.40 లక్షలతో గ్రామంలో సంపూర్ణంగా సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు.

గౌరవెల్లి ప్రాజెక్టు ద్వారా త్వరలో సాగునీరు గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల భూసేకరణ ప్రక్రియ కొనసాగు తోందని, భూసేకరణకు సంబంధించిన నిధులు విడుదలయ్యా యని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. త్వరలోనే ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. బస్వాపూర్ బద్దిపడగ మీదుగా గుండారెడ్డిపల్లికి సాగునీరు, రంగనాయక సాగర్ నీటి సమస్యల పరిష్కారానికి సంబంధిత మంత్రితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు. తాగునీటి కోసం డెడికేటెడ్ లైన్ ఏర్పాటు కానుందని చెప్పారు. రైతులు ఆరుతడి పంటలు, ఆయిల్‌పామ్ సాగు పై దృష్టి పెట్టాలి ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని మంత్రి సూచించారు.

# పాలమూరు పల్లె జానపదం.. జల్లుమన్నది

### ఆడుదాం.. పాడుదాం కార్యక్రమం విజయవంతం

### ఉమ్మడి జిల్లా నుంచి తరలివచ్చిన 50మంది కళాకారులు



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 23 (జనంసాక్షి) :** వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎంఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన 'పాలమూరు పల్లె జానపదం-ఆడుదాం.. పాడుదాం' కార్యక్రమం ఘనంగా జరిగింది. అక్షయ్ రికార్డింగ్ స్టూడియో, పాలమూరు పల్లె జానపదం స్టూడియో ఆధ్వర్యంలో నిర్వాహకులు మీసాల రామన్న, చీర్ల నాగేంద్రం సాగర్, ఉందేకోటి కృష్ణయ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. కనుమరుగవుతున్న పల్లె పాటలను పరిరక్షించడంతో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లా కళాకారులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన సుమారు 50 మంది కళాకారులు పల్లె పాటలు, జానపద గీతాలు, సామాజిక గీతాలను ఆలపించి ప్రేక్షకులను అలరించారు. ఈ కార్యక్రమానికి జనజ్వాల ప్రజాకవి రాధాకృష్ణ, సీనియర్ రిపోర్టర్ మల్యాల బాలస్వామి ముఖ్య అతిథులుగా హాజరై కళాకారులను అభినందించారు. పల్లె సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే జానపద గీతాలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన కళాకారులు, ముఖ్యంగా మహిళలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు. జానపద పాటలతో ఫంక్షన్ హాల్ సందడిగా మారగా.. 'పాలమూరు పల్లె జానపదం' పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమం కళాకారుల్లో నూతనోత్సాహాన్ని నింపింది.

# రూ. 2.9 కోట్ల పరిహారం

### బాధిత కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి



**పెద్దవూర ఆగస్టు 23 (జనంసాక్షి) :** నల్గొండ జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దొంతిగూడెం గ్రామం పరిధిలోని కెమికల్ ఫ్యాక్టరీ (ఫార్మా కంపెనీ)లో సంభవించిన తీవ్ర రియాక్టర్ పేలుడు ఘటనలో నాగార్జునసాగర్ నియోజకవర్గానికి చెందిన కార్మికుడు ప్రాణాలు కోల్పోయారు. పెద్దవూర మండలం చిన్నగూడెం గ్రామానికి చెందిన చెన్ను నాగిరెడ్డి గారు ఈ ప్రమాదంలో అసువులు బాసారు. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన స్థానిక శాసనసభ్యులు గౌరవ శ్రీ కుందూరు జయవీర్ రెడ్డి గారు తక్షణమే స్పందించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయడమే లక్ష్యంగా ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి గారు ఫార్మా కంపెనీ యాజమాన్యం మరియు ప్రభుత్వ ఉన్నతాధికారులతో నిర్విరామంగా చర్చలు జరిపారు. అహర్నిశలు కృషి చేసి, కంపెనీ యాజమాన్యం ద్వారా బాధిత కుటుంబ సభ్యులకు రూ. 2.9 కోట్ల పరిహారాన్ని మంజూరు చేయించడంలో కీలక పాత్ర పోషించారు. అనంతరం చిన్నగూడెం గ్రామంలోని బాధితుని ఇంటికి నేరుగా వెళ్లి, చెన్ను నాగిరెడ్డి గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. తీవ్ర శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను చూసి చలించిపోయిన ఎమ్మెల్యే, వారిని ఆత్మీయంగా ఓదార్చారు. "మీ కుటుంబానికి ఎప్పుడు, ఏ ఆపద వచ్చినా మీ పెద్దన్నగా వెన్నుదన్నుగా నేనుంటాను" అని హామీ ఇస్తూ వారిలో కొండంత ధైర్యాన్ని నింపారు.




## ఈ టాటా ఈవీల డెలివరీకి అధిక వెయిటింగ్ టైమ్




**న్యూఢిల్లీ(జనంసాక్షి):**టాటా గ్రూప్‌నకు చెందిన కార్ల తయారీ సంస్థ టాటా మోటార్స్ దేశీయంగా పెట్రోల్, డీజిల్‌తో పాటు ఈవీలను విక్రయిస్తోంది. సంప్రదాయ ఇంధనంతో నడిచే కార్లకు తక్కువ వెయిటింగ్ టైమ్ కొనసాగుతుండగా.. ఈవీల డెలివరీకి మాత్రం అధిక సమయం పడుతోంది. కొన్ని రకాల వేరియంట్లకు గరిష్ఠంగా 24 వారాలు కూడా వెయిటింగ్ టైమ్ ఉంది. దేశీయంగా ఎలక్ట్రిక్ వాహనాలకు ఆదరణ పెరుగుతుండడంతో డెలివరీ ఆలస్యానికి కారణంగా తెలుస్తోంది.టాటా టియాగో మోడళ్లలో స్మార్ట్ 19, ప్యూర్+ 19 వేరియంట్లకు 18 నుంచి 24 వారాల వెయిటింగ్ పీరియడ్ కొనసాగుతోంది. ఇతర వేరియంట్లకు 4 నుంచి 6 వారాలు ఉంది. టాటా పంచ్ ఈవీ స్మార్ట్ 30 వేరియంట్‌కు 18 నుంచి 24 వారాలు; స్మార్ట్ 40కి 10 నుంచి 12 వారాలు; ఇతర వేరియంట్లకు 8 నుంచి 10 వారాల వెయిటింగ్ పీరియడ్ కొనసాగుతోంది. ఇటీవల విడుదలైన సియారా ఈవీలో ప్యూర్ 65 వేరియంట్‌కు 12 నుంచి 15 వారాలు, మిగతా వేరియంట్లకు 4 నుంచి 6 వారాల వెయిటింగ్ టైమ్ ఉంది.

### అమెరికాతో టిక్‌టాక్ రూ.3,800 కోట్ల సెటిల్‌మెంట్

**వాషింగ్టన్:** ప్రముఖ సోషల్ మీడియా వీడియో ప్లాట్‌ఫామ్ టిక్‌టాక్, అమెరికా న్యాయశాఖతో సెటిల్‌మెంట్ కుదుర్చుకుంది. పిల్లల ఆన్‌లైన్ ప్రైవసీ చట్టాలను ఉల్లంఘించిందంటూ 2024లో దాఖలైన దావాను ముగించేందుకు 400 మిలియన్ డాలర్ల చెల్లింపు ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందం ప్రకారం టిక్‌టాక్ తక్షణమే 300 మిలియన్ డాలర్లు చెల్లిం చనుంది. రెండో విడతగా టిక్‌టాక్ పూర్వ సంస్థ అయిన మ్యూజికల్.ఎల్‌వై పై గతంలో ఉన్న కన్సెంట్ డిక్రీ రద్దయిన తర్వాత మిగిలిన 100 మిలియన్ డాలర్లు చెల్లిస్తుంది. 'అమెరికాలో పిల్లలు, తల్లిదండ్రులకు ఈ సెటిల్‌మెంట్ గొప్ప విజయం. ఆన్‌లైన్‌లో పిల్లల భద్రతను కాపాడటం, వారి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించే సంస్థలు చట్టపరమైన బాధ్యతలను నెరవేర్చేలా చూడటమే మా ప్రాధాన్యత' అని అమెరికా అసోసియేట్ అటార్నీ జనరల్ స్టాన్లీ ఇ.ఉడ్‌వర్డ్ జూనియర్ పేర్కొన్నారు.అమెరికాలో చిల్డ్రన్స్ ఆన్‌లైన్ ప్రైవసీ ప్రొటెక్షన్ యాక్ట్ నిబంధనల ప్రకారం.. 13 ఏళ్లలోపు పిల్లల వ్యక్తిగత వివరాలను సేకరించే ముందు తల్లిదండ్రుల అనుమతి తీసుకోవడం తప్పనిసరి. టిక్‌టాక్, దాని చైనా మాతృసంస్థ బైట్‌డ్యాన్స్ సరైన సమ్మతి లేకుండా 13 ఏళ్లలోపు పిల్లల సమాచారాన్ని సేకరించాయని ఆరోపణలు వచ్చాయి.

# భారత్‌కు భారీగా వెనెజువెలా చమురు

### రోజుకు 4,44,000 బ్యారెళ్ల సరఫరా

**ఢిల్లీ:** అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు, హర్మూజ్ జలసంధి ద్వారా రవాణా అంతరాయాల నేపథ్యంలో లాటిన్ అమెరికా నుంచి చమురు దిగుమతులను పెంచుకోవడానికి భారత్ ప్రాధాన్యమిస్తోంది. ఈ క్రమంలోనే ఆగస్టులో వెనెజువెలా నుంచి భారత్‌కు ముడి చమురు దిగుమతులు గణనీయంగా పెరిగాయి. తద్వారా దక్షిణ అమెరికాకు చెందిన ఆ దేశం భారత్‌కు నాలుగో అతిపెద్ద సరఫరాదారుగా అవతరించింది. కెప్లర్ షిప్ ట్రాకింగ్ డేటా ప్రకారం.. ఆగస్టులో వెనెజువెలా నుంచి భారత ముడి చమురు దిగుమతులు గణనీయంగా పెరిగాయి. దీంతో భారత్‌కు వెనెజువెలా చమురు దిగుమతులు రోజుకు సుమారు 4,44,000 బ్యారెళ్లకు చేరాయి. తద్వారా ఇరాక్ (రోజుకు 1,18,000 బ్యారెళ్లు), అమెరికా (1,53,000 బ్యారెళ్లు)ను ఈ దేశం అధిగమించింది. సగానికి పైగా అక్కడి నుంచే: ఏప్రిల్‌లో దిగుమతులు పునఃప్రారంభమైనప్పటి నుంచి భారత్‌కు చమురు దిగుమతుల దేశాల్లో వెనెజువెలా స్థానం వేగంగా పెరిగింది. పశ్చిమాసియా దేశాల నుంచి సరఫరాకు అంతరాయాలు ఏర్పడిన తర్వాత భారత రిఫైనరీలు వెనెజువెలా, బ్రెజిల్, ఆఫ్రికా నుంచి



ముడి చమురు కొనుగోళ్లను పెంచాయి. అదే సమయంలో రష్యా చమురుపై ఆధారపడటాన్నీ కొనసాగించాయి. ఆగస్టులో రోజుకు దాదాపు 2 మిలియన్ బ్యారెళ్ల దిగుమతులతో భారత్‌కు రష్యా అగ్రగామి సరఫరాదారుగా కొనసాగుతోంది. జూన్-జులైలో రష్యా ముడి చమురు దిగుమతులు రోజుకు సుమారు 2.6 మిలియన్ బ్యారెళ్లుగా నమోదయ్యాయి. ఇది భారత్ మొత్తం ముడి చమురు వినియోగంలో సగానికి పైగానే ఉంటుంది. రక్షణ కవచంగానూ: అంతేకాకుండా పశ్చిమాసియా ప్రాంతం నుంచి సరఫరా మార్గాలకు కలిగే అంతరాయాలతో పడిన ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు ఇది ఒక రక్షణ కవచంగానూ పనిచేసింది. 'సాధ్యమైనంత మేర దేశీయంగా ఉత్పత్తిని పెంచడం, విదేశీ ముడి చమురు సరఫరాదార్లను, రవాణా మార్గాలను వైవిధ్యపర్చడం, వ్యూహాత్మక, వాణిజ్య నిల్వలను అభివృద్ధి చేయడం, గ్యాస్, బయో ఇంధనం, ఈవీలు, పునరుత్పాదక ఇంధనాల వంటి ప్రత్యామ్నాయాలను వేగవంతం చేయడం.. ఇలా పలు దిశల్లో ఒకేసారి భారత్ తన వ్యూహాలను అమలు చేస్తోంద'ని కెప్లర్ సీనియర్ మేనేజర్ సుమిత్ రిటోలియా అభిప్రాయపడ్డారు. అయితే గల్ఫ్ దేశాలతో పోలిస్తే భౌగోళికంగా వెనెజువెలా, పశ్చిమ ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలు భారత్‌కు దూరంగా ఉంటుండటంతో ప్రయాణ సమయంతో పాటు రిఫైనరీలకు రవాణా, బీమా ఖర్చుల భారం పెరుగుతోంది. అందువల్ల ప్రత్యామ్నాయ మార్కెట్లు భారత్‌కు అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతల వల్ల ఏర్పడే సరఫరా అంతరాయాల నుంచి కొంత మేర రక్షణ ఇవ్వొచ్చేమో కానీ, దేశ చమురు బిల్లును గణనీయంగా పెంచుతాయని రిటోలియా విశ్లేషించారు.

## చైనాలో 30 లక్షల టెస్లా కార్లు వెనక్కి

హాంకాంగ్: కార్ల డోర్ హ్యాండిల్స్‌కు సంబంధించిన భద్రతా సమస్యల కారణంగా విద్యుత్ కార్ల దిగ్గజం టెస్లా, ఇతర చైనీస్ విద్యుత్ కార్ల కంపెనీలు చైనాలో 40 లక్షలకు పైగా వాహనాలను వెనక్కి పిలుపిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. టెస్లా ఒక్కటే 29.8 లక్షల కార్లను రీకాల్ చేస్తోంది. ఇందులో మోడల్ 3, మోడల్ వై, మోడల్ ఎక్స్, మోడల్ ఎస్ కార్లు ఉన్నాయి. షియామి 3.90 లక్షల కార్లను, లీప్ మోటార్ 3.70 లక్షల కార్లను, గిలీ, ఎక్స్‌పెంగ్‌లు ఎంపిక చేసిన ఈవీ మోడళ్లను రీకాల్ చేస్తున్నాయి. టెస్లా సహా పలు కొత్త కార్లలో బాడీకి సమానంగా ఉండే ఎలక్ట్రానిక్ హిడెల్ లేదా ఫ్లష్ డోర్ హ్యాండిల్స్‌ను ఉపయోగిస్తున్నారు. తీవ్రమైన రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, కార్లలోని ఎలక్ట్రికల్ సిస్టమ్ విఫలమైతే.. ఈ డోర్ హ్యాండిల్స్ సరిగ్గా పనిచేయక లోపల ఉన్న ప్రయాణికులు బయటకు రాలేకపోవడం లేదా బయట ఉన్న రెస్క్యూ సిబ్బంది తలుపులు తెరిచి వారిని కాపాడలేకపోవడం వంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ సమస్య తీవ్రతను తగ్గించేందుకు టెస్లా వాహనాలకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లను అందించనుంది.



## ఐపీఓకొస్తున్న జెమిని ఎడిబుల్స్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఫ్రీడమ్, బీ రైట్, ఫస్ట్ క్లాస్, శ్రీ కృప వంటి బ్రాండ్ల యజమాని, హైదరాబాద్‌కు చెందిన జెమిని ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ (జీఈఎఫ్) పబ్లిక్ ఇష్యూ ద్వారా నిధులు సమీకరించేందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. ఈ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో ఉండనుంది. ప్రమోటర్లు అల్కా చౌధ్రీ, గోల్డెన్ అగ్రి ఇంటర్నేషనల్ ఎంటర్‌ప్రైజెస్ పీటీఈ లిమిటెడ్, పెట్టుబడి సంస్థలు బ్లాక్ రివర్ ఫుడ్ 2 పీటీఈ లిమిటెడ్, ఇన్వెస్ట్‌మెంట్ అండ్ కమర్షియల్ ఎంటర్‌ప్రైజ్ పీటీఈ లిమిటెడ్ ఓఎఫ్ఎస్ ద్వారా 4.11 కోట్ల వరకు ఈక్విటీ షేర్లను విక్రయించనున్నాయి. ఈ ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులు కంపెనీకి కాకుండా వీరికే వెళతాయి. ప్రతిపాదిత ఐపీఓ తర్వాత కంపెనీ షేర్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో నమోదు కానున్నాయి. మోతీలాల్ ఓస్వాల్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్, ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ సర్వీసెస్ ఈ ఐపీఓకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరించనున్నాయి. జీఈఎఫ్ బ్రాండెడ్ విపణిలో అతి పెద్ద సన్‌ఫ్లవర్ నూనె విక్రేతగా ఉంది. ఆదాయం పరంగా 2025-26లో మార్కెట్ వాటా 18% కలిగి ఉంది. సంస్థకు 1,600 మందికి పైగా డిస్ట్రిబ్యూటర్లు, 3 లక్షల రిటెయిల్ అవుట్‌లెట్లు, 60 వేర్‌హౌస్‌లు, స్టాక్ పాయింట్లు ఉన్నాయి. 2024-25లో రూ.10,755.95 కోట్ల ఆదాయం ఆర్జించింది

## ఇంధన భద్రతకు కొత్త ఎల్‌పీజీ పైప్‌లైన్‌లు

### రూ.7,000 కోట్లతో 1,800 కి.మీ. విస్తరణ

**ఢిల్లీ:** దేశంలో ఎల్‌పీజీ సరఫరా వ్యవస్థను కేంద్రం బలోపేతం చేస్తోంది. ఇందులో భాగంగా కొత్త ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్ విస్తరణకు తాజాగా పచ్చజెండా ఊపింది. రూ.7,000 కోట్లతో సుమారు 1,800 కిలోమీటర్ల మేర 3 కొత్త పైప్‌లైన్‌లను నిర్మించేందుకు సిద్ధమైంది. ఇందుకు పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ బోర్డు (పీఎన్‌జీఆర్‌బీ) ఆమోదం తెలిపింది. గెయిల్ ఇండియా ఈ పైప్‌లైన్‌ల నిర్మాణ బాధ్యతలను చేపట్టనుంది. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, కర్ణాటక, గోవా రాష్ట్రాల మీదుగా ఈ ప్రాజెక్టులను కేంద్రం నిర్మించనుంది.తెలంగాణ నుంచి మహారాష్ట్ర వరకు..: తెలంగాణలోని చర్లపల్లి నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ (556 కి.మీ.), ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీ నుంచి ఉత్తరాఖండ్‌లోని సితార్‌గంజ్ (611 కి.మీ.), మహారాష్ట్రలోని షిక్రాపుర్ నుంచి గోవా, కర్ణాటకలోని హుబ్లీ (663 కి.మీ.) వరకు ఈ ఎల్‌పీజీ పైప్‌లైన్‌లను విస్తరించనుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే మన దేశంలోని ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్ 7,700 కిలోమీటర్ల నుంచి 9,500 కిలోమీటర్లకు చేరుతుంది. ఈ ప్రాజెక్టుతో లాజిస్టిక్స్ వ్యయాలు, ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రమాదాలు కూడా తగ్గనున్నాయని కేంద్రం




వెల్లడించింది.మారిషస్‌తో భారత్ ఇంధన భాగస్వామ్యం: భారత్, మారిషస్‌లు అయిదేళ్ల ఒప్పందంతో తమ ఇంధన భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం, మారిషస్‌కు అవసరమైన పెట్రోల్, డీజిల్, విమాన ఇంధనం (ఏటీఎఫ్)ను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) పూర్తిగా సరఫరా చేయనుంది. దీంతో హిందూ మహాసముద్రంలో కీలక ఇంధన భద్రతా భాగస్వామిగా భారత్ పాత్ర మరింత బలోపేతం కానుంది.



### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 1,68,426 | ₹ 1,83,734 |
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,60,000

# ప్రపంచంలో రక్తపుటేరుల వాసన పసిగట్టే 'డాల్ఫిన్'..!

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఓ గని ప్రపంచ వ్యాప్తంగా యుద్ధ విశ్లేషకులు, వ్యూహకర్తలను ఆందోళనకు గురి చేస్తోంది. ఎందుకంటే.. అది తెరుచుకొని.. తవ్వకాలు మొదలుపెడితే ప్రపంచంలో ఏదో ఒక చోట భారీ యుద్ధం తప్పదు. ప్రపంచంలో అత్యంత వినాశకర యుద్ధాల వేళ ఈ గని తెరుచుకొంది. దీంతో ఇక్కడ కార్యకలాపాలు ఊపందుకుంటే ప్రపంచ శాంతికి విఘాతమే అని నమ్ముతారు. తాజాగా చాలా ఏళ్ల తర్వాత ఈ గని వద్ద కార్యకలాపాలు జోరందుకొన్నాయి. అదే ఆస్ట్రేలియా కింగ్ ఐలాండ్‌లోని 'ది డాల్ఫిన్ మైన్' . ఇది ప్రపంచంలోనే అత్యంత పెద్దది, లోతైన టంగ్‌స్టన్ గని అదే. సాధారణంగా టంగ్‌స్టన్ అత్యంత దృఢంగా ఉండే లోహం. దీంతో సాయుధ కవచాలు, వాటిని ఛేదించే ఆయుధాలను తయారు చేస్తుంటారు. నిరుడు శతాబ్దం నుంచి యుద్ధసమయాల్లో తెరిచి.. శాంతి వేళ మూసివేస్తున్నారు. మొదటిసారి 1917లో ఈ గనిని తెరిచారు. అప్పట్లో తొలి ప్రపంచ యుద్ధం తారాస్థాయికి చేరుకోవడంతో.. టంగ్‌స్టన్ అవసరాల నిమిత్తం దీనిని తెరిచారు. కానీ, మూడేళ్ల తర్వాత ఆ సమరం ముగియడంతో.. ఆ లోహ అవసరాలు గణనీయంగా తగ్గాయి. ఫలితంగా గనిలో కార్యకలాపాలు నిలిచిపోయాయి. మరో సారి రెండో ప్రపంచ యుద్ధాని కంటే ముందే 1938లో టంగ్‌స్టన్ డిమాండ్ పెరిగింది. ఫలితంగా డాల్ఫిన్ గని మళ్లీ తెరుచుకొంది. ఇక కొరియా యుద్ధం, వియత్నాం వార్ వేళ కూడా తెరుచుకొంది. ప్రచ్ఛన్న యుద్ధం వేళ సుదీర్ఘకాలం ఇక్కడ తవ్వకాలు జరిగాయి. 1989లో బెర్లిన్ గోడ కూలిన 12 నెలల్లోనే మళ్లీ మూసుకుపోయింది. దాదాపు 30 ఏళ్లగా పెద్దగా డిమాండ్ లేకపోవడంతో.. ఇక్కడి భారీ గోతులు నీటితో నిండిపోయాయి.



టంగ్‌స్టన్‌కు భారీ డిమాండ్..!

రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉక్రెయిన్‌పై దాడి ప్రకటించడానికి కొన్ని వారాల ముందు హఠాత్తుగా ఇక్కడ కార్యకలాపాలు జోరందుకొన్నాయి. యుద్ధాల కారణంగా పెరిగిన టంగ్‌స్టన్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా పెంచేందుకు శరవేగంగా కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఎట్టకేలకు ఈ ఏడాది సెప్టెంబర్‌లో అండర్‌గ్రౌండ్ ఓర్‌ను వెలికి తీసి ఎగుమతి చేయనున్నారు. మరోవైపు రేర్‌ఎర్త్ మినరల్స్ పోటీ కూడా ఆజ్యంపోసింది. దీంతో భారీ ధర చెల్లించి కూడా ఈ లోహం కొనుగోలు చేసేందుకు పోటీ నెలకొంది. ప్రపంచంలో అత్యధికంగా టంగ్‌స్టన్‌ను చైనా ఉత్పత్తి చేస్తుంది. తైవాన్‌ను ఆక్రమించేందుకు అది సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో సైనిక శక్తిని పెంచుకొంటోంది.మరోవైపు అమెరికా కూడా కజకిస్థాన్‌లోని అతిపెద్ద గనిపై 1.6 బిలియన్ డాలర్లు వెచ్చించేందుకు ఒప్పందం చేసుకొంది. అగ్రరాజ్య ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల్లో టంగ్‌స్టన్‌దే అత్యంత కీలక భూమిక. ఇరాన్‌తో యుద్ధం కారణంగా అమెరికా వద్ద ఆ లోహ నిల్వలు గణనీయంగా పడిపోయాయి. ఇక ఒక డ్రైమెట్రిక్ టన్ యూనిట్ (సుమారు 7.93 కిలోల) టంగ్‌స్టన్ లోహం ధర ప్రస్తుతం 2,800 డాలర్ల వరకు ఉంది. ఇక 2025 సంవత్సరం చివరికి వచ్చే కొద్దీ 350 డాలర్లుగా ఉన్న ధర.. ఈ ఏడాది జూన్ నాటికి ధర కొన్ని రెట్లు పెరిగి 2950 డాలర్లకు చేరింది. అమెరికాది వలసవాదమే.. ఇరాన్ మండిపాటు సాయుధ కవచాలను చీల్చుకెళ్లే తూటాలు, క్షిపణి విడిభాగాలు, రాకెట్ నాజిల్స్, రేడియేషన్ షీల్డ్‌లు వంటివి ఈ లోహంతో తయారవుతాయి. దీంతోపాటు హైస్పీడ్ కటింగ్ టూల్స్, సైనిక వాహనాల కవచాల్లో వినియోగిస్తారు.

## హోదాకు, జీతానికి పొంతనే లేదు

### ఎక్కువ మంది వృత్తి నిపుణుల అభిప్రాయమిదే

ముంబయి: తాము చేస్తున్న ఉద్యోగ హోదాలకు, అందుకుంటున్న జీతభత్యాలకు మధ్య పొంతన ఉండటం లేదని ఎక్కువ మంది వృత్తి నిపుణులు భావిస్తున్నట్లు ఒక నివేదిక తెలిపింది. ఇది కార్యాలయాల్లో గుర్తింపు, ప్రతిఫలాల మధ్య పెరుగుతున్న అంతరాన్ని సూచిస్తోందని పేర్కొంది. దేశవ్యాప్తంగా ఈ ఏడాది మే, జూన్‌లో 1,211 కంపెనీలు, 2,533 మంది ఉద్యోగుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా పై నివేదికను ఇండీడ్ రూపొందించింది. దీని ప్రకారంఉద్యోగ హోదా తమ జీతభత్యాలను ప్రతిబింబించడం లేదని ప్రతి 10 మంది వృత్తి నిపుణుల్లో ఆరుగురు వెల్లడించారు. అన్ని రంగాల్లోనూ వినడానికి బాగా ఉండే ఉద్యోగ హోదాలు సర్వసాధారణం అయ్యాయని 80 శాతం మంది తెలిపారు. తమ సహోద్యోగులు జీతంలో తగిన పెరుగుదల లేకుండా మరింత సీనియర్ హోదాలను పొందడాన్ని వాళ్లు గమనించినట్లు నివేదిక తెలిపింది. గత రెండేళ్లలో హోదాలో మార్పు పొందిన ప్రతి ముగ్గురు ఉద్యోగుల్లో దాదాపు ఒకరు జీతంలో ఎలాంటి పెరుగుదల లేదని లేదా 5 శాతం కంటే తక్కువ పెరుగుదల మాత్రమే ఉందని చెప్పారు.ఇతర కంపెనీల్లో కొత్త ఉద్యోగ అవకాశాన్ని పరిశీలిస్తున్నప్పుడు, మెరుగైన హోదా కంటే ఎక్కువ జీతాన్నే ఎంచుకుంటామని 52 శాతం మంది చెప్పారు. హోదాలు ఎంత గొప్పగా ఉన్నప్పటికీ.. జీతభత్యాలే కెరీర్ విలువను నిర్వచిస్తున్నాయనే విషయాన్ని ఇది తెలియజేస్తోంది. అయితే వృత్తినిపుణులు హోదాలను పూర్తిగా తోసిపుచ్చకపోవడం ఆశ్చర్యకర విషయం. ఎందుకంటే 70 శాతం మంది తమ హోదా భవిష్యత్ కెరీర్ అవకాశాలను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తుందని విశ్వసిస్తుండగా.. దాదాపు 73 శాతం మంది ఒక బలమైన హోదా తమను నియమించుకోవాలని అను కునే కంపెనీలు తమను చూసే విధానాన్ని మెరుగు పరు స్తుందని భావిస్తున్నారు. తమ హోదా ఉద్యోగ సం తృప్తిపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుంది

## బంగ్లాదేశ్‌లో ఘోరం.. టీచర్ ఫ్యామిలీ దారుణ హత్య

**ఢాకా:**బంగ్లాదేశ్‌లో దారుణం చోటుచేసుకుంది. విశ్రాంత హిందూ టీచర్ కుటుంబం హత్యకు గురైంది. తన ఇంటిపై డ్రగ్స్ తీసుకుంటుండడాన్ని ప్రశ్నించినందుకు దుండగులు అతన్ని చంపారు. ఈ సంఘటన రంగ్‌పుర్‌లో చోటుచేసుకుంది.పోలీస్ కమిషనర్ మహ్మద్ అబ్దుల్ వివరాలు వెల్లడించారు. గణపతి చక్రవర్తి (65) కొన్నేళ్ల క్రితం ప్రభుత్వ టీచర్‌గా రిటైర్డ్ అయి హోమియోపతి వైద్యాన్ని ప్రాక్టీస్ చేస్తున్నారు.ఈ క్రమంలో నాలుగేళ్ల క్రితం రంగ్‌పుర్‌లో కొత్త ఇంటిని నిర్మించుకుని భార్య ప్రీతిలత (50), కుమార్తె అగామీ (23), కుమారుడు ప్రియమ్ (12)తో కలిసి ఉంటున్నారు. చక్రవర్తి భార్య ప్రీతిలతకు ఆమె సోదరి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. మిగతా కుటుంబ సభ్యుల ఫోన్లు సైతం కలవకపోవడంతో ఆందోళనకు గురైన ఆమె పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు శనివారం రాత్రి తాళం వేసి ఉన్న ఆ ఇంటి తలుపులను పగలగొట్టి చూడగా నలుగురు హత్యకు గురై కనిపించారు. చక్రవర్తి మృతదేహం ఇంటి పైకప్పుపైన, భార్య, కుమార్తె మృతదేహాలు మెట్లపైన, కుమారుడి మృతదేహం ఇంట్లోని మంచం కింద లభ్యమయయాయి. గురువారం రాత్రి ఈ హత్యలు జరిగినట్లు పోలీస్ కమిషనర్ మహ్మద్ అబ్దుల్ తెలిపారు. ఇద్దరు దుండగులు డ్రగ్స్ తీసుకోవడానికి చక్రవర్తి ఇంటిపైకి వెళ్లారు. దాన్ని గమనించిన గణపతి వారిని ప్రశ్నించడంతో తమను గుర్తుపట్టారని, టవల్‌తో మెడకు చుట్టి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. ఈ క్రమంలో శబ్దం రావడంతో భార్య ప్రీతిలత పైకి వెళ్లగా ఆమెను సైతం గొంతునులిమి హత్య చేశారు. అనంతరం వారి పిల్లలను చంపారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు అనుమానితులను గుర్తించి విచారిస్తున్నట్లు తెలిపారు.



## ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి..

### ఒకరోజు ముందే యూట్యూబ్‌లో వీడియో పెట్టిన తల్లి

**ముంబై(జనంసాక్షి):**మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్ జిల్లాలో ఇటీవల ఐ ఫోన్ వివాదమై ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు ఒకరోజు ముందు యువకుడి తల్లి సంగీత తన యూట్యూబ్ ఛానల్‌లో పెట్టిన వీడియో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.మానవ సంబంధాలు, ప్రేమ విలువలను వీడియోలో వివరించారు. మన ప్రేమను విలువైనదిగా భావించే వ్యక్తికే మనస్ఫూర్తిగా ఏదైనా చేయాలని సూచించారు. విలువ ఇవ్వని వ్యక్తి కోసం ఎంత చేసినా ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. రెండు వైపులా కాలితేనే చపాతీ రుచిగా ఉంటుందంటూ కుటుంబ బంధాల ప్రాధాన్యాన్ని వివరించారు. తన యూట్యూబ్ ఛానల్‌లో తరచూ మోటివేషనల్ వీడియోలను పంచుకుంటూ ఉంటారు. ప్రస్తుతం ఆమె ఛానల్‌కు 29వేల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. తన కుమారుడితో కలిసి షార్ట్ వీడియోలను చేస్తుంటారు. ఆరేళ్ల కిందట పెద్ద కుమారుడు అనారోగ్యంతో మరణించిన సమయం నుంచి ఆమె తన భర్తకు దూరంగా ఉంటున్నారు. భర్తకు దూరం కావడానికి, కుటుంబంలో తలెత్తిన మనస్పర్థలకు ఆడపడుచుల ప్రవర్తనే కారణమని తీవ్ర ఆరోపణలు చేశారు. కునాల్ అనే యువకుడు ఐఫోన్ ఈఎంఐ డబ్బుల కోసం గొడవపడి కొండపై నుంచి దూకగా.. అతన్ని కాపాడే ప్రయత్నంలో తండ్రి మురళీధర్ లోయలో పడిపోయాడు. కళ్లెదుటే భర్త, కుమారుడు మృతి చెందడం తట్టుకోలేక.. సంగీత కూడా అదే కొండపై నుంచి దూకి ప్రాణాలు విడిచిన హృదయవిదారక ఘటన ఇటీవల తీవ్ర కలకలం రేపింది.



## అమాంతం పెరిగిన వివో, శాంసంగ్ స్మార్ట్‌ఫోన్ ధరలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రముఖ మొబైల్ కంపెనీలు మెమొరీ చిప్‌ల ధరలు పెరగడంతో తీవ్ర ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నాయి. శాంసంగ్ కంపెనీ తన ఎస్25 సిరీస్ ధరలను రూ.12 వేల వరకు పెంచింది. మరో కంపెనీ వివో ఇటీవల వై సిరీస్ ధరలను రూ 4 వేల వరకు పెంచగా.. తాజా టీ సిరీస్ స్మార్ట్‌ఫోన్ ధరలను ఏకంగా రూ. 7 వేల వరకు పెంపు చేపట్టింది. సవరించిన ధరలు వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వచ్చాయి.ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీ శాంసంగ్ మరోసారి ధరల పెంపు చేపట్టింది. గెలాక్సీ ఎస్25 సిరీస్‌లను రూ.12 వేల వరకు పెంపు చేపట్టింది. సవరించిన ధరలు నేటి నుంచే అమల్లోకి వచ్చాయి. 12జీబీ/256జీబీ వేరియంట్ ధర రూ.80,999 ఉండగా.. రూ. 4 వేలు పెంచింది. దీంతో రూ.84,999కు చేరింది. 12జీబీ/512జీబీ వేరియంట్ ధర రూ.92,999 నుంచి 1,03,999కు సవరించింది. గరిష్ఠంగా రూ.12 వేల పెంపు చేపట్టడం గమనార్హం. వివో టీ5 ప్రో స్మార్ట్‌ఫోన్ ధరలను రూ.7 వేల వరకు సవరించింది. 8జీబీ+128జీబీ బేస్ వేరియంట్ ధర రూ.6 వేలు పెరిగి రూ.41,999కు చేరింది.

## హైదరాబాద్‌లో ఇళ్ల విక్రయాల జోరు

### ఏప్రిల్-జూన్‌లో 15% వృద్ధి: ప్రాప్‌టైగర్

ఢిల్లీ: దేశంలో ప్రధాన మెట్రో నగరాల్లో స్థిరాస్తి మార్కెట్ మందగమనంలో ఉన్నప్పటికీ, హైదరాబాద్ మాత్రం దూకుడు కొనసాగిస్తోంది. దేశవ్యాప్తంగా అగ్రగామి 8 నగరాల్లో ఏప్రిల్-జూన్ మధ్య ఇళ్ల విక్రయాలు 6 శాతం తగ్గగా, హైదరాబాద్ మాత్రం 15% వృద్ధిని నమోదు చేసిందని స్థిరాస్తి బ్రోకరేజీ సంస్థ ప్రాప్‌టైగర్ తాజాగా విడుదల చేసిన 'రియల్ ఇన్‌సైట్' నివేదికలో పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్‌లో హైదరాబాద్‌లో 13,196 ఇళ్లు అమ్ముడయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో విక్రయాలు 11,513గా ఉన్నాయి.దేశంలోని 8 ప్రధాన నగరాల్లో ముంబయి, బెంగళూరు, దిల్లీ-ఎన్‌సీఆర్‌లో విక్రయాలు తగ్గగా, హైదరాబాద్, చెన్నై నగరాలు మాత్రం వృద్ధి సాధించాయి. దేశవ్యాప్తంగా విక్రయాలు 97,674 నుంచి 6% తగ్గి 91,729కు చేరాయి. పశ్చిమాసియా సంక్షోభం, ఉద్యోగాలపై కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావం పడుతుందనే ఆందోళనలతో కొనుగోలుదార్లు ఆచితూచి అడుగుల వేయడం వల్లే కొనుగోళ్లు నెమ్మదించినట్లు నివేదిక వెల్లడించింది.'స్థిరాస్తి మార్కెట్ బలహీనపడటం లేదు. పరిపక్వత సాధిస్తోంది. కొనుగోలుదార్లు నాణ్యమైన ఇళ్లను ఎంచుకుంటున్నారు. వరుసగా రెండు త్రైమాసికాలుగా సగటు ధరలు చదరపు అడుగుకు రూ.10,000 కంటే పైనే కొనసాగుతున్నాయి. రాబోయే పండగల సీజన్‌లో డెవలపర్లకు మంచి అవకాశాలు లభిస్తాయి' అని ప్రాప్‌టైగర్ సీఈఓ ప్రకాష్ తేజ్వానీ పేర్కొన్నారు.





## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య**

**మొయినాబాద్ ఆగస్టు 23 జనం సాక్షి :** అర్హులైన ప్రతి ఒక్కరు రాష్ట్ర ప్రభుత్వం అందించే అభివృద్ధి, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని చిన్నమంగళారం గ్రామాన్ని ఆయన పర్యటించి ప్రభుత్వం ద్వారా లబ్దిదారులైన ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకున్న ఇళ్లను సర్పంచ్ తలారి లక్ష్మిబాలయ్యతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రెండున్నర ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ద్వారా రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడంలో ప్రభుత్వం ద్వారా రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అర్హులైన లబ్ధిదారులందరూ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పేదల సొంతింటి కల సాకారం అవుతుందన్నారు. పేదోడు కలలు కంటున్న సొంత ఇంటి సాకారాన్ని ఇందిరమ్మ పథకంతో కాంగ్రెస్ ప్రభుత్వం నిజం చేస్తుందన్నారు. నాణ్యతతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తలారి లక్ష్మీబాలయ్య, మాజీ ఎంపీటీసీలు మల్లేష్, యాదయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు నాగులపల్లి రాములు, వార్డు సభ్యులు చేగూరి రత్నయ్య, భిక్షపతి, తలారి అనిత నర్సింహులు, గడ్డమీది యాదగిరి, మహ్మద్ షబ్బీర్, నాయకులు తలారి నరేష్, ఆలూరి నిర్మల రాములు పాల్గొన్నారు.

## డ్రైవర్ల సంక్షేమమే ధ్యేయంగా సరికొత్త యాప్ రూపకల్పన

**ఈజెడ్ మూవ్ సేవల ప్రారంభం**



**మల్కాజిగిరి ఆగస్టు 23 (జనంసాక్షి) :** నగరంలో సరుకు రవాణా సేవలను మరింత వేగవంతం, సులభతరం చేసేందుకు ఈజెడ్ మూవ్ సంస్థ సరికొత్త రవాణా యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్ ను సంస్థ డైరెక్టర్ ప్రశాంత్ కుమార్ మల్కాజిగిరిలోని జ్యోతి నగర్ కమ్యూనిటీ హాల్లో జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,

వినియోగదారులకు నాణ్యమైన సేవలందించడంతో పాటు, ప్రధానంగా డ్రైవర్ల సంక్షేమం, వారి ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా ఈ యాప్‌ను రూపొందించినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం డ్రైవర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా జరుగుతోందని, పూర్తిస్థాయి కస్టమర్ సేవలు సెప్టెంబర్ 1 నుంచి ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. సాంప్రదాయ కమీషన్ పద్ధతులకు స్వస్తి పలుకుతూ, డ్రైవర్ల కోసం అతి తక్కువ రీఛార్జ్ ప్లాన్‌లను ప్రవేశపెట్టామని అన్నారు. ప్రతి డ్రైవర్‌కు 5 లక్షల ప్రమాద బీమా, 2 లక్షల మెడికల్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామని వెల్లడించారు. రాత్రి వేళల్లో వచ్చే సర్ఛార్జ్ మొత్తం ఎలాంటి కోతలు లేకుండా నేరుగా డ్రైవర్‌కే అందుతుందన్నారు. అవుట్‌స్టేషన్, రాత్రి ప్రయాణాలకు డ్రైవర్లే స్వయంగా బిడ్డింగ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. దీనిపై సంస్థ ఎలాంటి రుసుము వసూలు చేయదు. కస్టమర్ లొకేషన్‌కు 4 నుంచి 10 కి.మీ వెళ్లిన తర్వాత రైడ్ క్యాన్సిల్ అయితే, ఆ డీజిల్ ఖర్చును సంస్థే భరిస్తుందని. టోల్ ఫీజులు, ఇతర పన్నులను నిబంధనల ప్రకారం కస్టమర్లే చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఈ సంస్థ పూర్తిగా సరుకు రవాణాకు మాత్రమే పరిమితం. టూ-వీలర్స్, 3-వీలర్ గూడ్స్ ఆటోలు, అలాగే 8, 9, 10 అడుగుల భారీ గూడ్స్ వాహనాలు ఇందులో అందుబాటులో ఉంటాయని, ప్యాసింజర్ వాహనాలకు ఇందులో అనుమతి లేదు. తొలి దశలో హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో ఈ సేవలను ప్రారంభిస్తున్నామని, త్వరలోనే దేశవ్యాప్తంగా కార్యకలాపాలు విస్తరిస్తామని యాజమాన్యం స్పష్టం చేశారు. ఆసక్తి గల డ్రైవర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబిత, విజయ్ కుమార్, మహేష్ కుమార్, ప్రవీణ్, మహేందర్ పెద్ద ఎత్తున ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

### ఆటో కార్మికుల సమస్యల

## పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధం

*చార్జీల పెంపుపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు*

- సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కేబినెట్ నిర్ణయం
- ఎలక్ట్రిక్ ఆటోగా మారితే రూ.1.50 లక్షల వరకు సాయం
- సమ్మెకు బదులు చర్చలతో సమస్యలు పరిష్కరించుకుందాం: పొన్నం

**హైదరాబాద్, ఆగస్టు 23 (జనం సాక్షి):** ఆటో కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కార్మికులు సమ్మెకు వెళ్లకుండా ప్రభుత్వంతో చర్చించి సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. 2012 తర్వాత ఆటో చార్జీలను పెంచలేదని, పెరిగిన ఇంధనం, వాహనాల ధరలు, నిర్వహణ వ్యయాలను పరిగణనలోకి తీసుకుని చార్జీల పెంపుపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. కమిటీలో ఆటో కార్మికుల ప్రతినిధులు, రవాణా శాఖ అధికారులు, సంబంధిత వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించి న్యాయమైన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఆటో కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించిందని, ఇందుకు సంబంధించిన విధివిధానాలను రూపొందించి త్వరలో బోర్డును ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గించడంతోపాటు కార్మికులపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చే రెట్రోఫిట్మెంట్‌ను ప్రోత్సహిస్తామని చెప్పారు. పాత ఆటోను స్క్రాప్ చేసి కొత్త ఎలక్ట్రిక్ ఆటో కొనుగోలు చేసేవారికి కూడా సహకరిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల ఆటో కార్మికుల సమస్యలను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. అర్హులైన కార్మికుల కుటుంబాలకు రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించిన విధంగానే ఆటో కార్మికుల సమస్యలపైనా చర్చించి పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు. సమ్మె ద్వారా కాకుండా చర్చల ద్వారానే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొంటూ, హుస్నాబాద్ నుంచి ఆటో కార్మికులు సమ్మెకు వెళ్లకుండా ప్రభుత్వంతో చర్చలకు సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

### మాదాపూర్ భవన కూల్చివేత ఘటనలో..

## టౌన్ ప్లానింగ్ అధికారి సస్పెన్షన్

- అనధికార నిర్మాణానికి అనుమతుల్లేవని నిర్ధారణ
- భవన నిర్మాణం నిలిపివేయడంలో నిర్లక్ష్యమే కారణం
- నిర్మాణదారులపై క్రిమినల్ కేసుకు సిఫారసు
- అనధికార నిర్మాణాలపై సమగ్ర తనిఖీలకు ఆదేశాలు

**శేరిలింగంపల్లి, ఆగస్టు 23 (జనం సాక్షి):** మాదాపూర్ సర్కిల్ పరిధిలోని అంజయ్యనగర్‌లో ఏడంతస్తుల భవనం కూలిన ఘటనకు సంబంధించి టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ అధికారి యు. సంతోష్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి. సృజన ఉత్తర్వులు జారీ చేశారు. అనధికార నిర్మాణాన్ని నిలిపివేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవడంలో అధికారి విఫలమయ్యారని, ఆయన నిర్లక్ష్యంతో ప్రజల భద్రతకు ముప్పు ఏర్పడటంతోపాటు ప్రాణనష్టం సంభవించిందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మాదాపూర్ సర్కిల్-50 పరిధిలోని అంజయ్యనగర్ పార్కుకు చెందిన సుమారు 50 గజాల స్థలాన్ని ఆక్రమించి గ్రౌండ్ ప్లస్ ఆరు అంతస్తులు, పెంట్‌హౌస్‌తో భవన నిర్మాణం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పటిష్టమైన పునాదులు లేకపోవడంతో శనివారం మధ్యాహ్నం భవనం ఒక్కసారిగా కూలిపోయి, పక్క భవనాలు కూడా దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా పలువురు గాయపడ్డారు.

టౌన్ ప్లానింగ్ నివేదిక ప్రకారం ఫరీన్ సిద్ధిఖ్, ఎం.డి. సాజిద్ అవసరమైన నిర్మాణ అనుమతులు పొందకుండా, నిర్ణీత సెట్‌బ్యాక్‌లు పాటించకుండా భవనాన్ని నిర్మించినట్లు తేలింది. అనధికార నిర్మాణంపై ఈ ఏడాది జూన్ 17న నోటీసులు జారీ చేసినప్పటికీ తదుపరి చర్యలు తీసుకోలేదని అధికారులు గుర్తించారు. నిర్మాణాన్ని నిలిపివేయడంలో విఫలమైన అధికారిపై తదుపరి క్రమశిక్షణ చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. భవన నిర్మాణానికి బాధ్యులైన ఫరీన్ సిద్ధిఖ్, ఎం.డి. సాజిద్, ఇతరులపై చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయాలని టౌన్ ప్లానింగ్ విభాగం రాయదుర్గం పోలీసులకు నివేదిక సమర్పించింది. ఘటన నేపథ్యంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో అనధికార నిర్మాణాలపై సమగ్ర తనిఖీలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలపై అవసరమైతే కూల్చివేతతోపాటు కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ నిర్మాణ నిబంధనల అమలును మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులను ఆదేశించారు.

## అందని పింఛన్.. ఆగని ఆవేదన!

**మూడేళ్లుగా ఆఫీసుల చుట్టూ పరుగులు... వైకల్యం శాపమైంది.. పింఛన్ భారమైంది!**

**దేవనూరు రైతు కన్నీటి గాథ - వికలాంగ పింఛన్ కోసం మూడేళ్ల నిరీక్షణ**



**తాండూరు అగస్టు 23(జనంసాక్షి) :** అంగవైకల్యంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వం నుంచి అందాల్సిన వికలాంగ పింఛన్ మాత్రం అందడం లేదని యాలాల మండలం దేవనూరు గ్రామానికి చెందిన రైతు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడు సంవత్సరాలుగా పింఛన్ కోసం మండల కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం,సదరం క్యాంపు చుట్టూ తిరిగి తిరిగి విసిగిపోయానని, అయినా ఫలితం లేదని వాపోయారు. ఈ సందర్భంగా దేవనూర్ గ్రామానికి చెందిన రైతు శ్రీనివాస్ మాట్లాడుతూ నాకు ఎడమ చెయి పని చేయదు, వ్యవసాయ పనులు కూడా సరిగా చేసుకోలేకపోతున్నాను. వికలాంగ పింఛన్ వస్తే కొంతైనా ఆసరాగా ఉంటుందని మూడేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్నా. సర్టిఫికెట్ ఉంది, అన్ని పత్రాలు ఇచ్చా. అయినా ఇప్పటివరకు పింఛన్ మంజూరు కాలేదు. ఆఫీసుకు వెళితే రేపు రా, ఎల్లుండి రా అంటున్నారు. నాలాంటి పేద రైతును అధికారులు ఆదుకోవాలని శ్రీనివాస్ కన్నీటి పర్యంతమయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తనకు వికలాంగ పింఛన్ మంజూరు చేసి పూర్తి న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణ పౌరుల బాధ్యత

**సహారా ఎస్టేట్‌లో '80 ఏళ్ల స్వాతంత్రం-పౌరుల హక్కులు'పై సెమినార్**

*రాజ్యాంగ హక్కులను కాపాడుకోవాలి : పరకాల ప్రభాకర్*

- ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత అవసరం
- ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది
- ప్రజలు చైతన్యంతో స్పందించాలి




**హయత్‌నగర్, ఆగస్టు 23 (జనం సాక్షి):** ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని రాజకీయ విశ్లేషకుడు, ఆర్థికవేత్త పరకాల ప్రభాకర్ అన్నారు. సహారా ఎస్టేట్‌లో '80 ఏళ్ల స్వాతంత్రం-పౌరుల హక్కులు' అంశంపై ఆదివారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు ఎన్. ఆదినారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రజల రక్షణ కోసం రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకున్నప్పటికీ పాలకవర్గాల చర్యలతో రాజ్యాంగ సంస్థలు బలహీనపడే పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నారు. పౌరుల హక్కులను క్రమంగా హరించే ప్రయత్నాలను అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సమస్యలను ప్రశ్నించి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన మీడియా సంస్థల్లో కార్పొరేట్ ప్రభావం పెరుగుతోందని, దీంతో పాలనలోని మంచి, చెడులు ప్రజలకు సమగ్రంగా తెలియని పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల వ్యవస్థపై అనుమానాలు, విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, విశ్వసనీయతను కాపాడాలని సూచించారు. ఓటరు జాబితాల సవరణలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని, అనర్హుల పేర్ల తొలగింపు పేరుతో అర్హుల హక్కులకు భంగం కలగకూడదన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, దాని పరిరక్షణలో ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరిచే ప్రయత్నాలను అడ్డుకునేందుకు ప్రజలు వ్యక్తులుగా, సంస్థలుగా ప్రజాస్వామ్యబద్ధంగా స్పందించాలని కోరారు. అనంతరం సహారా ఎస్టేట్ వాసులు, కాలనీ ప్రజలు లేవనెత్తిన పలు సమస్యలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నోముల సుదర్శన్‌రెడ్డి, రవీంద్ర శర్మ, డి.ఎ.ఎస్.వి. ప్రసాద్‌రావు, ఉమామహేశ్వరరావు, కామేష్‌బాబు, ఎస్.కే. జానీ, ఎన్. అంజయ్య, కీసరి నర్సిరెడ్డి, ఏబూసి నరసింహ, పృథ్వి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యానికి జనవిజ్ఞాన వేదిక అండ

**132వ నెల ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన**




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, (జనం సాక్షి):** ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన 132వ నెల ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చక్రిపురంలోని శ్రీ చక్రి విద్యానికేతన్ హైస్కూల్‌లో ఆదివారం కాప్రా, కీసర, మల్కాజిగిరి మండల కమిటీల ఆధ్వర్యంలో యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్ సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో వందలాది మంది ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల కరస్పాండెంట్ ములుగు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంక్షేమం కోసం జనవిజ్ఞాన వేదిక చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. బీపీ, షుగర్ వంటి జీవనశైలి వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే తీవ్ర సమస్యలను నివారించవచ్చన్నారు. రాష్ట్ర నాయకులు ఎం.శ్రీనివాస్, పి.నాగరాజు మాట్లాడుతూ ఆరోగ్య చైతన్యంతో పాటు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు సంస్థ కృషి చేస్తోందన్నారు. శిబిరంలో జనరల్ మెడిసిన్, గుండె, ఎముకలు-కీళ్ల సమస్యలకు సంబంధించిన పరీక్షలతో పాటు ఈసీజీ, దంత, కంటి పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి వైద్యులు సూచనలు అందించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తోట శ్రీనివాస్, కోశాధికారి జెన్నీ, నాయకులు, వైద్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 22ఏ జాబితాను వెంటనే రద్దు చేయాలి

**రద్దు చేయకపోతే అసెంబ్లీని స్తంభింపజేస్తాం.. సచివాలయాన్ని ముట్టడిస్తాం**

- 22ఏ బాధితులకు అండగా మాజీ మంత్రి హరీశ్‌రావు
- ప్రజల ఆస్తులను నిషేధిత జాబితాలో చేర్చడం సరికాదు
- భూభారతి పోర్టల్‌లో పూర్తి జాబితా పెట్టాలి
- 22ఏ పేరుతో కమీషన్ల వసూళ్లపై విచారణ జరపాలి
- బాధితుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుంది



**బోడుప్పల్, ఆగస్టు 23 (జనం సాక్షి):** బోడుప్పల్ పరిధిలోని తిరుమల మెడోస్, లక్ష్మీ గణపతి, హేమానగర్ కాలనీలను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. ప్రజల సొంత ఇళ్లను నిషేధిత జాబితాలో చేర్చి ఇబ్బందులకు గురిచేయడం సరికాదని, 22ఏ జాబితాను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బోడుప్పల్‌లో నిర్వహించిన 22ఏ బాధితుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై బాధితుల సమస్యలను తెలుసుకున్నారు. మధ్యతరగతి కుటుంబాలు జీవితాంతం కష్టపడి, అప్పులు చేసి నిర్మించుకున్న ఇళ్లు 22ఏ జాబితాలో ఉండటంతో బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదని, అవసరమైనప్పుడు ఆస్తులను విక్రయించుకోలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వ తప్పిదాలకు సామాన్య ప్రజలను బాధ్యులను చేయడం సరికాదని, నిషేధిత జాబితాలో చేర్చిన భూములను ప్రజలే దరఖాస్తులు చేసుకుని తొలగించుకునే పరిస్థితి ఉండకూడదని పేర్కొన్నారు. 22ఏ పేరుతో ప్రజలను భయాందోళనలకు గురిచేసి కమీషన్లు వసూలు చేసేందుకు దళారులు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యాప్తంగా పెద్ద ఎత్తున భూములను నిషేధిత జాబితాలో చేర్చారని, హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలు కూడా ఇందులో ఉన్నాయని అన్నారు. భూభారతి రిజిస్ట్రేషన్ పోర్టల్ నుంచి 22ఏ నిషేధిత జాబితా ఎందుకు తొలగించారో ప్రభుత్వం స్పష్టం చేయాలని, పూర్తి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. ప్రజల ఆస్తుల సమస్యను వెంటనే పరిష్కరించకపోతే రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని, అవసరమైతే అసెంబ్లీని స్తంభింపజేయడంతోపాటు సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రజల సొంత ఇళ్లను 22ఏ జాబితా నుంచి తొలగించే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి, మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం బోడుప్పల్ సర్కిల్‌లో నిర్వహించిన బోనాల పండుగ వేడుకల్లో హరీశ్‌రావు పాల్గొన్నారు.

## ప్రయాణికుల కోసం రూ.2.50 లక్షలతో బస్‌షెల్టర్

- శైలజ జ్ఞాపకార్థం సొంత నిధులతో నిర్మాణం
- బస్‌షెల్టర్‌ను ప్రారంభించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**మోమిన్‌పేట్, (జనంసాక్షి):** ప్రయాణికుల సౌకర్యార్థం స్వర్గీయ గడ్డం శైలజ జ్ఞాపకార్థం మోమిన్‌పేట మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో రూ. 2. 50 లక్షల సొంత నిధులతో నిర్మించిన బస్‌షెల్టర్‌ను తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదివారం ప్రారంభించారు. బస్‌షెల్టర్ నిర్మాణానికి ముందుకొచ్చిన మోమిన్‌పేట్ గ్రామ సర్పంచ్ సంధ్యా సుభాష్‌గౌడ్‌ను స్పీకర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత బస్టాండ్‌లో నీడ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో బస్‌షెల్టర్ నిర్మాణం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రజా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలకు మరింత మంది ముందుకు వస్తే గ్రామాల్లో ప్రజలకు అవసరమైన సౌకర్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి : మధుయాష్కి గౌడ్

*బి.ఎన్.రెడ్డి నగర్, సాహెబ్‌నగర్‌లో పలు పనులకు ప్రారంభోత్సవాలు*

- నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు
- మంచినీరు, డ్రైనేజీ, రహదారి సమస్యలకు పరిష్కారం
- వైదేహీనగర్‌లో సీనియర్ సిటిజన్ భవనం ప్రారంభం
- యోగా షెడ్, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు హామీ



**హయత్‌నగర్, ఆగస్టు 23 (జనం సాక్షి):** ఎల్బీనగర్ నియోజకవర్గంలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ అన్నారు. ఆదివారం బి.ఎన్.రెడ్డి నగర్, సాహెబ్‌నగర్ డివిజన్లలో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, సీనియర్ నాయకుడు ముద్దగోని రామ్మోహన్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు, నాయకులతో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరవుతున్నాయని, వాటితో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. సాహెబ్‌నగర్ శివారు కాలనీల్లో మంచినీరు, డ్రైనేజీ, రహదారుల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని, వర్షాకాలంలో తలెత్తుతున్న వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని చెప్పారు. బి.ఎన్.రెడ్డి నగర్‌లోని వైదేహీనగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన సీనియర్ సిటిజన్ భవనాన్ని, వెంకటేశ్వర కాలనీలో కాలనీ ముఖద్వారాన్ని, బృందావన్ మిడోస్, భవాని ఎన్‌క్లేవ్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను ప్రారంభించారు. అనంతరం వివేకానంద కాలనీ పార్కును పరిశీలించి మార్నింగ్ వాకర్స్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాడైన ఓపెన్ జిమ్ పరికరాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడంతోపాటు సీనియర్ సిటిజన్ల కోసం యోగా షెడ్ నిర్మించాలని వారు కోరగా, మధుయాష్కి గౌడ్ సానుకూలంగా స్పందించారు. పార్కులో పేరుకుపోయిన చెట్ల కొమ్మలు, వ్యర్థాలను తొలగించాలని సంబంధిత డిప్యూటీ కమిషనర్‌కు ఫోన్‌లో సూచించారు. కార్యక్రమంలో మకుటం సదాశివుడు, పర్వతి గణేష్‌రెడ్డి, రమేష్ నాయక్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, బాబా యాదవ్, దేరంగుల కృష్ణ, చంద్రకాంత్ గౌడ్, నారాయణ గౌడ్, సరస్వతి, వినయ్ పటేల్, కొత్త శ్రీధర్ గౌడ్, శశికాంత్, రాంబాబు, నందకిషోర్‌తోపాటు వివిధ కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యతే ప్రథమ ప్రాధాన్యం

*కాగ్నా వంతెన పగుళ్లపై పరిశీలించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి*

- దేవనూర్‌లో హైస్కూల్ నిర్మాణానికి హామీ
- టీపీసీసీ మైనారిటీ కన్వీనర్‌కు సన్మానం
- రక్షాబంధన్‌తో సోదరభావం పెంపొందాలి



**తాండూరు/యాలాల ఆగస్టు 23 (జనం సాక్షి):** గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనుల నాణ్యతపై సరైన శ్రద్ధ చూపలేదని, కమిషన్లపైనే ఎక్కువ దృష్టి పెట్టారని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం యాలాల మండలంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన కాగ్నా నదిపై నిర్మించిన వంతెనను పరిశీలించారు. వంతెనకు ఏడాదిలోనే రెండుసార్లు పగుళ్లు ఏర్పడటం గత పాలనలో నాణ్యతా ప్రమాణాలపై నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ వంతెనకు అవసరమైన మరమ్మతులు, నాణ్యతా ప్రమాణాలపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దేవనూర్‌లో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారుల ఇళ్లను ప్రారంభించారు. గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, పేదల సొంతింటి కలను ఇందిరమ్మ ఇళ్ల ద్వారా నెరవేరుస్తున్నామని చెప్పారు. గ్రామ సర్పంచ్ రేణుకాదేవి కిషన్‌రావు గ్రామంలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, శిథిలావస్థకు చేరిన హైస్కూల్ స్థానంలో నూతన భవనం నిర్మాణానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. అంగన్‌వాడీ భవనం అవసరాన్ని కూడా పరిశీలిస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా, టీపీసీసీ మైనారిటీ విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా నియమితులైన ఖలేద్ సైఫుల్లాను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. మైనారిటీ వర్గాల సమస్యల పరిష్కారానికి ఆయన చేస్తున్న కృషిని అభినందించారు. రాష్ట్రస్థాయి బాధ్యతలను సమర్థంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ నాయకత్వం, ఎమ్మెల్యేకు ఖలేద్ సైఫుల్లా కృతజ్ఞతలు తెలిపారు.

తాండూరు మల్‌రెడ్డిపల్లిలోని రాజయోగ కేంద్రంలో బ్రహ్మకుమారీ సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన రక్షాబంధన్ వేడుకల్లోనూ ఎమ్మెల్యే పాల్గొన్నారు. బ్రహ్మకుమారీ సోదరీమణులు ఆయనకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. రక్షాబంధన్ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయతలకు ప్రతీక అని మనోహర్‌రెడ్డి అన్నారు. సమాజంలో సోదరభావం, మానవతా విలువలు మరింత పెంపొందాలని ఆకాంక్షించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, మైనారిటీ నాయకులు, బ్రహ్మకుమారీ సమాజ ప్రతినిధులు పాల్గొన్నారు.





# మంథనిలో అధునాతన సెంట్రలైజ్డ్ కిచెన్

- 40,052 మంది విద్యార్థులకు నిత్యం పౌష్టికాహారం
- మూడు నియోజకవర్గాల్లోని 19 మండలాలకు భోజనం సరఫరా
- అత్యాధునిక యంత్రాలతో గంటల్లోనే వేల మందికి ఆహారం సిద్ధం
- మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా నేడు ప్రారంభం

**మంథని, ఆగస్టు 23 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల డ్రాప్‌అవుట్‌ను తగ్గించడంతోపాటు వారికి పౌష్టికాహారం అందించేందుకు మంథని గంగాపూర్‌లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం, హరే కృష్ణ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ అధునాతన వంటశాల ద్వారా పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాల్లోని 19 మండలాల పరిధిలో 694 ప్రభుత్వ పాఠశాలలు, 17 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 40,052 మంది విద్యార్థులకు నిత్యం భోజనం అందించనున్నారు. విద్యార్థులకు ప్రత్యేక వాహనాల ద్వారా పౌష్టికాహారం సరఫరా చేయనున్నారు. జూనియర్ కళాశాల విద్యార్థులకు భోజనంతోపాటు రోజువారీ డిన్నర్ కూడా అందించనున్నారు. ప్రైవేటు నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ఉదయం టిఫిన్ అందించే ఏర్పాట్లు చేశారు. వేలాది మందికి ఒకేసారి ఆహారం సిద్ధం చేసే సామర్థ్యంతో కిచెన్‌లో అధునాతన యంత్రాలను ఏర్పాటు చేశారు. గంటకు 5,400 ఇడ్లీలు, 2 వేల దోసెలు, 3 వేల పూరీలు తయారు చేసే ఆటోమేటిక్ యంత్రాలతోపాటు 15 నిమిషాల్లో వెయ్యి మందికి సరిపడా అన్నం తయారు చేసే రైస్ కుకింగ్ మెషీన్ అందుబాటులో ఉంది. పది గంటల్లో 5 వేల మందికి సరిపడా సాంబార్, కూరలు సిద్ధం చేసే వంట పరికరాలు, కూరగాయలు శుభ్రం చేసే కోసే యంత్రాలు, ఎలక్ట్రిక్ గ్రైండర్ యూనిట్, వాటర్ ప్లాంట్, సెంట్రల్ గ్యాస్ బ్యాంక్, ప్రత్యేక ప్యాకింగ్ ట్రేలు ఏర్పాటు చేశారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత, భద్రతను పర్యవేక్షించేందుకు ఫుడ్ ల్యాబ్‌ను కూడా ఏర్పాటు చేశారు. మంథని మార్కెట్ యార్డులో 8 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ సెంట్రలైజ్డ్ కిచెన్‌ను నిర్మించారు. మంథని నియోజకవర్గంలోని కాటారం, మహదేవపూర్, మల్హర్, ముత్తారం, చిట్యాల సహా పెద్దపల్లి జిల్లాలోని 19 మండలాలకు వాహనాల ద్వారా భోజనం సరఫరా చేయనున్నారు. కిచెన్ ఏర్పాటుకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవ చూపారు. ఈ నెల 24న మంత్రి శ్రీధర్‌బాబు చేతుల మీదుగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం కానుంది.

# మూడేళ్లుగా గ్రామ పంచాయతీ భవన నిర్మాణంలో జాప్యం

- ఫతేపూర్‌లో స్లాబ్ దశలోనే ఆగిపోయిన నిర్మాణం
- స్థానిక పాలనకు, ప్రజాసేవకు తీవ్ర ఆటంకం

**ఆర్మూర్,ఆగస్టు 22 (జనంసాక్షి):** పాలకులు,ప్రజా ప్రతినిధులు మారిన ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని గ్రామ పంచాయ తీలో అసంపూర్తిగా ఉన్న భవనం నిర్మాణమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తుంది. ఆర్మూర్ మండలం ఫతేపూర్ గ్రామంలో మూడేళ్లుగా గ్రామ పంచాయతీ భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడం వల్ల స్థానిక పాలన,ప్రజా సేవలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. ఇందువలన పాలకవర్గం సమావేశాలు నిర్వహించడానికి, ప్రజలకు సేవలు అందించడానికి సరైన వసతి లేక ప్రత్యామ్నాయలపై ఆధారపడుతున్నారు. గ్రామ పంచాయతీ భవనం లేక మహిళా భవనాన్ని వాడుకుంటున్నారు. మహిళా భవనంలోనే గ్రామ పంచాయతీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సేవలు, మహిళా సంఘ సమావేశాలు ఒకే భవనంలోనే నడుస్తున్నాయి. గ్రామపంచాయతీ కార్యాలయం లేక పంచాయతీ రికార్డుల భద్రతకు, అధికారుల రాకపోకలకు, ప్రజల సేవలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. పాత గ్రామపంచాయతీ భవనాన్ని 2023వ సంవత్సరంలో కూల్చివేశారు. అదే సమయంలో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి రూ.16 లక్షలు మంజూరైనాయి.సదరు కాంట్రాక్టర్ పిల్లర్లు,స్లాబ్ దశ వరకు నిర్మాణం జరిపాడు.మొత్తం 16 లక్షల రూపాయల్లో 11 లక్షల పైచిలుకు మొత్తానికి రికార్డులు చేయించి బిల్లులు తీసుకున్నాడు. మిగతా మొత్తం భవన నిర్మాణం పూర్తి కాకపోవడం, సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో మిగతా నిధులు ప్రభుత్వ ఖాతాకు తిరిగి వెళ్ళిపోయాయి. అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణానికి గోడల నిర్మాణం, ప్లాస్టరింగ్ కు సుమారు రూ.10 లక్షల పైనే నిధులు మంజూరైతేనే నిర్మాణం పూర్తవుతుంది.సంబంధిత అధికారులు,



జిల్లా కలెక్టర్ చొరవ చూపితే గ్రామపంచాయతీ భవనానికి నిధులు మంజూరు అవుతాయని గ్రామ ప్రజలు, సర్పంచ్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### గ్రామపంచాయతీ భవనాన్ని పూర్తి చేస్తాం
**ఏనుగు ప్రణుక నాగరాజ్**



అసంపూర్తిగా గ్రామపంచాయతీ భవన నిర్మాణం ఉండడం వాస్తవమే.నిధుల కొరత,గత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం అసంపూర్తి భవనానికి కారణమన్నారు. సర్పంచ్ హోదాలో గ్రామ ప్రజలకు మేలు చేస్తాను.ఎమ్మెల్యే,జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులకు గ్రామ పాలకవర్గం,ప్రజలతో కలిసి వినతిని అందిస్తాం. స్థానిక ఎమ్మెల్యే,జిల్లా ఇంచార్జీ నాయకుల చొరవతో రూ.5 నుండి 10 లక్షలు మంజూరు చేయించి అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తాం.

# కానిస్టేబుల్‌పై దాడి.. నిందితుడి అరెస్టు

**పోలీసులపై దాడి చేస్తే కఠిన చర్యలు: ఎస్ఐ**

**ధారూర్, ఆగస్టు 23 (జనం సాక్షి):** విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై దాడి చేసిన నిందితుడిని ధారూర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఎస్ఐ సున్నం రాఘవేందర్ ఆదివారం వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ధారూర్ మండలం కొండాపూర్ కలాన్ గ్రామానికి చెందిన గట్టేపల్లి లాలయ్య (35), తండ్రి అంతయ్య, గత బుధవారం రాత్రి మద్యం మత్తులో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ రామదాసుపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. నిందితుడి కోసం గాలింపు చేపట్టిన పోలీసులు ఆదివారం ఉదయం పీలారం గ్రామ శివారులోని పొలాల్లో అతడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిపై దాడి చేయడం, దురుసుగా ప్రవర్తించడం, విధులకు ఆటంకం కలిగించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఎస్ఐ సున్నం రాఘవేందర్ హెచ్చరించారు. ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# పేదల ఇళ్లు తొలగించకుండా రోడ్డు విస్తరణ చేపట్టాలి

- సీఎం, ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి: మధుయాష్కి
- 80 అడుగుల విస్తరణతో ఆస్తులు కోల్పోయే పరిస్థితి
- ప్రస్తుత 40 అడుగుల రహదారి అభివృద్ధి అవకాశాలపై పరిశీలన
- స్థానికులు ఆందోళన చెందొద్దు: కాంగ్రెస్ నేతలు



**హయత్‌నగర్, ఆగస్టు 23 (జనంసాక్షి):** సాహెబ్‌నగర్ నుంచి హయత్‌నగర్ వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణలో పేదల ఇళ్లు, ఆస్తులు కోల్పోకుండా ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ హామీ ఇచ్చారు. శనివారం సాహెబ్‌నగర్ ఓల్డ్ విలేజ్‌లో రోడ్డు విస్తరణ ప్రాంతాలను రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, సీనియర్ నాయకుడు ముద్దగోని రామ్మోహన్ గౌడ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. రోడ్డు విస్తరణతో ఇళ్లు కోల్పోయే పరిస్థితిని ఎదుర్కొంటున్న స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సుమారు 80 అడుగుల మేర రహదారి విస్తరణ చేపడితే తాతముత్తాతల కాలం నుంచి నివాసముంటున్న ఇళ్లు, ఆస్తులు కోల్పోవాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని మధుయాష్కిని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. హయత్‌నగర్‌లో పుట్టి పెరిగిన తనకు సాహెబ్‌నగర్ ప్రజలతో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ప్రజలు ఇళ్లు కోల్పోతే ఎదురయ్యే ఇబ్బందులు తనకు తెలుసని, అందుకే క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. అధికారులు కార్యాలయాల్లో కూర్చొని నిర్ణయాలు తీసుకోకుండా ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. పేదలెవరూ ఇళ్లు కోల్పోకుండా ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులతో చర్చిస్తానని, ప్రస్తుత 40 అడుగుల రహదారిని అవసరానికి అనుగుణంగా అభివృద్ధి చేసే ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించి ఆస్తులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని చెప్పారు. మల్‌రెడ్డి రాంరెడ్డి, ముద్దగోని రామ్మోహన్ గౌడ్ మాట్లాడుతూ సాహెబ్‌నగర్ అంబేద్కర్ చౌరస్తా నుంచి రెండు వైపులా చేపట్టనున్న రోడ్డు విస్తరణతో స్థానికులు నష్టపోయే అవకాశం ఉందని తెలిపారు. సమస్యను ముఖ్యమంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్దగోని లక్ష్మీప్రసన్న, మకుటం సదాశివుడు, రమేష్ నాయక్, పర్వతి గణేష్‌రెడ్డి, ముద్దగోని సురేష్‌గౌడ్, చంద్రకాంత్‌గౌడ్, నారాయణగౌడ్, సరస్వతి, వినయ్ పటేల్, నగేష్‌గౌడ్, కొత్త శ్రీధర్‌గౌడ్, శశికాంత్, రాంబాబు, నందకిషోర్ పాల్గొన్నారు.



# ఆలయ భూముల పరిరక్షణకు అఖిలపక్షం రిలే నిరాహార దీక్ష

- 14.10 ఎకరాల భూమికి సర్వే చేసి హద్దులు నిర్ణయించాలి
- దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసుకునే వరకు పోరాటం
- హైకోర్టు ఆదేశాలు అమలు చేయకపోతే ఆందోళన ఉధృతం
- అధికారులు స్పందించకుంటే న్యాయపోరాటం తప్పదు

**నిజాంపేట్, ఆగస్టు 23 (జనం సాక్షి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్టలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన 14 ఎకరాల 10 గుంటల భూమిని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం జగద్గిరిగుట్ట చివరి బస్టాండ్ వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఏసురత్నం దీక్షలను ప్రారంభించగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, జనసేన అధికార ప్రతినిధి సతీష్, బీజేపీ నాయకుడు మాధవులు, టీజేఎస్ నాయకుడు ఎర్రవీరన్న, కార్మిక నాయకుడు దుర్గయ్య తదితరులు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆలయ భూములకు వెంటనే సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించి దేవాదాయ శాఖ ఆధీనంలోకి తీసు కునే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం 12 వారాల్లో సర్వే పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గత నెల రోజులుగా తహసీల్దార్, కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేకపోవడం విచారకరమన్నారు. మరో వారం రోజుల్లో సర్వే నిర్వహించకపోతే అధికారుల తీరుపై న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఆలయ భూముల పరిరక్షణ కోసం ప్రజలను చైతన్యవంతం చేసి, కలిసి వచ్చే అన్ని వర్గాలతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు సీపీఐ, జనసేన, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య..

**గంభీరావుపేట, జనంసాక్షి:** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ముస్తఫా నగర్ గ్రామంలో అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ముస్తఫా నగర్ గ్రామానికి చెందిన చిలుక లింగం (50), తండ్రి గాలయ్య, అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

# రిజర్వేషన్లను ప్రశ్నించే ముందు అసమానతలను ప్రశ్నించాలి

- రిజర్వేషన్లు రాజ్యాంగం కల్పించిన హక్కు: శంకర్ మాదిగ
- కుల వివక్ష తొలగకముందే రిజర్వేషన్ల రద్దు ఎలా సాధ్యం?
- దళిత యువతకందుతున్న సంక్షేమంపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- రిజర్వేషన్ వ్యతిరేక శక్తులపై ఉద్యమిస్తాం



**జమ్మికుంట, ఆగస్టు 23 (జనంసాక్షి):** దేశంలో కుల వివక్ష, సామాజిక అసమానతలు పూర్తిగా తొలగకముందే రిజర్వేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేయడం సామాజిక న్యాయాన్ని తిరస్కరించడమేనని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్ మాదిగ అన్నారు. ఆదివారం జమ్మికుంటలో నిర్వహించిన మాదిగ హక్కుల దండోరా జిల్లా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఇటీవల జరిగిన రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలను ప్రస్తావిస్తూ.. కుల వివక్ష కొనసాగుతున్న పరిస్థితుల్లో రిజర్వేషన్లను ప్రశ్నించడం సమంజసం కాదన్నారు. రిజర్వేషన్లు ఎవరి దయాదాక్షిణ్యాలతో వచ్చినవి కావని, రాజ్యాంగం కల్పించిన హక్కు అని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలపై జరుగుతున్న సామాజిక అసమానతలను తొలగించకుండా రిజర్వేషన్లను తొలగించాలని కోరడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. సామాజిక న్యాయానికి విఘాతం కలిగించే ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు సంఘటితంగా ఉండాలని పిలుపునిచ్చారు. పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి, ఆర్థిక భద్రత కల్పించడంలో ప్రభుత్వాలు మరింత బాధ్యత వహించాలని అన్నారు. తెలంగాణలో దళితుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఎన్ని సబ్సిడీ రుణాలు మంజూరు చేసింది, ఎంతమంది యువతకు స్వయం ఉపాధి కల్పించింది, ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి, ఎంత నిధులు విడుదల చేశారనే వివరాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ వ్యతిరేక శక్తులకు వ్యతిరేకంగా తెలంగాణ నుంచి పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని శంకర్ మాదిగ ప్రకటించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రేణికుంట్ల కుమారస్వామి మాదిగ, రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి శ్రీనివాస్ మాదిగ, హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి దొడ్డే రాజేందర్ ప్రసాద్ మాదిగ, మోతె స్వామి మాదిగ, కొలుగూరి విజయ్‌కుమార్ మాదిగ, స్వామిదాస్ మాదిగ, దొడ్డే రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**బోధన్, ఆగస్టు 23 (జనంసాక్షి) :** ఈ నెల 22వ తేదీన సాయంత్రం 5 గం.ల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బోధన్ కి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్ పై నిజామాబాద్ నుంచి బోధన్ వస్తున్న సమయంలో ఆటోనగర్ 63 దాబా దగ్గర నిజామాబాద్ నుంచి వెనుక నుంచి ఒక కారు టీఎస్ 16 ఈఎన్ 9209 అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ బైక్‌ను గుద్దగా, బైక్ మీద వస్తున్న వారికి తీవ్ర గాయాలు అయ్యాయి. అయితే వారిని చికిత్స కోసం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వెల్నెస్ ఆసుపత్రికి తరలించారు. కాగా అందులో రెంజల్ బేస్‌కి చెందిన మహమ్మద్ కాశిఫ్ షహీమ్ (26) అనే యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు సిఐ వివరించా రు. అలాగే రాకసపేట్ కు చెందిన గుఫ్రాన్ అనే యువకుడు చికిత్స పొందుతున్నట్లు సిఐ తెలిపారు.

# పేదల సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**



**యాలాల ఆగస్టు 23 (జనంసాక్షి):** పేదల సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం యాలాల మండలం దేవనూరు దుబ్బ తండాలో ఇందిరమ్మ ఇళ్ల ఇనాగ్రేషన్ కార్యక్రమం ఎంతో కోలాహలంగా, కన్నుల పండుగగా జరిగింది. తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.యాలాల్ మండలం దుబ్బతండా లో శాంతి భాయ్ హరిచందర్ మరియు అనిత బాలు నాయక్ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ళు, దేవనూర్ గ్రామంలో ఉమామహేశ్వరి మోనచారి నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు, అక్కంపల్లి గ్రామంలో బుడిగేజంగం మంగమ్మ సందీప్ నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ పూజ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి నిరుపేద కుటుంబానికి న్యాయం జరుగుతుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి దశల వారీగా ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. దుబ్బ తండా గిరిజన కుటుంబాలు తమకు ఇళ్లు మంజూరు కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు, పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జీవో 97ను రద్దు చేయాల్సిందే.. లేదంటే పోరాటం తప్పదు



**కరీంనగర్ టౌన్ ఆగస్టు 23 (జనంసాక్షి) :**
పాలిటెక్నిక్ విద్యా విధానంలో మార్పులు తీసుకువచ్చే జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మాడల్ గురుకుల పాలిటెక్నిక్ మహిళా కళాశాలను సందర్శించిన ఆయన విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

జీవో 97 అమలుతో తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని విద్యార్థినులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా పాలిటెక్నిక్ అనంతరం ఈసెట్ (ఈసెట్) ద్వారా ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందే అవకాశం కోల్పోతామని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్య దూరమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే నిర్ణయాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరారు. పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంలో మంచి నైపుణ్యంతో ఇంజనీరింగ్‌లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. కొత్త విధానాల పేరుతో పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటీకరించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జీవో 97ను బేషరతుగా రద్దు చేయాలని, లేకపోతే విద్యార్థులతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తి ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి జీవో 97 రద్దు చేయాలని నినాదాలు చేశారు.కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, శాతవాహన యూనివర్సిటీ బీఆర్ఎస్వీ ఇన్‌చార్జి చుక్క శ్రీనివాస్, నాయకులు గంగాధర చందు, మొగిలోజు వెంకట్, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పవర్లూమ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- వర్కర్ టు ఓనర్ పథకాన్ని వెంటనే అమలు చేయాలి
- 10 హెచ్‌పీల వరకు ఉచిత విద్యుత్ అందించాలి
- కార్మికుల కోసం ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి
- సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం



సిరిసిల్ల టౌన్, ఆగస్టు 23 (జనంసాక్షి): టెక్స్‌టైల్, పవర్లూమ్ పరిశ్రమల అభివృద్ధితోపాటు కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సీఐటీయూ అఖిల భారత కార్యదర్శి కామ్రేడ్ కరుమలయన్, మాజీ ఎమ్మెల్సీ కామ్రేడ్ చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. ఆదివారం సిరిసిల్లలోని గాజుల మల్లయ్య ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సీఐటీయూ టెక్స్‌టైల్, పవర్లూమ్ జాతీయ సమావేశాల సందర్భంగా జరిగిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. వ్యవసాయం తర్వాత అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న టెక్స్‌టైల్, పవర్లూమ్ రంగానికి కేంద్ర ప్రభుత్వం తగిన నిధులు కేటాయించకపోవడంతో పరిశ్రమలు, కార్మికుల ఉపాధిపై ప్రభావం పడుతోందని విమర్శించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కూడా కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. సిరిసిల్ల పవర్లూమ్ పరిశ్రమకు ప్రధాన కేంద్రంగా ఉన్నప్పటికీ కార్మికులకు సంబంధించిన వర్కర్ టు ఓనర్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని అన్నారు. పథకాన్ని తక్షణమే అమలు చేయడంతోపాటు పవర్లూమ్ పరిశ్రమకు 10 హెచ్‌పీల వరకు ఉచిత విద్యుత్ అందించాలని, కార్మికుల కోసం ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే సీఐటీయూ టెక్స్‌టైల్ అఖిల భారత కమిటీ, తెలంగాణ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్మికులంతా భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ తెలంగాణ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్, వివిధ రాష్ట్రాల నాయకులు చంద్రన్, సునీల్ చౌహాన్, అశోకన్, పెరుమాళ్, తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళి, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు సోమన్న, జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, కార్యదర్శి కోడం రమణతో పాటు పవర్లూమ్ యూనియన్ నాయకులు, కార్మికులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జమ్మికుంటలో అరుదైన హైడాటిడ్ సిస్ట్ శస్త్రచికిత్స

- ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ జనరల్ సర్జన్ డాక్టర్ మహిపాల్



**జమ్మికుంట, ఆగస్టు 23 (జనం సాక్షి):** జమ్మికుంట పట్టణంలో అరుదైన, క్లిష్టమైన శస్త్రచికిత్సను ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో జనరల్ సర్జన్ డాక్టర్ మహిపాల్ విజయవంతంగా నిర్వహించారు.సిరిసేడు గ్రామానికి చెందిన 70 ఏళ్ల రైతు 16 సంవత్సరాల క్రితం హనుమకొండలోని ప్రముఖ ఆసుపత్రిలో కాలేయంలోని హైడాటిడ్ సిస్ట్‌ల తొలగింపునకు లాపరోటమీ శస్త్రచికిత్స చేయించుకున్నారు.ప్రస్తుతం ఆయనకు కాలేయంతో పాటు పొత్తికడుపులోని పెరిటోనియం ప్రాంతానికి కూడా హైడాటిడ్ వ్యాధి విస్తరించింది. రోగికి ఆపరేషన్ చేయడానికి దాదాపు 8 ఆసుపత్రులు నిరాకరించడంతో కుటుంబ సభ్యులు చివరకు జమ్మికుంటలోని ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఆశ్రయించారు.రోగిని పరీక్షించిన డాక్టర్ మహిపాల్ కాలేయంలో సుమారు 12 హైడాటిడ్ పరాన్నజీవి తిత్తులు ఉన్నట్లు గుర్తించారు.పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి ఎక్స్‌ప్లోరేటరీ లాపరోటమీ ద్వారా శస్త్రచికిత్స చేయాలని రోగి బంధువులకు వివరించారు. శస్త్రచికిత్స సమయంలో కాలేయం,పొత్తికడుపు ప్రాంతంలో ఉన్న హైడాటిడ్ తిత్తులను, వాటి గోడలను జాగ్రత్తగా తొలగించారు. తిత్తుల్లోని పరాన్నజీవులు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా ఉండేందుకు ప్రత్యేకమైన స్కోలిసైడల్ ఏజెంట్ ఉపయోగించారు. క్లిష్టమైన పరిస్థితుల్లో డాక్టర్ మహిపాల్ తన అనుభవాన్ని ఉపయోగించి శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. అరుదైన,అధిక వ్యయంతో కూడుకున్న ఈ శస్త్రచికిత్సను అతి తక్కువ ఖర్చుతో విజయవంతంగా నిర్వహించడంపై రోగి కుటుంబ సభ్యులు డాక్టర్ మహిపాల్ ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.
గ్రామీణ ప్రాంతాల్లో కూడా క్లిష్టమైన,అరుదైన శస్త్రచికిత్సలను అనుభవజ్ఞులైన వైద్యుల ఆధ్వర్యంలో అందుబాటులోకి తీసుకురావడం ద్వారా స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి.

# రూ.66 కోట్ల ధాన్యం పక్కదారి!

- మూడు మిల్లుల్లో భారీ గోల్‌మాల్.. ప్రభుత్వానికి కోట్ల బకాయిలు
- మూడు రైస్‌మిల్లుల్లో తనిఖీలతో వెలుగులోకి భారీ అక్రమాలు
- మిల్లర్లపై కేసులు నమోదు.. పరారీలో యజమానులు
- నిందితుల కోసం పోలీసుల గాలింపు



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 23 (జనంసాక్షి) :** ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా రూ.66 కోట్ల విలువైన ధాన్యం మూడు రైస్‌మిల్లుల్లో పక్కదారి పట్టినట్లు అధికారులు గుర్తించారు. వనపర్తి జిల్లాలోని ఖిల్లాఘనపురం, వనపర్తి మండలాల్లోని మూడు రైస్‌మిల్లులపై రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా సీఎంఆర్ ధాన్యాన్ని పక్కదారి పట్టించినట్లు గుర్తించిన అధికారులు.. ప్రభుత్వానికి చెల్లించాల్సిన కోట్లాది రూపాయల బకాయిలపై చర్యలకు ఉపక్రమించారు. మిల్లర్లపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసులు నమోదయ్యాయి. విషయం తెలుసుకున్న మిల్లుల యజమానులు ఫోన్లు స్విచ్‌ఆఫ్ చేసి పరారైనట్లు సమాచారం. వారిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు గాలింపు చేపట్టారు.

### రూ.52 కోట్ల ధాన్యం తేడా

ఖిల్లాఘనపురం మండలం అన్‌పహాడ్ గ్రామ శివారులోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వర (బాయిల్డ్) రైస్‌మిల్, శ్రీ లక్ష్మి వెంకటేశ్వర (రా) రైస్‌మిల్లులకు 2022-23 రబీ, 2024-25 రబీ, 2025-26 ఖరీఫ్, రబీ సీజన్లకు ప్రభుత్వం సీఎంఆర్ ధాన్యం కేటాయించింది. ధాన్యం పక్కదారి పట్టిందన్న సమాచారంతో రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు ఈ నెల 21న అర్ధరాత్రి వరకు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో బాయిల్డ్ మిల్లులో 43,093 మెట్రిక్ టన్నులు, రా మిల్లులో 43,113 మెట్రిక్ టన్నుల ధాన్యం తేడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ రెండు మిల్లుల్లో కలిపి దాదాపు రూ.52 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి పట్టినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం.

### మరో మిల్లులో రూ.14 కోట్ల తేడా

వనపర్తి మండలం పెద్దగూడెం శివారులోని భాగ్యలక్ష్మి ఆగ్రో ఇండస్ట్రీస్ మిల్లుకు రబీ 2022-23, ఖరీఫ్ 2023-24, ఖరీఫ్ 2024-25, రబీ 2024-25 సీజన్లకు ప్రభుత్వం ధాన్యం కేటాయించింది. అయితే తనిఖీల్లో 1,03,722 సంచుల ధాన్యం తేడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.14 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. తనిఖీల అనంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పూర్తి నివేదికను వనపర్తి జిల్లా సివిల్ సప్లై మేనేజర్‌కు అందజేశారు. జిల్లా సివిల్ సప్లై డీఎం ఆంజనేయులు శనివారం వనపర్తి రూరల్, ఖిల్లాఘనపురం పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసులు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకునేందుకు మిల్లులు, వారి నివాసాల వద్దకు వెళ్లారు. అయితే అప్పటికే విషయం తెలుసుకున్న మిల్లర్లు ఫోన్లు స్విచ్‌ఆఫ్ చేసి పరారైనట్లు సమాచారం.

### తలక్రమాల కోసమే మిల్లుల ఏర్పాటా?

జిల్లాలో కొందరు వ్యాపారులు మిల్లుల యాజమాన్యాలతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడేందుకే కొత్తగా రైస్‌మిల్లులను ఏర్పాటు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తక్కువ పెట్టుబడితో మిల్లులు ఏర్పాటు చేసి, భారీ మొత్తంలో సీఎంఆర్ ధాన్యం తీసుకుని బియ్యం తిరిగి ప్రభుత్వానికి ఇవ్వకుండా కోట్లాది రూపాయలు ఎగవేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అధికారులు మిల్లులను సీజ్ చేసినప్పటికీ కొందరు యజమానులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మిల్లు విలువ కంటే పక్కదారి పట్టిన ధాన్యం విలువ అనేక రెట్లు అధికంగా ఉండటంతో అక్రమాలకు పాల్పడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీఎంఆర్ ధాన్యం కేటాయించే సమయంలో మిల్లుల నుంచి 10 శాతం బ్యాంకు గ్యారంటీ తీసుకోవాల్సిన నిబంధన ఉన్నప్పటికీ.. కొత్తగా ఏర్పాటు చేసిన మిల్లులకు ధాన్యం కేటాయింపుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొంతమంది అధికారులు మిల్లర్లతో కుమ్మక్కవుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి, ప్రభుత్వ ధాన్యం పక్కదారి పట్టిన వ్యవహారంపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## ప్రజా విశ్వాసమే లక్ష్యం..

# మూలసూత్రాలే జర్నలిజానికి బలం

- ప్రజల నమ్మకం కోసం క్షేత్రస్థాయి, పరిశోధనాత్మక జర్నలిజానికి పెద్దపీట
- మీడియా స్వీయ నియంత్రణ బలోపేతం కావాలి : ఎన్. రామ్
- జర్నలిస్టుల హక్కులు, భద్రతకు సమిష్టి పోరాటం అవసరం
- 'హైదరాబాద్ డిక్లరేషన్'కు ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ఆమోదం



**హైదరాబాద్, ఆగస్టు 23 (జనం సాక్షి) :** ప్రజల్లో మీడియాపై విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు జర్నలిజం తన మూల సూత్రాలైన క్షేత్రస్థాయి రిపోర్టింగ్, పరిశోధనాత్మక జర్నలిజం, సుదీర్ఘ కథనాలు, వివరణాత్మక విశ్లేషణకు తిరిగి రావాలని ది హిందూ గ్రూప్ డైరెక్టర్, ప్రముఖ జర్నలిస్ట్ ఎన్. రామ్ అన్నారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ జాతీయ సదస్సులో భాగంగా నిర్వహించిన ప్యానెల్ చర్చలో ఆయన మాట్లాడారు.

### స్వీయ నియంత్రణ అవసరం

మీడియా సంస్థలు స్వీయ నియంత్రణ వ్యవస్థలను బలోపేతం చేయడంతో పాటు జర్నలిస్టులకు పారదర్శక ప్రవర్తనా నియమావళిని అమలు చేయాలని ఎన్. రామ్ సూచించారు. పాఠశాల స్థాయి నుంచే మీడియా అక్షరాస్యతను పెంపొందించి, విద్యార్థులు సమాచారాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించేలా చేయాలన్నారు. న్యూస్ ఓంబుడ్స్‌మన్ వ్యవస్థ కూడా మీడియా ప్రమాణాలు, విశ్వసనీయతను పెంచేందుకు దోహదపడుతుందన్నారు.

### డిజిటల్ యుగంలోనూ నాణ్యతే కీలకం

డిజిటల్ మీడియా, యూట్యూబ్ ఛానళ్ల విస్తరణతో సంప్రదాయ జర్నలిజం ప్రాధాన్యం తగ్గదని రామ్ స్పష్టం చేశారు. పరిశోధనాత్మక, డేటా ఆధారిత, వివరణాత్మక రిపోర్టింగ్ ద్వారా ప్రింట్ మీడియా తన విశ్వసనీయతను మరింత పెంచుకోవచ్చన్నారు. ఆల్ట్ న్యూస్ సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ సిన్హా మాట్లాడుతూ జర్నలిస్టులు, పాఠకుల భాగస్వామ్యంతో ప్రత్యామ్నాయ ఆర్థిక నమూనాలను ప్రోత్సహించాలని సూచించారు. తప్పుడు సమాచారం, దుష్ప్రచారం, రాజకీయ-స్వార్థ ప్రయోజనాల ప్రభావాన్ని అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

### జర్నలిస్టుల భద్రతపై చర్చ

జర్నలిస్టులకు తగిన వేతనాలు, వృత్తిపరమైన శిక్షణ, ఉద్యోగ భద్రత కల్పించాల్సిన అవసరాన్ని ప్యానెల్ సభ్యులు ప్రస్తావించారు. జర్నలిస్ట్ ఉమా సుధీర్ మోడరేట్ చేసిన చర్చలో సయ్యదా ఫైజా కిర్మానీ తదితరులు పాల్గొన్నారు. ప్రెస్ క్లబ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎస్. విజయ్ కుమార్ రెడ్డి, ఫెడరేషన్ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల అతిథులను సత్కరించారు.

### 'హైదరాబాద్ డిక్లరేషన్'కు ఆమోదం

ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ఆధ్వర్యంలో 2026 ఆగస్టు 23న హైదరాబాద్‌లో జరిగిన గ్రాండ్ లాంచ్ మీడియా కాన్‌క్లేవ్లో, సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం--1860 కింద ఏర్పాటు చేసిన ఫెడరేషన్ ఈ క్రింది కార్యాచరణ ప్రణాళికను ఆమోదించింది. ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా, ప్రెస్ క్లబ్ హైదరాబాద్, గౌహతి ప్రెస్ క్లబ్, ముంబై ప్రెస్ క్లబ్, చండీగఢ్ ప్రెస్ క్లబ్, అగర్తలా ప్రెస్ క్లబ్, కోల్‌కతా ప్రెస్ క్లబ్, స్టేట్ ప్రెస్ క్లబ్, మధ్యప్రదేశ్, చెన్నై ప్రెస్ క్లబ్, బెంగళూరు ప్రెస్ క్లబ్ ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ లో సభ్య క్లబ్బులు.

### కార్యాచరణ ప్రణాళిక :

జర్నలిజం అభివృద్ధి కోసం దేశవ్యాప్తంగా ఉన్న ప్రెస్‌క్లబ్‌లతో వివిధ కార్యక్రమాలు, కార్యక్రమాల అమలు, ఉమ్మడి చర్యల విషయంలో సమన్వయం చేయడం. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) లో పేర్కొన్న విధంగా జర్నలిజాన్ని ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించేందుకు పత్రికా స్వేచ్ఛను మరింత బలోపేతం చేయడం. జర్నలిస్టులు, మీడియా సిబ్బంది ఎదుర్కొంటున్న భద్రత, రక్షణ (శారీరక, మానసిక, ఉద్యోగ సంబంధిత) సమస్యలు, ఇతర ఇబ్బందులను వెలుగులోకి తీసుకురావడం. చట్టబద్ధమైన జర్నలిజం నిర్వహిస్తున్నందుకు ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలు లేదా ఇతర ప్రభుత్వేతర సంస్థల వేధింపులు, చర్యలను ఎదుర్కొంటున్న జర్నలిస్టులకు న్యాయ సహాయం అందించడం, పత్రికా స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛపై ప్రతికూల ప్రభావం చూపే ఏదైనా చట్టానికి వ్యతిరేకంగా చట్టపరమైన జోక్యం చేపట్టడం వంటి కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. తగిన ప్రాధాన్యం ఉన్నప్పటికీ నిధుల కొరతతో ఉన్న అంశాలు, సమస్యలపై పనిచేస్తున్న జర్నలిస్టులకు రిపోర్టింగ్ ఫెలోషిప్‌లు అందించడం, జర్నలిస్టులు, మీడియా సిబ్బంది హక్కుల పరిరక్షణ కోసం ఉమ్మడి వేదిక ఏర్పాటు చేసి, వారి హక్కుల కోసం వాదించడం, దేశంలోని రాష్ట్ర స్థాయి ప్రెస్ క్లబ్‌ల మధ్య మెరుగైన నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసి, సామూహిక చర్యలకు ఏకీకృత వేదికను రూపొందించడం, రాష్ట్ర స్థాయి ప్రెస్ క్లబ్‌ల మధ్య వనరులను పరస్పరం పంచుకునే విధానాన్ని ప్రోత్సహించడం ద్వారా పరస్పర ప్రయోజనం, అభివృద్ధికి తోడ్పడడం, భారతదేశంలోని పత్రికా రంగ పరిస్థితి, మీడియా ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలపై నివేదికలు, వ్యాసాలు ప్రచురించడం, ఆడియో-విజువల్ కంటెంట్ రూపొందించడం, పరిశోధనలు నిర్వహించడం, జర్నలిస్టుల వృత్తిపరమైన అభివృద్ధి కోసం శిక్షణా కార్యక్రమాలు, సెమినార్లు, వర్క్‌షాప్‌లు, సదస్సులు, ఇతర విద్యా కార్యక్రమాలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు రూపొందించనున్నట్లు తెలిపారు.

# రక్తదానం గొప్ప మానవతా సేవ

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త





**హైదరాబాద్ (జనంసాక్షి) :** రక్తదానం గొప్ప మానవతా సేవ అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. ప్రగతి నగర్‌లో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్), ఆదిత్య బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) ప్రగతి నగర్ డివిజన్ వినయ్ గుప్త, ఆదిత్య బ్లడ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ప్రగతి నగర్‌లోని శ్రీనివాస్ నగర్ కాలనీ పార్క్‌లో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన దాతలను అభినందిస్తూ, వారి సేవా భావాన్ని ప్రశంసించారు. అలాగే బీపీ షుగర్ వున్నవారికి చెకింగ్ చేసి మందులు అందజేశారు. కండ్ల పరీక్షలు నిర్వహించారు. పేద వారి కోసం ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ రక్తదానం ఒక గొప్ప మానవతా సేవ అని, మనం ఇచ్చే ఒక్క యూనిట్ రక్తం అవసరమైన వారికి ప్రాణదాతగా నిలుస్తుందని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక అనేక మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో యువత, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం సురక్షితమైనదని, కొద్ది సమయంలోనే రక్తదానం పూర్తి చేయవచ్చని నిర్వాహకులు తెలిపారు. రక్తానికి ప్రత్యామ్నాయం లేదని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా రక్తదాన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ ప్రగతినగర్ డివిజన్ ప్రెసిడెంట్ అజయ్, వినయ్ నాయకులు డివిజన్ ప్రతినిధులు డాక్టర్స్ , సిస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.




# పవర్ ఎక్స్‌పోకు భారీ స్పందన

**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా టీజీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'పవర్ ఎక్స్‌పో-2026'కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఆదివారం నగరంలో భారీ వర్షం కురిసినప్పటికీ విద్యార్థులు, యువత, కుటుంబ సమేతంగా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్టాళ్లను సందర్శించారు. ఆగస్టు 22న ప్రారంభమైన ఈ మూడు రోజుల ఎగ్జిబిషన్ సోమవారంతో ముగియనుంది. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నుంచి వినియోగదారుడి ఇంటి వరకు విద్యుత్ సరఫరా జరిగే విధానాన్ని ప్రత్యక్షంగా వివరించేలా ఏర్పాటు చేసిన 132 కేవీ, 33 కేవీ సబ్‌స్టేషన్ల మినియేచర్ మోడల్స్, అండర్‌గ్రౌండ్ కేబుల్ లేయింగ్ విధానాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. విద్యుత్ ప్రయాణాన్ని విజువల్ ఎఫెక్ట్స్‌తో వివరించే ప్రత్యేక లేజర్ షో, ఫ్లైఓవర్ల కింద ఏర్పాటు చేసే సరికొత్త 'హైబ్రిడ్ ఇండోర్ సబ్‌స్టేషన్ల' నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల కోసం ప్రతి గంటకు క్విజ్ పోటీలు, చిన్నారుల కోసం 'పవర్ గేమ్స్' నిర్వహించి బహుమతులు అందజేస్తున్నారు.

1910లో నిజాం కాలంలో డీజిల్ జనరేటర్లతో మొదలైన హైదరాబాద్ విద్యుత్ వ్యవస్థ ప్రస్థానం.. 1920లో హుస్సేన్‌సాగర్ థర్మల్ స్టేషన్, 1959లో ఏపీఎస్ఈబీ ఏర్పాటు, 1998 సంస్కరణల నుంచి నేటి స్మార్ట్ గ్రిడ్, ఏఐ ఆధారిత డిజిటల్ సేవల వరకు సాగిన 120 ఏళ్ల చారిత్రక పరిణామాలను ప్రత్యేక ఫొటో గ్యాలరీ ద్వారా ప్రదర్శించారు. దీంతో పాటు గృహ జ్యోతి, పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్, ఈవీ చార్జింగ్ స్టేషన్లు, విద్యుత్ భద్రతా ప్రమాణాలపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.
















Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370